బుధవారము, 1 మార్చి, 1989

(సభ ఉదయం 8-30 గంటలకు సమావేశమైనది)

(సభాపతి అధ్యక్ష స్థానములో వున్నారు)

## ప్రశ్నలు — వాగ్రూప సమాధానములు

## ఆపరేషన్ బ్లాక్ బోర్డు పథకం క్రింద మండలాలకు నిధుల కేటాయింపు

61—

*10476 — సర్వశ్రీ పి. వెంకటరత్నం (తిరువూరు), కె. వెంకటరావు (మల్లేశ్వరం), ఎం. వి. కృష్ణారావు (ఇచ్ఛాపురం) :— విద్యాశాఖ మంత్రి దయచేసి ఈ క్రింది విషయములు తెలిపెదరా :

(అ) ఆపరేషన్ బ్లాక్ బోర్డు పథకం క్రింద నిధులను ఎంపిక చేయబడిన కొన్ని మండలాలకు మాత్రమే కేటాయించిన విషయం వాస్తవమేనా; అయినచో అట్టి ఆంక్షలకు కారణాలెవ్వి ;

(ఆ) రాష్ట్రంలోని అన్ని మండలాలకు నిధులను కేటాయించటానికి ఏదైనా ప్రతిపాదన కలదా ?

విద్యాశాఖా మంత్రి (శ్రీమతి వై. సీతాదేవి) :- (అ); (ఆ): అవునండి.

ఆపరేషను బ్లాక్ బోర్డు పథకం ప్రాథమిక విద్య ప్రమాణాలను మెరుగు పరచాలని ఉద్దేశిస్తున్నది. దశలవారిగా రాష్ట్రంలోని అన్ని ప్రాథమిక పాఠశాలలకు వర్తింపచేసే అతి ముఖ్యమైన పథకమిది. దీనిని పటిష్టవంతంగా అమలు చేయడానికి ప్రాంతంవారి విధానాన్ని అనుసరించడం జరిగింది. మండలం మునిసిపలు బ్లాకును యూనిటుగా తీసుకొని మొదటి దశలో 20 శాతం మండలాలలోను, రెండవదశలో 30 శాతం మండలాలలోను, మూడవదశలో మిగిలిన 50 శాతం మండలాలలోను దీనిని అమలు చేస్తున్నారు. ఆ ప్రకారంగా 1988, జూన్/జూలై నెలలో 20 శాతం మండలాలకు నిధులు మంజూరు చేయడం జరిగింది.

శ్రీ పి. వెంకటపతి (సత్తెనపల్లి) :— అధ్యక్షా, ఆపరేషన్ బ్లాక్ బోర్డు పథకం అమలుకు పాఠశాలలను ఏ ప్రాతిపదికపై ఎంపిక చేస్తున్నారు ? ఎంపిక చేసిన స్కూళ్ళలో చాలా చోట్ల మీద పెట్టబోయే పరికరాలను కాపాడడానికి తలుపులు కూడా లేవు. ఆపరేషన్ బ్లాక్ బోర్డు పథకం అమలుకోసం నిర్మించిన బిల్డింగ్స్ ఉపయోగకరంగా లేవు. ఆపరేషన్ బ్లాక్ బోర్డు పథకం అమలుచేసే పాఠశాలలకు, మిగతా పాఠశాలలకు మధ్యవున్న తేడా ఏమిటి ?

శ్రీమతి వై. సీతాదేవి :— అధ్యక్షా, దీనిని నేషనల్ ఎడ్యుకేషనల్ పాలసీ క్రింద అమలు చేయడం జరుగుతున్నది. మూడు రకాలైన గైడ్ లైన్స్ దీనిని అమలు చేయడం జరుగుతున్నది. ఎక్కడైతే ఎడ్యుకేషనల్లీ బేక్ వర్డ్ నెస్ వుందో అక్కడ అమలుచేయడం జరుగుతున్నది, అదేవిధంగా ఎస్. సి., ఎస్. టి. లను కవర్ చేయడానికి గైడ్ లైన్స్ ప్రకారం ప్రాంతాలను ఎంపికచేయడం జరుగుతోంది. దీనిని మూడు ఫేజులుగా విభజించడం జరిగింది. మొట్టమొదటి ఫేజ్‌లో 20 శాతం తీసుకొమ్మని చెప్పడం జరిగింది. అట్లాగే రెండవ ఫేజ్‌లో 30 శాతం, మూడవ ఫేజ్‌లో అంటే 1988—89, 1989—90 లో 50 పర్సెంట్ కవర్ చేయాలి. ముఖ్యంగా మొదటి ఫేజ్‌లో 6352 ప్రైమరీ స్కూల్స్ తీసుకోవడం జరిగింది. గది ఒక్కంటికి 50 వేల రూపాయల చొప్పున శాంక్షన్ చేయడం జరిగింది. రెండు గదులు, వరండా నిర్మించాలని, టాయిలెట్ ఫెసిలిటీస్ కూడా కల్పించాలని ఇనిస్ట్రక్షన్స్ వున్నాయి, ఆ ప్రకారం చేయడం జరుగుతుంది. ఇక వారు చెప్పింది ఏమిటంటే అదనంగా ఫండ్స్ ఎలొకేషన్ చేయడం జరగదు, ఎన్. ఆర్. ఇ. పి., ఆర్. ఎల్. ఇ. జి. పి. కార్యక్రమాల క్రింద, అట్లాగే స్టేట్ ఫండ్స్ నుంచి ఇవి చేసుకోవాలని చెప్పారు.

శ్రీ డి. శ్రీపాదరావు (మంథని) :— అధ్యక్షా, ఆపరేషన్ బ్లాక్ బోర్డు స్కీమ్ ఏ సంవత్సరం మొదలు పెట్టారు ? దానికి రూల్స్ ఏమిటి ? బేక్ వర్డ్ ఏరియాలలో చేస్తామన్నారు ; బిల్డింగ్ కు 50 వేలు శాంక్షన్ చేయడం జరుగుతుంది అన్నారు. మొదటి దశలో 20 శాతం మండలాలలో చేపట్టినప్పుడు వెనుకబడిన ప్రాంతాలలోనూ, ఎస్. సి., ఎస్. టి. లు వున్న ప్రాంతాలలోనూ చేపట్టలేదన్న విషయం వాస్తవమేనా ? ఏ ఏ మండలాలలో చేపట్టారో వాటి వివరాలు టేబుల్ పై పెడతారా ?

శ్రీమతి వై. సీతాదేవి :— మొట్టమొదట 1987—88 లో ఈ పథకం చేపట్టడం జరిగింది. బేక్ వర్డు నెస్ ను బట్టి గైడ్ లైన్స్‌ను బట్టి ప్రాంతాలను నిర్ణయించడం జరిగింది. అందువల్ల ఎక్కడ అవకతవకలు జరిగాయని మా దృష్టికి రాలేదు. ఏదైనా మాదృష్టికి వస్తే తప్పకుండా చర్యతీసుకొంటాము. వివరాలు టేబుల్ పై పెట్టడం జరుగుతుంది. ఇకపోతే గైడ్ లైన్స్ ఏమిటో చదివి వినిపిస్తాను.

"Provision of atleast two reasonably large rooms with separate toilets for boys and girls; Provision of atleast two teachers and as for as possible one woman teacher amongst them, Provision of

essential teaching meterial, i.e., black board, chalkpieces, library books, etc."

యాన్యువల్ గైడ్‌లైన్సు, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఇచ్చింది ఏమిటంటే

> "No District may be leftout, out of the total number of Blocks in the District, preference should be given to those which are educationally disadvantageous position belonging to S.C., S.T. and Minister."

(Interruption)

శ్రీ సి.హెచ్. విఠల్ రెడ్డి (నర్సాపూరు):— అధ్యక్షా, రాష్ట్రంలోని అభివృద్ధి కార్యక్రమాలకోరకు ఎన్.ఆర్.ఇ.పి. ఆర్.ఎల్.ఇ.జి.పి. పథకాల క్రింద వచ్చే డబ్బును ఆపరేషన్ బ్లాక్‌బోర్డు పథకానికి మరలిస్తున్నారు. దీని పర్యవసానంగా రహదారుల నిర్మాణంవంటి కార్యక్రమాలు కుంటుపడుతున్నాయి. అందువల్ల ఆపరేషన్ బ్లాక్ బోర్డు పథకం అమలుకు అదనంగా డబ్బు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరుతుందా ?

శ్రీమతి వై. సీతాదేవి :— పరిశీలిస్తాము.

ముఖ్యమంత్రి (శ్రీ ఎన్.టి.రామా రావు) :—దీని విషయంలోనే కాదు, విద్యావిషయంలో కేంద్రప్రభుత్వ సహాయాన్ని కోరడం ఇదివరకే జరిగింది. కాని ఎప్పటికప్పుడు మేము అనుకొన్నంతగా సహాయం రాకపోవడం జరుగుతోంది, ఏ మాత్రం వారికి దయరాలేదని మనవిచేస్తున్నాను.

శ్రీ పి. నర్సిరెడ్డి (మక్తల్):—ఈ పథకం క్రింద పాఠశాలలు ఎంపికచేసే అంశం చాలా ముఖ్యమైంది. పాఠశాలలను ఎంపికచేసేందుకు అనుసరిస్తున్న నార్మ్సు ఏమిటి ? ఏ అధికారి పాఠశాలలను ఎంపికచేస్తున్నారు ? వారు పాఠశాలలను ఎంపికచేసేముందు ఏవిధమైన సమాచారం తెప్పించుకొంటున్నారు ? ఎంపిక సక్రమంగా జరిగిందా, లేదా అన్న విషయం ప్రభుత్వం ఎప్పుడైనా పరిశీలించిందా ?

శ్రీమతి వై. సీతాదేవి :—జిల్లా ప్రజాపరిషత్ అధ్వర్యాన జరుగుతుంది. అక్కడ మండల ప్రజాపరిషత్‌ల అధ్యక్షులు మొదలైన వారంతా డిస్కస్ చేసి వారు రికమండ్ చేసిన వాటినే ఒక కమిటీద్వారా ఎంపిక చేయడం జరుగుతోంది.

శ్రీ జె.సి. దివాకర్ రెడ్డి (తాడిపత్రి):—అధ్యక్షా, జిల్లా పరిషత్ చైర్మన్ మండలాధ్యక్షులు ఎంపికచేసారని చెప్పారు. ఇది చాలాసత్యదూరమైన విషయం. ఒక్క కడప, అనంతపురం జిల్లాలోనే కాదు–ఎక్కడ కూడా మండలాధ్యక్షులతో సంప్రదించి ఎంపికచేయడంలేదు. ఎవరి ఇష్టానుసారం వారుచేస్తున్నారు. భవనాల నిర్మాణానికి గైడ్‌లైన్సు వున్నాయని, లాబరెటరీ, లైబ్రరి సౌకర్యాలు కూడా కలుగజేయాలని మంత్రిగారు అన్నారు కాని అలా ఎక్కడా కట్టిన

సాధించ లేదు. ఇక ఇంతవరకు ఈ పథకం అమలుకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చింది ఎంత ? అందులో ఖర్చుపెట్టింది ఎంత దయచేసి చెప్పాలని కోరుతున్నాను.

8–40 ఉ. శ్రీమతి పి. సీతాదేవి:—గవర్నమెంటు ఆఫ్ ఇండియా గైడ్ లైన్స ప్రకారం- No separate fund will be given as part of the N.R,E.P. and R.L.G.P. As far as the expenditure is concerned, the State Government has to mobilise its own resources from the 9th Finance Commission and U.K. Project....

(Interruption)

Dr. M.V. Mysoora Reddy (Kamalapuram):—What are the funds mobilised from the 9th Finance Commission and U.K. Project, etc? what about the State's resources? ఏమి మోబిలైజ్ చేశారు? గైడ్ లైన్స్ వయలేట్ చేసి జిల్లా ప్రజా పరిషత్ చైర్ మెన్స్ సెలెక్టు చేశారు. చైర్ మెన్‌లకు సమాచారం లేకుండా డి.వో.లు అన్నీ సెలెక్టు చేశారు. గైడ్ లైన్సును వయలేట్ చేసి మండలాలను సెలెక్టు చేశారు. 9వ ఫైనాన్సు కమీషన్ ఏమివాన్ని ఎక్స్‌ప్లైన్ చేయాలి. స్టేట్ రిసోర్సెస్ ఏమి ఇచ్చారు? అది తెలుపాలి?

శ్రీ ఎన్. టి. రామారావు:—డిస్ట్రిక్టు కమిటీలో డిఇవో, కలెక్టరు, జిల్లా ప్రజాపరిషత్ చైర్ మెన్ గారు ముగ్గురు కమిటీలో ఉంటారు. వారు కమిటీగా ఏర్పడి వెనుకబడినటువంటి ప్రాంతాలలో ప్రైమరీ ఎడ్యుకేషన్ క్రింద వీటిని ఖర్చు చేయడం జరుగుతుంది.

శ్రీ డి.కె. సమరసింహారెడ్డి (గద్వాల్) :— టూకీగా మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగింది చెపుతాను. ప్రశ్నకు అనుబంధంగానే చెప్పుతున్నాను. మంత్రిగారు చెప్పిన జవాబుకు, ముఖ్యమంత్రిగారు చెప్పిన జవాబుకు పొంతన లేకుండా ఉంది. మా జిల్లాలో ఏ నిర్దేశిక సూత్రాల ప్రకారం జరిగింది?

Sri N.T. Rama Rao:–I am telling through you, Sir, that is a a policy adopted. 3 man Committee is there with the District Collector concerned, Z.P. Chairman concerned and D.E.O. concerned.

శ్రీ డి.కె. సమరసింహారెడ్డి:—మంత్రిగారు చెప్పిన జవాబుకు ముఖ్యమంత్రిగారు చెప్పిన జవాబుకు రెండింటికి పొంతన కుదరడం లేదు. ఇది గాక, మా జిల్లాలో జరిగిన సమాచారం తమద్వారా ముఖ్యమంత్రి గారి దృష్టికి తెస్తున్నాను. ఆపరేషన్ బ్లాకు బోర్డు గురించి 1987–88లో తీసుకుంటే..

Sri N.T. Rama Rao:—I have given the facts.

శ్రీ డి.కె. సమరసింహారెడ్డి:—మంత్రిగారి, ముఖ్యమంత్రిగారి జవాబులలో ... వచ్చినప్పుడు ఏమి చేయాలి. ఉదాహరణకు మా జిల్లాలో 88 స్కూల్సు 1987–88 విద్యా సంవత్సరంలో ఆపరేషన్ బ్లాకుబోర్డు పథకం క్రింద తీసుకుంటే

అందులో 71 గ్రూప్సు ఒకే తాలూకాలో ఇవ్వడం ఏ నిర్దేశిక సూత్రాల ప్రకారం జరిగింది? ఎవరు చేశారు? ఇది వారికి సంబంధించిన శాసన సభ్యులను అడగండి? జిల్లాప్రజాపరిషత్ మీటింగులో అడిగితే మాకు తెలియదు అంటున్నారు. ఏ సిద్ధాంతం ప్రకారం చేశారు? Is it not violation of rules and guide-lines?

శ్రీ ఎన్. టి. రామారావు:-గౌరవసభ్యులు వారి జిల్లా విషయంలో వారికి బాగా తెలుసు కాబట్టి, దయచేసి సమగ్రంగా అన్ని వివరాలతో వ్రాసి ఇస్తే పరిశీలిస్తాము.

డా. ఎం.వి. మైసూరారెడ్డి:-మీ రిసోర్సెస్ ఏమి మోబిలైజ్ చేశారు?

శ్రీ డి.కె.సమరసింహారెడ్డి:-సభలో సభ్యులు చెప్పుతున్నప్పుడు మంత్రిగారు ముఖ్యమంత్రిగారు గాని అప్పటికప్పుడు వ్రాసుకుని, దాని మీద విచారం చేయడం ఏక్షన్ తీసుకోవడం జరిగేది. ఇదివరకు ఉన్న సంప్రదాయం ఇది. ఉత్తరం వ్రాయమనడం ఇది ఏమి పద్ధతి: దాన్ని నోట్ చేసుకోవాలి. అధికారులచేత విచారణ చేయించుకోవాలి. సభకు చెప్పవలసి ఉంటుంది. మళ్ళీ నాకు వ్రాసి పంపండి అనడం — ముఖ్యమంత్రి తమాషాగా ...

శ్రీ ఎన్.టి. రామారావు:-పంపకపోతే మానేయండి If you can send them only we can rectify

(Interruption)

శ్రీ ఎం. బాగారెడ్డి (జహీరాబాద్):—అక్కడ నుంచి సహాయం రాని ఏదైనా ప్రిన్సిపల్‌తో డిస్ట్రిబ్యూట్ చేస్తుంటాము. ప్రిన్సిపల్ ఏమి పెట్టారు? ఇప్పుడు గౌరవ సభ్యులు అడిగినట్లు, ముఖ్యమంత్రిగారు ఒక సమాధానం, మంత్రిగారు ఒక సమాధానం చెప్పితే, ఎవరిది కరెక్టు? అనుకోవాలి. వీరిద్దరు కలిసి ఏదైనా సమాధానం చెప్పితే బాగుంటుంది. ఈ విషయంలో జనరల్‌గా ఈ మధ్య శాసన సభ ప్రారంభమైనప్పటి నుంచి ప్రతి సమస్యకు వ్రాసి పంపించండి, సమాధానం పంపుతామనే ధోరణి ఏది అయితే ఉన్నదో అది శాసన సభ హుందాతనానికి తగినది కాదు. ప్రిపేర్ అయి మంత్రులు సమాధానాలు చెప్పవలసిన బాధ్యత ఉంటుంది. లేకపోతే, ప్రశ్నను పోస్టుపోన్ చేసి అయినా సమాధానం చెప్పించవలసిన బాధ్యత తమరిపై ఉంటుంది. ఆ విధంగా చేయాలి గాని, క్వశ్చన్ అడిగిన తరువాత ఇంకొకటి వ్రాసి పంపించడం యీ శాసన సభకు హుందాగా ఉండదు.

శ్రీ ఎన్. టి. రామారావు :—గౌరవ సభ్యులు, బాగారెడ్డిగారు తమ ద్వారా అడుగుతున్నారు—ఏదైనా మంత్రివర్యులు ఫలానాది అడుగుతారని ఊహించడం కాదు. వారు వేసిన ప్రశ్నకు సమాధానం ఇవ్వడానికి, అనుబంధ ప్రశ్నలో ఏదైనా విషయంలో కనుక ఇంకా సమాధానం ఇవ్వవలసి వచ్చినప్పుడు ముఖ్యంగా నా ద్వారా ఇవ్వడం జరుగుతున్నది.

(ఇంటరప్షన్)

శ్రీ ఎం. బాగారెడ్డి :—తమద్వారా ముఖ్యమంత్రిగారికి మనవిచేస్తున్నాను వారు గాని, వారి మంత్రులు గాని......

(ఇంటరప్షన్)

గౌరవ ముఖ్యమంత్రిగారు యీ శాసన సభలో వచ్చినప్పటినుంచి సప్లిమెంటరీస్‌లో చాలావరకు ప్రిపేర్ అయి వస్తే, ఊహించనటువంటిది కూడా అర్థం అవుతుంది. కాకపోతే, యీ కొత్త పద్ధతి ఏది అయితే పెట్టారో 'మీరు వ్రాసి పంపించండి. అనేది దాన్ని విరమించుకుని, దానికి గవర్నమెంటు జనరల్ డిమాండులో గాని, దేనిలో గాని సమాధానం రావాలి. కాని యీ పద్ధతి—వ్రాసి పంపండి అనడం బాగాలేదు. శాసన సభ్యులు వేసిన క్వశ్చన్స్‌కు లెటర్స్ వ్రాయవలసిన అవసరం లేదు.

శ్రీ సి.హెచ్. విద్యాసాగరరావు (మెట్‌పల్లి) :— ఎన్. ఆర్. ఇ. పి., ఆర్.ఎల్.ఇ.జి.పి., ఇతర కార్యక్రమాలు మండలాల్లో, జిల్లా ప్రజాపరిషత్‌లలో తీసుకుంటున్నాము. ఈ ఆర్.ఎల్.ఇ.జి.పి. ఎన్.ఆర్.ఇ.పి. నిర్దేశిత సూత్రాలకు భిన్నంగా ప్రవర్తిస్తే అక్కడి సభ్యులు వ్యతిరేకిస్తున్నారు. శ్రీ డి. కె. సమరసింహారెడ్డిగారు చెప్పినట్లుగా బ్లాకుబోర్డు ఆపరేషను క్రింద విపక్ష చూపి కొన్ని గ్రామాలను తీసుకున్నట్లు చెప్పారు. అదే విధంగా మిగతా జిల్లాలలో ఉండవచ్చు. ముఖ్యమంత్రిగారు జనరల్‌గా హామీ ఇస్తున్నారు. మొత్తం రాష్ట్ర వ్యాప్తంగా యీ బ్లాకుబోర్డు ఆపరేషనులో యీ నిబంధనలకు భిన్నంగా ఇస్తే క్యాన్సిల్ చేయాలని అధికారులకు ఆదేశాలు ఇస్తే సరిపోతుంది. రెండవది—జనరల్‌గా బ్లాకుబోర్డు ఆపరేషనుకు సంబంధించి చర్చలు మండలాలలో జిల్లా పరిషత్‌లలో వచ్చినప్పుడు ఒక ప్రశ్న వస్తుంది. జనరల్ ఎడ్యుకేషను ఫండ్సులో 6 శాతం చాక్‌పీసెస్‌ను డస్టర్స్, టీచర్ కూర్చొనడానికి కుర్చీ కొనుక్కొనడానికి ఉంటుంది. అది రిలీజ్ కాకుండా ఉండడంవల్ల చాలామంది ఉపాధ్యాయులు కొనలేకపోతున్నారు. చాలా ఇబ్బంది అవుతున్నది. బ్లాకుబోర్డు ఆపరేషను కోసం కేంద్ర ప్రభుత్వం ఎన్.ఆర్.ఇ.పి., ఆర్.ఎల్.ఇ.జి.పి. కార్యక్రమాలకు ఫండ్సు ప్రొవైడ్ చేసింది. దానిలో కూడా యీ బ్లాకుబోర్డు, చాక్‌పీసెస్, డస్టర్, టీచర్ల కుర్చీలు, సిబ్బందికి జీతాలు కూడా మన ప్రభుత్వం రిలీజ్ చేయాలి. రిలీజ్ చేయకుండా ఉన్నది. జీతాలు లేకుండా ఉన్నారు. ఈ సందర్భంలో ముఖ్యమంత్రిగారు హామీ ఇస్తే బాగుంటుంది.

ఒకవేళ ప్రభుత్వం రిలీజ్ చేయడంలో అలస్యమైతే, సంబంధిత మండలాలకు
8-50 ఉద. జిల్లా ప్రజా పరిషత్తులకు డబ్బు వినియోగించే విధంగా అధికారాలు యిస్తే బాగుంటుందని ముఖ్యమంత్రి గారికి తమ ద్వారా మనవి చేస్తున్నాను.

శ్రీ యన్. టి. రామారావు :— అధ్యక్షా, దీని విషయం సవినయంగా తమ ద్వారా గౌరవసభ్యులు బాగారెడ్డి గారికి మనవిచేయదలచుకున్నాను. ప్రతి విషయం ఉత్తరం వ్రాయండి అని అనడం లేదు. అమలుచేయడానికి కొన్ని సూత్రాలతో విధానాలతో, ఆదేశాలు యివ్వడం జరుగుతుంది. ఎక్కడయినా పొరబాటుగా అమలు జరుగకపోయినప్పుడు, మీ దృష్టికి వచ్చినప్పుడు, దయచేసి

మీకు తెలిసినవి మాకు యివ్వండి అనుకుంటాము తప్ప వేరు కాదు. రాష్ట్ర వ్యాప్తంగా యిటువంటి దురాచారాలు జరుగలేదు. జరగబోవడం లేదు. వారి నోటీసుకు వచ్చింది గనుక అడిగామే తప్ప. ప్రతీ విషయం ఉత్తరం వ్రాయమని అడగడం అసంగతంగా, అసంబద్ధ విధానంగా మనవిచేస్తున్నాను. కన్‌టిన్‌జెన్సీ ఫండ్ ఆరు శాతం ఈనాడు వుండే విధానం, చాక్‌పీసులు, డస్టర్లు, మిగిలిన అవసరాలకు వాడుకోడానికి ఆరు శాతం యివ్వవలసిందిగా ప్రభుత్వం నిర్ధారణ చేయడం జరిగింది. ఈనాడు వుండే అవసరాలకు తగినట్లుగా మాకు వుండే పరిధిలో పూర్తిగా ఈ అవసరాలను గుర్తించడం జరుగుతుందని తమ ద్వారా మనవి చేస్తున్నాను.

శ్రీ సి.హెచ్. విద్యాసాగరరావు :— అధ్యక్షా, ఈ నిధులు రిలీజ్ కాలేదు. ఈ ఎమౌంట్ రిలీజ్ అయ్యే వరకు పాఠశాలలలో టీచర్స్ చాక్‌పీసెస్ ఎక్కడి నుండి తీసుకోవాలి అనేది రాష్ట్ర వ్యాప్త ప్రశ్న. టీచర్స్ చాక్‌పీసులు లేని కారణంగా బ్లాక్ బోర్డు మీద వ్రాయము అని కూర్చుంటే. అధికారులు మందలించే పరిస్థితి లేదు. రిలీజ్ అయ్యేలోపల సంబంధిత మండలాలకు అధికారం యిస్తే, ముందుగా ఖర్చుచేసుకుంటారు. ఇప్పుడు ఆ అధికారం లేదని తర్జన భర్జన వుంది. తరువాత రీఎంబర్స్‌మెంట్ గాని, అడ్జస్ట్‌మెంట్ గాని చేసుకోవచ్చు.

శాసనసభా వ్యవహారాల శాఖామంత్రి (శ్రీ సి. ఆనందరావు) :—అధ్యక్షా, ఇప్పటికి 20 నిముషాల పైన సమయం గడచిపోయింది. ఒక పద్ధతిని పాటించండి. క్వశ్చన్ వేసిన వారికి ఒక సప్లిమెంటరీ, తరువాత అవసరం అనుకుంటే యివ్వండి. ప్రశ్న వేసినప్పటికీ కొంతమంది తప్పనిసరిగా మాట్లాడాలి అనుకోవడం సరికాదు.

## ఆగ్రోస్, మార్క్‌ఫెడ్‌ల ద్వారా ఎరువుల పంపిణీ

62--

*10249-శ్రీ కె. వి. సుబ్బారెడ్డి (నెల్లూరు) :— వ్యవసాయ శాఖా మంత్రి దయచేసి ఈ క్రింది విషయములు తెలిపెదరా :

(అ) రాష్ట్రంలో ఆగ్రోస్, మార్క్‌ఫెడ్‌ల ద్వారా ఎరువుల పంపిణీ జరిగిన విషయం, చాల ప్రాంతాలలో అమ్మకపు స్థానములను ప్రారంభించిన విషయం వాస్తవమేనా ;

(ఆ) ఎ. పి. ఎస్. ఎస్. సి. లిమిటెడ్, పి. ఎ. సి. ఎస్. ల ద్వారా విత్తనములను పంపిణీ చేస్తున్న విషయం వాస్తవమేనా ;

(ఇ) అయినచో, ఎట్టి వ్యాపారమూ నిర్వహించిన ఆగ్రో డిపోలను కొనసాగించుటకు గల కారణము లెవ్వి ?

వ్యవసాయ మార్కెటింగ్ శాఖామంత్రి (శ్రీ బి. సీతారెడ్డి) :— అధ్యక్షా,
(అ) ఔనండీ, రాష్ట్రంలో ప్రారంభించిన ఎరువుల విక్రయ కేంద్రాల సంఖ్య ఈ క్రింది విధంగా వుంది :

ఆగ్రోస్ ద్వారా 1988 అక్టోబర్ వరకు 440 కేంద్రాలు,
అదనంగా — 29 కేంద్రాలు పెరిగాయి.
మొత్తం — 469 కేంద్రాలు ఆగ్రోస్ ద్వారా నడుపుతున్నారు. ప్రాథమిక వ్యవసాయ సంఘాల ద్వారా 2,798 కేంద్రాలు, ప్రయివేటు డీలర్ల ద్వారా 11,194 కేంద్రాలు, మొత్తం 14456 కేంద్రాల ద్వారా ఎరువులు అమ్మడం జరుగుతున్నది.

(ఆ) ఔనండి. 17 ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విత్తనాభివృద్ధి కేంద్రాలు ద్వారా, 407 అగ్రో సేవా కేంద్రాలతోపాటు 1172 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా విత్తనాలను పంపిణీ చేయడం జరుగుతుంది.

(ఇ) ఎట్టి వ్యాపారము నిర్వహించని అగ్రో డిపోలు లేవండి. ఈ కేంద్రాల ద్వారా ఎరువులు, సస్య రక్షణ మందులు మరియు వ్యవసాయ పనిముట్లను అమ్ముతున్నారు. అందువల్ల అగ్రో డిపోలను కొనసాగించుచున్నారు.

శ్రీ కె. వి. సుబ్బారెడ్డి :— అధ్యక్షా, ఈ ప్రశ్న యొక్క ముఖ్య ఉద్దేశం ఏమంటే, అగ్రోస్ తరపున యిస్తున్న ఎరువుల పంపిణీ ఒకవైపు, విత్తనాలు సరి అయిన రైతులకు అందజేయాలనే సదుద్దేశం మరొకవైపు ఉన్నప్పటికీ, సీడ్స్ కార్పొరేషన్‌కు, ప్రైమరీ ఎగ్రికల్చరల్ కో-ఆపరేటివ్ సొసైటీకి వీటిని యిచ్చి, చేస్తున్నప్పుడు, వాటి ద్వారా ఈ మధ్య యిచ్చిన ఎరువులు కానివ్వండి, విత్తనాలు కానివ్వండి కేవలం అక్కడ వున్నటువంటి రాజకీయ పక్షాలకు సంబంధించి ఒకవైపు రైతులకు, అంటే ఒకవర్గానికి చెందిన రైతులకు మాత్రమే అందుతున్న విషయం వాస్తవమా ? అటువంటి విధానాలు రాష్ట్రం మొత్తం మీద ఎన్ని వచ్చాయి ? ఇందువల్ల రైతుల్లో ఒక వర్గం నష్టపడుతున్నారు. టైము లోపల సక్రమ పంపిణీ చేయాలనేది ప్రభుత్వ ముఖ్య ఉద్దేశం అయినప్పటికీ, రాష్ట్రం మొత్తం మీద ఎన్నో సేల్స్ సెంటర్స్ ఏర్పాటు చేసినప్పటికీ, రైతులకు సకాలంలో, సరి అయిన విత్తనాలు, ఎరువులు సరఫరా చేయని మాట వాస్తవమా? అంతే కాకుండా అగ్రో డిపోలలో డీలర్స్‌ను నియమించే కార్యక్రమంలో కొన్ని లక్షల రూపాయల అధికార దుర్వినియోగం జరిగిన మాట వాస్తవమా ? రాబట్టడానికి తీసుకుంటున్న చర్యలు ఏమిటి ?

శ్రీ బి. వీరారెడ్డి :— అధ్యక్షా, ఇంతకుముందు వరకు అటువంటి రిపోర్టు ఏదీ మా దృష్టికి రాలేదు. అటువంటిది ఏదయినా వుంటే, మీరు తెలిపితే పరిశీలన చేస్తాము. అగ్రో సేవా సంఘంలో కొన్ని లక్షల రూపాయల దుర్వినియోగం గురించి గౌరవ సభ్యులు చెప్పారు. మా దృష్టికి తీసుకువస్తే తప్పకుండా పరిశీలన చేస్తాము.

శ్రీ డి. చినమల్లయ్య (ఇందుర్తి) సేల్స్ సెంటర్లను ఏర్పాటు చేయడానికి శాసన సభ్యులకు ఏమయినా అవకాశం వుందా ? సెంటర్లను ఏర్పాటు చేసిన చోట తమకు యిష్టం వచ్చిన వారిని వేస్తున్నందువల్ల, అధిక ధరలకు ఎరువులు అమ్ముతున్న విషయం ప్రభుత్వ దృష్టికి వచ్చిందా ? వస్తే ప్రభుత్వం ఏమి చర్య తీసుకుంది ?

శ్రీ బి. వీరారెడ్డి :— అధిక ధరలకు అమ్ముతున్నట్లు రిపోర్టు ఏదీ మా దృష్టికి రాలేదు. గౌరవ శాసన సభ్యులు ఆ వివరాలను తెలియజేస్తే పరిశీలన చేస్తాము. తగు విధంగా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటాము.

శ్రీ డి. చినమల్లయ్య :— అధ్యక్షా, శాసన సభ్యుల ప్రమేయం లేకుండా వుండడం వల్లనే ఈ విధంగా ఒక పక్షం వారు, తమకు యిష్టం వచ్చినట్లు అధిక ధరలకు అమ్ముతున్నారు. శాసన సభ్యులకు తెలియకుండా, ఎవరో ఒక పక్షం వారిని నియమిస్తున్నారు. అందువల్ల ఒక పక్షానికి చెందిన రైతులకే, ఎరువులు, విత్తనాలు మొదలైనవి అందుతున్నాయి. అంతే కాకుండా అధిక ధరలకు అమ్ముతున్నారు. ప్రభుత్వాన్ని కోరేది ఏమంటే నియామకం అంతా శాసన సభ్యులకు తెలిసి జరిగే విధంగా చేయడానికి ఆమోదిస్తారా ?

శ్రీ బి. వీరారెడ్డి :— అధ్యక్షా, మండల కేంద్రాలలో అవసరాలను బట్టి డిపోలను ఏర్పాటు చేస్తున్నారు. అందువల్ల శాసన సభ్యులకు ఖచ్చితంగా తెలుపవలసిన అవసరం కలుగడం లేదు. ఏదయినా ప్రత్యేకంగా కావాలంటే, దాన్ని పరిశీలిస్తాము.

శ్రీ డి. చినమల్లయ్య :— అధ్యక్షా, 'కావాలి' అంటే అనే మాట కాదు. శాసన సభ్యులకు తెలియకుండా నియామకాలు జరుగుతున్నాయి. ఒక వర్గానికి చెందిన వారు వస్తున్నారు. ఒక పక్షానికే సరఫరా జరుగుతున్నాయి. అంతే కాకుండా అధిక ధరలకు అమ్ముతున్నారు. అటువంటిది జరుగకుండా వుండడానికి శాసనసభ్యుల పరిధిలో నియామకం జరిగే విధంగా చేస్తారా ?

శ్రీ బి. వీరారెడ్డి :— అధ్యక్షా, ఆ మండలంలో ఎక్కడ అవసరం వుంటే అక్కడ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రత్యేకంగా ఏక పక్షం అనేది ఏమి లేదు.

శ్రీ వి. శ్రీరాములు (వర్ధన్నపేట) :— అధ్యక్షా, మంత్రిగారు సమాధానం యిస్తూ 'అధిక ధరలకు అమ్మలేదు' అని అన్నారు. వరంగల్‌లో విత్తనాల మొక్కజొన్నలు రూ. 50కి అమ్మవలసిన బస్తా రూ. 90కి అమ్మిన సంగతి, రైతుల ఆందోళన పత్రికా రూపంలో వెలువడిన సంగతి మీ దృష్టికి వచ్చిందా ? ఎరువుల బస్తాల విషయంలో బస్తాకు రూ. 10, రూ. 15 ఎక్కువ వేసి ఆగ్రో డిపోల ద్వారా రైతులకు అందజేసిన విషయాలు అనేకసార్లు మండల్ మీటింగ్స్‌లో సర్పంచులు లేవదీసిన విషయం ప్రభుత్వ దృష్టికి వచ్చిందా ? కల్తీ విత్తనాలు, ఎరువులు మీ డిపోల ద్వారా సప్లయి చేస్తున్న విషయాలు మీ దృష్టికి వచ్చాయా ? వస్తే వీటన్నింటి విషయంలో ఏమి చర్య తీసుకున్నారు ?

శ్రీ బి. వీరారెడ్డి :— అధ్యక్షా, ఆ విషయాలు మా దృష్టికి రాలేదు, ఇంతవరకు. మా దృష్టికి తీసుకువస్తే తప్పక పరిశీలిస్తాము.

శ్రీ వి. నాగేశ్వరరావు (పిఠాపురం) :— అధ్యక్షా, మంత్రిగారు ప్రాథమిక సహకార సంఘాల ద్వారా అమ్మిస్తున్నట్లుగా చెప్పారు. కాని మా దృష్టికి కొన్ని విషయాలు వచ్చాయి. ముఖ్యంగా కొన్ని ప్రాథమిక సహకార సంఘాల దగ్గర

విత్తనాలు కొనడానికి కూడా వారి దగ్గర డబ్బు లేదు. కొన్ని సహకార సంఘాల వారు విత్తనాలను కొని (డబ్బు లేనందున) సరఫరా చేయలేక పోతున్నట్లు తెలియజేస్తున్నాయి. ఈ సంఘాలకు డబ్బు సమకూర్చే విషయం ఆలోచిస్తారా? రేపు రాబోయే మూడవ పంటలకు అయినా యల్ పిజి—20 మినుములు మొదలైనవి త్వరగా రైతులకు అందించే ఏర్పాటు ప్రభుత్వం ద్వారా చేస్తారా?

9—00 ఉ. శ్రీ బి. వీరారెడ్డి:—ప్రాథమిక సహకార సంఘాలకు ఆర్థిక స్తోమత లేకుంటే కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకుల ద్వారా వారికి లోన్స్ ఇస్తారు. లోన్స్ తీసుకొని విత్తనాలు కొనే దానికి వారికి సదుపాయం ఉంది.

శ్రీ వి. నాగేశ్వరరావు:—కొన్ని సొసైటీలు మా దగ్గర డబ్బు లేదు విత్తనాలు కొనము అని చెబుతున్నారు. అది మీ దృష్టికి వచ్చిందా? లేకపోతే నేను మీ దృష్టికి తీసుకు వస్తున్నాను. దీని మీద సరయిన పంథా ఏమి అనుసరిస్తారో మనవి చేయవలసిందిగా కోరుతున్నాను.

శ్రీ బి. వీరారెడ్డి:—అటువంటిది ఏదయినా ప్రత్యేకంగా ప్రభుత్వ దృష్టికి తెస్తే దానికి సదుపాయం కలిగించే ఏర్పాటు చేస్తాము.

శ్రీ వి. నాగేశ్వరరావు:—తూర్పు గోదావరి జిల్లా పిఠాపురం నియోజక వర్గంలో రెండు మూడు సొసైటీలు ఈ విధంగా సమాధానం చెప్పడం జరిగింది.

శ్రీ బి. వీరారెడ్డి:—ఈ సహకార సంఘాలకు 50 శాతం కేష్ 50 శాతం బ్యాంకుల ద్వారా లోన్ తీసుకొని ఇచ్చే దానికి ప్రభుత్వం నిర్ణయించింది. దాని ద్వారా వాడు కోరితే తప్పకుండా సహాయం చేయించే ఏర్పాటు చేస్తాము.

శ్రీ మహమ్మద్ జానీ (గుంటూరు—1):—ఈ ఆగ్రోస్ ద్వారా రైతులకు విదేశాల నుంచే దిగుమతి చేసుకున్న పురుగు నిరోధక మందులు సప్లయి చేస్తున్నారా? ఆగ్రోస్ ద్వారానే సప్లయి చేస్తున్నారా లేకపోతే ఆగ్రోస్‌తో పోటీగా ప్రైవేటు కంపెనీలు ప్రోపగాండా చేసి వారు కూడా రైతులకు సప్లయి చేస్తున్నారా? ఈ రెండు విషయములు క్లియర్ చేయవలసిందిగా మనవి చేస్తున్నాను.

శ్రీ బి. వీరారెడ్డి:—ప్రత్యేక ప్రశ్న వేస్తే తరువాత చెపుతాను.

శ్రీ మహమ్మద్ జానీ:—ఇది ప్రత్యేక ప్రశ్న ఎలా అవుతుంది? ఆగ్రోస్ ద్వారా రైతులకు మీరు విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న పురుగు మందులు సరఫరా చేస్తున్నారా అనేది నా ప్రశ్న. ఇది సెపరేట్ ప్రశ్న ఎందుకు అవుతుంది? దయచేసి మీరు నా రెస్క్యూకి రావాలి. స్పీకర్ గారు సమాధానం చెప్పించండి.

శ్రీ బి. వీరారెడ్డి:— ఇది ఎరువులకు సంబంధించిన జవాబు. వారు అడుగుతున్నది క్రిమి సంహారక మందుల గురించి . . . . .

శ్రీ ఎన్. టి. రామారావు:—విదేశీ మందుల గురించి అడిగారు వారు. మొన్న ప్రకాశం జిల్లాలో ప్రత్తి తెగులు, అలాగే గుంటూరు జిల్లాలోను వచ్చినప్పుడు ఈ మందులు దిగుమతి చేసుకోవడం జరిగింది. దానిలో ఇంపోర్టు డ్యూటీస్‌కి రాయితీ ఇవ్వమని కోరడం, ఇప్పించడం జరిగింది. స్ట్రెయిట్‌గా ప్రభుత్వమే సరఫరా చేస్తోంది.

( ఇంటరప్షన్ )

గౌరవనీయ సభ్యులు అడిగిన దానిని నేను సమాధానం చెప్పాను. ఇతర దేశాల నుంచి మందులు దిగుమతి చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం వారికి కూడా ఈ విధంగా దెబ్బతిన్న రైతులకు సహాయం చేయడం కోసం చేస్తున్నాము అని ఇంపోర్టు డ్యూటీస్‌కి రాయితీలు ఇవ్వమని అడగడం జరిగింది. వారు దయతో అంగీకరించారు.

శ్రీ మహమ్మద్ జానీ:— ఆగ్రోస్ ద్వారా ఇంపోర్టెడ్ పెస్టిసైడ్స్ రైతులకు అమ్ముతున్నారా, లేదా?

శ్రీ ఎన్. టి. రామారావు:— ఆగ్రోస్ ద్వారానే సప్లయి చేశాము. రాష్ట్రప్రభుత్వం సేల్స్‌టాక్స్ దీని విషయములో రద్దు చేసింది. ఒక కోటి రూపాయలు వెంటనే దిగుమతి చేసుకోడానికి ఆర్థికపరమైన సహాయం అందించడం జరిగింది. తమ ద్వారా వారికి మనవి చేస్తున్నాను.

## హైదరాబాదులో నిర్వాసితులకు గృహనిర్మాణ మండలిచే ఇళ్ళ నిర్మాణం

63—

* 10525—సర్వశ్రీ ఎన్. జనార్ధనరెడ్డి ( నాగర్‌కర్నూలు ), ఎస్. వేణుగోపాలచారి ( నిర్మల్ ), కె. ఆదెన్న ( సంతనూతలపాడు ), సి. రామచంద్రారెడ్డి (ఆదిలాబాద్) :—గృహనిర్మాణ శాఖ మంత్రి దయచేసి ఈ క్రింది విషయములు తెలిపెదరా :

(అ) హైదరాబాదులో, నిర్వాసితులైన గుడిసెవాసులకు స్వాధీనం చేయటంకోసం గృహ నిర్మాణ మండలి ఐదు సంవత్సరాల క్రితం యాభై లక్షల రూపాయల ఖర్చుతో 320 ఇళ్ళను నిర్మించిన విషయం వాస్తవమేనా;

(ఆ) ఆ ఇళ్ళను యితరులు చట్టవిరుద్ధంగా ఆక్రమించుకున్నారా;

(ఇ) చట్టవిరుద్ధంగా ఆక్రమించుకొన్న వారందరినీ తొలగించవలసిందిగా ఉన్నత న్యాయస్థానం 3—8—88 వ తేదీన ఆదేశించినదా?

(ఈ) అయినచో, దానిపై తీసుకున్న చర్య ఏమి ?

గృహ నిర్మాణ శాఖామంత్రి (శ్రీ ఎస్. రాజేశ్వర్) :— (అ) అవునండి.

(ఆ) అవునండి.

(ఇ) అవునండి.

(ఈ) అనధికారికంగా ఇళ్ళను ఆక్రమించుకున్నవారికి ఇళ్ళు ఖాళీ చేయాలని నోటీసులు పంపగా వారు హైకోర్టులో రిట్ పిటిషను దాఖలు చేశారు. హైకోర్టు ఆ రిట్ పిటిషన్లను 3-8-1988 తేదీన త్రోసిపుచ్చుతూ, రెండు నెలలలోగా ఇళ్ళను చట్టరీత్యా ఖాళీ చేయాలని ఆదేశించింది. హైకోర్టు తీర్పు పట్ల అసంతృప్తి చెంది వారు సుప్రీం కోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్‌ను దాఖలు చేశారు. సుప్రీం కోర్టు ఆ పిటిషన్‌ను త్రోసిపుచ్చుతూ అర్హులుకాని గుడిసెవాసులను 31-12-88 తేది లోపల ఖాళీ చేయగూడదనియు, ఒకవేళ వీరెవరైనా ఈ క్వార్టర్స్ కేటాయింపు కోసం దరఖాస్తు చేసుకుంటే 31-12-88 లోపే కేటాయింపు విషయంలో నిర్ణయం తీసుకోవాలని తీర్పునిచ్చింది. 21-12-88వ తేదీన దేవేందర్ ఒక దరఖాస్తును బోర్డుకు సమర్పిస్తూ ఆ దరఖాస్తులో పేర్కొన్న వ్యక్తులకు క్వార్టర్స్ కేటాయించవలసిందిగా కోరినారు. ఈ దరఖాస్తును బోర్డు 12-1-89 సమావేశములో క్షుణ్ణంగా పరిశీలించి దరఖాస్తులో పేర్కొన్నవారు దురాక్రమణదారులు అయినందున వారిని వారు ఆక్రమించుకున్న గృహాలనుండి తొలగించవలసిందిగా తీర్మానించారు. ఈ దురాక్రమణదారులకు ఈ క్వార్టర్సును కేటాయించుటకు వీలులేదు. కారణం ఏమనగా ఈ క్వార్టర్స్‌ను బాగ్‌లింగంపల్లి కట్టెలమండి, మురళీధర్ బాగ్, భీమ్‌రావువాడ హౌసింగ్ బోర్డు స్థలంలో నివసిస్తున్న వారికి పునరావాసం కల్పించేందుకు కట్టబడినవి. కోర్టులలో కేసులు పెండింగులో వున్నందువల్ల 'స్టే' ఉత్తరువులు ఇచ్చిన కారణంగా, ఖాళీ చేయించలేకపోయాము, హైకోర్టు చట్టరీత్యా ఖాళీ చేయమని కోరినందున, హౌసింగ్ బోర్డు ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన కాంపిటెంట్ అథారిటీ కాబట్టి కోర్టు ద్వారానే ఖాళీ చేయించాలి. అయితే దీనిపై పై కోర్టులకు అపీలు చేసుకునే అవకాశం ఉంది, కాలాయాపన జరుగుతుంది కాబట్టి హౌసింగు బోర్డువారు డిక్రీ కోసం సుప్రీం కోర్టును అభ్యర్థించారు. ప్రస్తుతం ఈ కేసు సుప్రీం కోర్టులో పెండింగులో ఉంది.

9-10 ఉ. శ్రీ ఎన్. జనార్ధనరెడ్డి :—ఎవరెవరికి ఎలిజిబిలిటి ఉంది? ఏ తేదీలోగా ఎలాట్ చేస్తారు?

శ్రీ ఎస్. రాజేశ్వర్ :—బాగ్‌లింగంపల్లిలో పూర్వం మురళీధరబాగ్, భీమరావువాడ, కట్టెలమండి హౌసింగ్ బోర్డు స్థలంలో అనాదినుంచి నివసిస్తున్న వారికి ఇళ్లు కట్టడానికి నిర్ణయించి 320 ఇళ్లను బాగ్‌లింగంపల్లిలో కట్టారు. వారికి ఇళ్లను కేటాయించడానికి బోర్డు తీర్మానించింది.

శ్రీ ఎన్. జనార్ధనరెడ్డి :—ఎప్పటిలోగా ఇస్తారు?

శ్రీ ఎస్. రాజేశ్వర్ :—ప్రస్తుతం సుప్రీంకోర్టులో కేసు పెండింగులో ఉంది.

శ్రీ డి. కె. సమరసింహారెడ్డి:—అధ్యక్షా, మంత్రిగారు మొదటి ప్రశ్నకు అవునని చెప్పారు. రెండవ ప్రశ్నకు అవునన్నారు, మూడవ ప్రశ్నకు కూడా అవునని అంటూ, సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ వేశారని అన్నారు. అది డిస్‌మిస్ అయిందని కూడా అన్నారు. ఇన్ని అయిన తరువాత, ఆక్రమణదారులను, ఇల్లీగల్‌గా ఆక్రమించుకున్నారు కనుక తొలగించడానికి గల ఇబ్బంది

ఏమిటి? ఎందుకు కోర్టు ఆర్డర్స్ ఇంప్లిమెంట్ చెయ్యరు? ఇల్లీగల్ ఆక్యుపై అన్నారు. మంత్రిగారు కరెక్ట్ ఆన్సర్ చెప్పినందుకు వారికి ధన్యవాదాలు. హైకోర్టులో ఛాలెంజ్ చేశారు. కొట్టేశారు. సుప్రీంకోర్టుకి వెళ్లారు. అక్కడా కొట్టేశారు. ఇక ఏ కోర్టు ప్రభుత్వానికి అడ్డం వచ్చింది? ఇల్లీగల్‌గా వారక్కడే కంటిన్యూ కావడానికి అథారిటీ ఎవరు?

శ్రీ ఎస్. రాజేశ్వర్ :—హౌసింగ్ బోర్డు రూల్సు ప్రకారం హైకోర్టు, సుప్రీంకోర్టు తీర్పులను అమలు చేయడానికి ఆక్రమణదారులకు తిరిగి నోటీసు ఇవ్వాలి. దాని వల్ల జాప్యం పెరిగే అవకాశం ఉంది. కోర్టు వారి తీర్పును డిక్రీగా పరిగణించాలి......

Sri D. K. Samarasimha Reddy:—Sir, I request the Law Minister to come to my rescue. I request through you. Probably he has not understood the issue. I think he is waiting for my repetition. If he interferes and comes forward to clarify, it will be alright. Otherwise I will have to explain here again. The Supreme Court has rejected the Special Leave Petition and the High Court has already ordered. Now, what is the embargo therefor the Government to prevent?

శ్రీ సి. ఆనందరావు :—హౌసింగ్ బోర్డ్ రూల్స్ ప్రకారం వెకేట్ చేస్తారు......

Sri D. K. Samarasimha Reddy—That is not the Government...

Sri N. T. Rama Rao:—Sir, I will specially refer this matter, as the Hon. Member expressed, to the Advocate-General and I shall proceed accordingly.

శ్రీ ఎన్. ఇంద్రసేనా రెడ్డి (మలకపేట) :—ఆంధ్రప్రదేశ్ హౌసింగ్ బోర్డు వారు ముందు నోటీసు యిచ్చి ఖాళీ చేయాలని చెప్పిన తరువాతనే, ఆ నోటీసు మీద అక్కడ ఉన్న వారు హైకోర్టుకి వెళ్ళారు. హైకోర్టులో కొట్టేశారు. దాని మీద సుప్రీంకోర్టుకి వెళ్ళారు. అక్కడా కొట్టేశారు. హౌసింగ్ బోర్డు నోటీసు ముందే యిచ్చింది. అటువంటప్పుడు మళ్ళీ మళ్ళీ నోటీసు యిచ్చే ప్రసక్తి ఎక్కడ వస్తుంది? అధికారులు, స్థానికులు కుమ్మక్కై ఉండడం వల్ల ప్రొలాంగ్ అవుతోంది. అంతకంటే ఏమీ లేదు.

Sri N. T. Rama Rao:—I assure through you, to the Hon. Members that I shall refer this matter to the Advocate-General and action will be taken.

Sri N. Indrasena Reddy:—Within how many days?

Sri N. T. Rama Rao:-Within a weeks time,

## ఉస్మానియా, గాంధీ ఆస్పత్రులకు నిధుల కేటాయింపు

64—

*10086—సర్వశ్రీ) బి. వెంకటేశ్వరరావు (మధిర), ఎన్. రాఘవరెడ్డి (వర్ధన్నపేట), జె. వెంకయ్య (అల్లూర్), పి. వెంకటపతి :—వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దయచేసి ఈ క్రింది విషయములు తెలిపెదరా :

(అ) హైదరాబాదులోని నిజాం సంస్థతో పోల్చి చూచినయెడల, వైద్య విజ్ఞాన శాస్త్రాల నిజాం సంస్థ కంటే ఎక్కువ పడకల సంఖ్య కలిగిన ఉస్మానియా, గాంధీ ఆస్పత్రుల వంటివి ప్రభుత్వం కేటాయించిన నిధులలో 20 నుండి 25 శాతం మాత్రమే పొందుతున్న విషయం వాస్తవమేనా ;

(ఆ) పై ఆస్పత్రులకు నిధులు కేటాయించుటకై ప్రభుత్వం అవలంభించిన నిర్ణయ ప్రమాణాలేవి ;

(ఇ) ఆ ఆస్పత్రులకు కేటాయింపును పెంచుటకు ప్రభుత్వం చర్యలు తీసుకొంటుందా ?

వైద్య, ఆరోగ్యశాఖామంత్రి (డా. పి. సుబ్బయ్య) :—(అ) 1988-89వ సంవత్సరంలో ఉస్మానియా ఆస్పత్రికి రూ. 4.98 కోట్లు, గాంధీ ఆస్పత్రికి రూ. 3.48 కోట్లు కేటాయించగా నిజాం వైద్య విజ్ఞాన సంస్థకు సహాయక గ్రాంటుగా రూ. 3.11 కోట్ల మొత్తాన్ని సమకూర్చడం జరిగింది. అందువల్ల నిజాం వైద్య విజ్ఞాన సంస్థకు కేటాయించిన నిధులలో 20 నుండి 25 శాతం వరకు మాత్రమే ఉస్మానియా, గాంధీ ఆస్పత్రులకు కేటాయిస్తున్నారనటం నిజం కాదు.

(ఆ) పడకల సంఖ్య, బయటి రోగుల సంఖ్య మొదలైనవాటి ఆధారంగా ఉస్మానియా, గాంధీ ఇతర బోధనా ఆస్పత్రులకు ప్రభుత్వం నిధులను కేటాయిస్తుంది. మందులు, లినెన్ మొదలైనవాటి కొనుగోలు నిమిత్తం ఒక్కొక్క పడకకు సంవత్సరానికి రూ. 6,000/-లు, లోని రోగులకు ఒక్కొక్క పడకకు రోజుకు రూ. 5/-లు ఆహార ఖర్చులకు; బయటి రోగులకు రోజుకు రూ. 1/- చొప్పున కేటాయించాలనే ప్రమాణాలను ప్రభుత్వం అనుసరిస్తున్నది.

(ఇ) పై రేట్లను హెచ్చించాలనే ప్రతిపాదన ఏదీ లేదు.

శ్రీ బి. వెంకటేశ్వరరావు:—అధ్యక్షా, మాటిమాటికి అనుబంధ ప్రశ్నలు వేయకుండా ఒకేసారి అడుగుతాను. సమాధానం చెప్పాలి. మంత్రిగారు సమాధానంలో ఉస్మానియా, గాంధీ హాస్పిటల్స్‌కి నిజాం వైద్య విజ్ఞాన సంస్థకంటే తక్కువ నిధులు కేటాయిస్తున్న మాట నిజం కాదని అన్నారు. మంచిదే. కేటాయించబడిన మొత్తాలు చెప్పారు. వాటిలో ఇప్పటికి ఎంత మొత్తం రిలీజ్ చేశారు? ఉస్మానియాకు ఎంత? నిజాం వైద్య విజ్ఞానసంస్థకు ఎంత? ఉస్మానియా వైద్య సంస్థలో 1200 పడకలుగల మాట వాస్తవమా? నిజాం వైద్య సంస్థలో 250 పడకలు గల మాట వాస్తవమా? కాదా? ఈ నిష్పత్తిలో పోల్చి చూస్తే ప్రభుత్వం కేటాయించిన డబ్బు తక్కువగా ఉంది కదా? ఉస్మానియా హాస్పిటల్ కాని గాంధీ హాస్పిటల్ కాని పేదలకు ఉపయోగపడే సంస్థలు.

వాటికి కేటాయించిన డబ్బుతో పోలిస్తే ఏ మాత్రం చాలదు. అసలు మన రాష్ట్రంలో వైద్యం కోసం ఖర్చు చేసే డబ్బు చాలా తక్కువ. ఉస్మానియాలో డాక్టర్లు ఆపరేషన్ చేయవలసి వస్తే, ఆపరేషన్ చేయబోయే ముందు చేతులు కడుక్కునే సబ్బు కూడా దొరకని పరిస్థితి ఉంది. గాజుగుడ్డ కూడా దొరకడంలేదు. ఉస్మానియా హాస్పిటల్ కు సరఫరా చేసే మందుల కంపెనీలు మందుల సరఫరా ఆపినమాట వాస్తవమా? వాటికి రు. 60 లక్షల వరకు బకాయి ఉండడం వల్ల ఆగిన మాట వాస్తవమా? ఉస్మానియా హాస్పిటల్ అభివృద్ధికోసం రు 1 కోటి లాటరీ పేరుతో వసూలు చేసి దానికి ఖర్చు చేయకుండా, డైవర్టు చేసిన మాట వాస్తవమా? ముఖ్యంగా ఉస్మానియా, గాంధి హాస్పిటల్స్ పేద ప్రజల కోసం ఉపయోగపడేవి. మందులు లేకపోవడంవల్ల రోగులు మందులను బయట కొనవలసి వస్తున్నది. ఇంత దయనీయ స్థితి ఉంటే ఎట్లా?

డా. పి. సుబ్బయ్య:— అధ్యక్షా, ఉస్మానియా, గాంధి హాస్పిటల్స్‌లో ముందు చెప్పబడిన మొత్తాలన్నీ రిలీజ్ చేయడం జరిగింది. పడకల విషయానికి వస్తే ఉస్మానియాలో 1158, గాంధిలో 1012 బెడ్స్ ఉన్నాయి. నిధుల కేటాయింపు నిజాం వైద్య విజ్ఞాన సంస్థకు ఎక్కువగా ఉందన్నారు. నిజాం సంస్థలో కేవలం ట్రీట్‌మెంట్ పరంగానే కాకుండా రీసెర్చి ట్రెయినింగ్ ఫెసిలిటీస్ కూడా కల్పించాలనే ఉద్దేశంతో, సౌత్ ఇండియాలో రెప్యూటెడ్ ఇన్‌స్టిట్యూట్‌గా డెవలప్ చేయాలనే ఉద్దేశంతో నార్తు ఇండియాలో ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అట్లాగే చండీఘర్‌లో పోస్టుగ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ లాగా డెవలప్ చేయాలని ప్రభుత్వపరంగా నాలుగు సంవత్సరాల వరకూ ఫైనాన్సియల్‌గా సెల్ఫ్ సఫిషియెన్స్ అయ్యేంతవరకూ ప్లాన్‌లో బడ్జెట్ ఎలొకేట్ చేయడం జరుగుతుంది. ఉస్మానియాలో మందుల విషయం అడిగారు. మందులకు డబ్బు ఇవ్వడం అనేది కంటిన్యుయస్ ప్రాసెస్. కొంతవరకూ బకాయిలు ఉన్నమాట వాస్తవం. అవి చెల్లించగానే మందులు ఇవ్వడం జరుగుతుంది. ఎమర్జెన్సీకి రోజూ మందులు కొనే పద్ధతి కూడా ఉంది. రోజుకి రూ. 8 వేల చొప్పున మందులు కొనడము జరుగుతోంది.

శ్రీ బి. వెంకటేశ్వరరావు:— అధ్యక్షా, నేను అడిగినదానికి సరిగ్గా సమాధానం రాలేదు.

మిస్టర్ డిప్యూటీ స్పీకర్:— ఒక విషయం గౌరవ సభ్యులకు చెప్పాలి. "The supplementaries should be to seek information rather than give information or make suggestions for action. Supplementary question should be specific, relevant and should be within the scope of subject matter of the main question, No Member can claim or right to be called to ask the supplementary question with respect to a particular question, which is left to the discretion of Chair to call upon any Member to put a supplementary question." ప్రాధాన్యతను బట్టి ఒక్కొక్కరికి ఒక్కొక్కదానిలో అవకాశం వస్తుంది. అందరికి అవకాశం రావాలంటే ఎట్లా?

శ్రీ బి. వెంకటేశ్వరరావు:—రూ.60 లక్షలు బాకీ ఉన్నమాట వాస్తవమా? నిజాం వైద్య విజ్ఞాన సంస్థను అభివృద్ధి చేయడానికి మాకు అభ్యంతరం లేదు. తప్పకుండా నిధులు కేటాయించాలి. కాదనడంలేదు. కానీ రూ. 60 లక్షలు ఉస్మానియా హాస్పిటల్ బాకీ ఉన్నందున, మందుల కంపెనీలు మందులు సప్లయి చేయడం లేదు. తత్ఫలితంగా రోగులు మందులు బయటకొనే పరిస్థితిఉంది. ఇది వాస్తవమా కాదా? రూ. 1 కోటి లాటరీ ద్వారా సేకరించి ఉస్మానియా హాస్పిటల్ అభివృద్ధి కోసం ఖర్చు చేయాలనుకున్నది, వేరే విధంగా తరలించిన మాట వాస్తవమా? కాదా?

డా. పి. సుబ్బయ్య:— అధ్యక్షా, రూ. 60 లక్షలు బకాయివున్నమాట వాస్తవం. త్వరలోనే బాకీ తీర్చి, మందులు సక్రమంగా సప్లయి అయేటట్లు చర్యలు తీసుకుంటామని మనవి చేస్తున్నాను.

9—20 ఉ. శ్రీ ఎం. బాగారెడ్డి:— ఒక కోటి రూపాయలు లాటరీ ద్వారా వచ్చిన డబ్బు విషయం సమాధానం చెప్పలేదు. లాటరి డబ్బు విషయం గురించి గౌరవ శాసన సభ్యులు అడిగారు. ఆ ఆదాయాన్ని ఎక్కడికి మరలించారు? ఏ విధంగా ఖర్చు పెట్టారు?

శ్రీ బి. వెంకటేశ్వరరావు:— లాటరీ ద్వారా దాని అభివృద్ధి కోసం ఒక కోటి రూపాయలు వసూలు చేశారు. ఆ వసూలు చేసినటువంటి డబ్బు డయాగ్నిస్టిక్ సెంటర్ అభివృద్ధి పేరుతో దాని నిర్మాణానికి ఖర్చు పెడుతున్నారనేది మా వద్ద ఉన్నటువంటి ఇన్ఫర్మేషన్. అది వాస్తవమా? కాదా?

డాక్టర్ పి. సుబ్బయ్య:—ప్రధాన ప్రశ్నకు ఇది సంబంధం లేనట్లు అనిపిస్తున్నది. సభ్యులు వేరే ప్రశ్న వేసినట్లయితే సమాధానం డీటెయిల్డుగా చెప్పడానికి వీలుంటుంది.

శ్రీ ఎన్. రాఘవరెడ్డి:—ప్రధాన ప్రశ్న ఏది? ఉప ప్రశ్న ఏది? నాకు అర్థం కావడంలేదు. మంత్రిగారికి అర్థం కాకపోతే మాకయినా చెప్పండి. మేము నేర్చుకొంటాము.

శ్రీ ఎన్. టి. రామారావు :— గౌరవ సభ్యులు అడిగారు. ఒక కోటి రూపాయలు లాటరీ ద్వారా వచ్చిన మాట యదార్థమే. దీనికే కాదు ఏదయితే మంచి ఇన్‌స్టిట్యూషన్‌గా ఉన్నదో— ఇదివరకు కూడా దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ గారితో ప్రారంభించినటువంటి ఆంధ్ర మహిళా సభ— దానికి సంబంధించిన ఆసుపత్రికి కూడా— పేద ప్రజానీకానికి ఏదయితే సహాయం చేస్తున్నారో— ఏది మంచి ఇన్‌స్టిట్యూషన్‌గా ఉన్నదో— అందరికీ విశ్వాసం కలిగించేటటువంటివాటికి ఇవ్వడం జరిగింది. ప్రభుత్వపరంగా లాటరీస్ అంగీకరించడం అనేది ప్రధాన విధానంగాఉంది. అటువంటప్పుడు దీనికోసం ప్రత్యేకంగా ఒక కోటి రూపాయలు వైద్య విధానాన్ని పెంపొందించడానికి ఇవ్వడం జరిగింది. కాబట్టి దానిని ఇంకొక హెడ్‌కు డైవర్టు చేయడం జరగలేదు. దాని డీటెయిల్స్ ఏ విధంగా ఉన్నదీ తెలుసుకొని తరువాత మీకు తెలియచేస్తాను.

శ్రీ ఎన్. రాఘవరెడ్డి:— ఈ నిజాం వైద్య సంస్థ పేరు మీద ప్రైవేటు వైద్యంతప్ప ప్రభుత్వ వైద్యం అనేది ఇక ఈ రాష్ట్రంలో ఉండదు అని ఏమయినా నిర్ణయానికి వచ్చారా? ఎందుకంటే 80 శాతం పేదవాళ్ళ పేరుమీద ఇస్తున్నారని చెప్పి మొత్తం పేదవాళ్ల నోట్లో మన్ను పోసే కార్యక్రియం మొదలౌతోంది. ఉస్మానియా ఆసుపత్రిలో వందలాది, వేలాది మందికి వైద్యం జరుగుతుంటే ఇప్పుడున్న డయాలిసిస్ మెషిన్ పనిచేయక—దిక్కు లేకుండా పోతోంది. ఓపెన్ హార్ట్ సర్జరీ మెషిన్ పని చేయవద్దా? మెషీన్స్ ఉన్నచోట డాక్టర్లు ఉండరు. డాక్టర్లు ఉన్న చోట మెషీన్స్ ఉండవు. చాలా అన్యాయం చేస్తున్నారనే భావం ప్రజలలో పని చేస్తున్నది ఇది అర్థం కాకపోతే ఎలా? ఆ నిజాం వైద్య సంస్థను మీరు అభివృద్ధి చేయండి. డబ్బులున్న వాళ్ళు పెట్టుకొంటారు. నూటికి 40 శాతం దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారని చెబుతుంటే పై వాడు ఎక్కడ పెట్టుకోగలడు? ఆ పరిస్థితిని అర్థం చేసుకోమని ప్రభుత్వానికి మనవి చేస్తున్నాను. దయచేసి ఉస్మానియా, గాంధీ హాస్పిటల్స్‌ను అభివృద్ధి పరచే విధంగా ప్రభుత్వం పూనుకోవడానికి ప్రయత్నం చేస్తుందా? చేస్తే ఏ విధంగా చేస్తుంది?

శ్రీ ఎన్.టి. రామారావు:— దీని విషయంలో కొంచెం విపులంగా చెప్పవలసిన అవసరం ఉంది. నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, నిజాం కాలంలో ప్రారంభించబడింది. అందుచేత వారి పేరు మీద ఉన్నది. ప్రత్యేకంగా సూపర్ స్పెషాలిటీస్ హాస్పిటల్‌గా దానిని అభివృద్ధి చేసి మన రాష్ట్రానికి అత్యంత ప్రతిష్టాకరమైన వ్యవస్థగా డీమ్డ్ యూనివర్శిటీగా గౌరవించడం జరిగింది. పైగా దీనిలో ఇదివరకు తెలుగు దేశం ప్రభుత్వం రాకముందు ఓపెన్ హార్ట్ సర్జరీ ఇక్కడ జరిగేది కాదు. ఈ రోజున పేద వాళ్లకు సహాయం చేయాలని గౌరవ శాసనసభ్యులు కూడా చీటీలు వ్రాసి పంపిస్తున్నారు. పేదవాళ్లకు దీని విషయంలో తప్పనిసరిగా వైద్యసహాయం చేయాలని—ఇది అందరికీ తెలిసిన విషయమే. పెద్ద రహస్యం ఏమీ లేదు. వారు ఇచ్చిన చీటీలు నిజాం ఇన్‌స్టిట్యూట్‌కు పంపడం, వారికి ఉచితంగా ఆపరేషన్స్ కండక్ట్ చేయడం, ప్రభుత్వం సబ్సిడీ ఇస్తూ పూర్తిగా వారికి సహాయం చేస్తున్నారు. 40 వేల మందికి ఉచితంగా చికిత్స చేయడం జరిగిందని అథేంటికేటెడ్‌గా చెబుతున్నాను. ఇంతకంటే ఏమి చెప్పాలో అర్థం కావడం లేదు. మనకు ప్రతిష్టాత్మకంగా దీనిని పూర్తిగా పేద వారి సౌకర్యం కోసం వాడబడుతున్నది. ఓపెన్ హార్ట్ సర్జరీకి మద్రాసుకు ఇతర దేశాలకు డబ్బున్న వాళ్లు వెళ్లేవారు కానీ ఈనాడు అధోగతి, దుర్మరణం పాలు కాకుండా ఈ విధమయిన సహాయం జరిగినప్పుడు కూడా దాని విషయంలో శంకించడం మంచిది కాదు. ప్రభుత్వం శాయశక్తులా పని చేస్తున్నది. మిగిలిన హాస్పిటల్స్‌కు కూడా ఇవ్వవలసిందే. తప్పదు. కానీ మనకున్న ఆర్థిక పరిస్థితుల రీత్యా ఆధునికంగా, చక్కగా తయారు చేసుకోవలసిన అవసరం ఉంది. కాబట్టి దీని విషయంలో ప్రభుత్వానికి ఎలాంటి భేదాభిప్రాయం లేదు. పేద వారికి సహాయం చేయాలంటే నిజాం హాస్పిటల్‌కు పంపిస్తున్నాము. కాబట్టి దీని

విషయం పూర్తిగా అర్థం చేసుకోమని మనవి చేస్తున్నాను. మిగిలిన హాస్పిటల్స్ కూడా ఓవర్ ల్యాప్ కాకుండా తిరుపతిలో కూడా ఒక సూపర్ స్పెషాలిటీ—అలాగే ప్రతిచోట పెట్టడం జరుగుతోంది. ఉస్మానియా, గాంధి హాస్పిటల్స్ విషయంలో పూర్తిగా శ్రద్ధ తీసుకోవడం జరుగుతుంది. ఉన్నంతలో వాటిని కూడా అభివృద్ధి చేయడం జరుగుతుందని మనవి చేస్తున్నాను.

(శ్రీ) సి. నర్సిరెడ్డి:— అధ్యక్షా, ఇప్పుడు ముఖ్యమంత్రిగారు నిజాం ఇన్‌స్టిట్యూట్ గురించి బాగా అభివృద్ధి చేస్తాము-రాష్ట్రంలో ఒక ప్రెస్టేజియస్ ఇన్‌స్టిట్యూట్‌గా చేస్తాము అన్నారు. చాలా సంతోషం, తప్పకుండా చేయాలి. అది ప్రభుత్వం బాధ్యత కూడా. దానికి సంపూర్ణమయిన......

మిస్టర్ డెప్యూటీ స్పీకర్:—ముఖ్యమంత్రిగారు చెప్పిన దానిపై స్పెసిఫిక్‌గా అడగండి.

(శ్రీ) సి. నర్సిరెడ్డి:— స్పెసిఫిక్‌గా, గాదు. నేను జనరల్‌గా అడుగుతున్నాను. ముఖ్యమంత్రిగారు చెప్పింది బాగుంది. అందులో వేరే భావం లేదు, అయితే ఒక విషయం ప్రభుత్వాన్ని అడగదలచుకొన్నాను. గాంధి, ఉస్మానియా హాస్పిటల్స్ చాలా పెద్దవి. 1000కి పై పడకలు గల హాస్పిటల్. కేవలం రు. 3 కోట్లు, 4 కోట్లు చిల్లర మాత్రమే ప్రభుత్వం వారు కేటాయించారు. నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్‌లో పడకలు 250 కి తక్కువ ఆ హాస్పిటల్స్‌తో పోలిస్తే కేవలం నాల్గవ భాగం కూడా లేదు. అంతే కాకుండా ఈ హాస్పిటల్‌లో ట్రీట్‌మెంట్ ఏమీ చేసినా కూడా ఛార్జ్ చేస్తున్నారు, డబ్బు కలెక్టు చేస్తున్నారు. పేషెంట్లకు ట్రీట్‌మెంట్ చేస్తే హాస్పిటల్‌కు డబ్బు ఖర్చు ఉండదు. అదనంగా రు. 8 కోట్లు ఇంత పెద్ద మొత్తాలు ఆ హాస్పిటల్‌కు విడుదల చేసి ఎక్కడ అవసరం ఉన్నదో అక్కడ తగ్గించారు. తగ్గించవలసిన అవసరం ఏమి వచ్చింది? ఉస్మానియా హాస్పిటల్‌లో 10 డయాలిసిస్ మెషిన్స్ ఉంటే ఒక్కటి కూడా పని చేయకుండా పోయాయి. ఈ మధ్యన ఒక ఎన్.జి.ఓ. కూడా చనిపోయాడు. ఎందుకు ఇంత నిర్లక్ష్యం? డయాలిసిస్ లేక ఇంకా చాలామంది చనిపోతారేమో అనే భయం కూడా మాకుంది. నర్సింగ్ నాయక్ ఎం.పి. కూడా చనిపోయాడు......

మిస్టర్ డెప్యూటీ స్పీకర్:— ఇది డిస్కషన్ అయింది. ముఖ్యమంత్రిగారు సమాధానం కూడా చెప్పారు.

(అంతరాయం)

శ్రీ సి. నర్సిరెడ్డి:—ఇప్పుడేమంత ఇబ్బంది కలిగింది. వాస్తవాలు వినే ఓపిక లేదా? నర్సింగ్ నాయక్‌గారు చనిపోవడానికి కారణం అవసరమైన పరికరం అందుబాటులో లేపోవడమే. అక్కడ వుండే కార్డియాలజీ స్పెషలిస్టు డాక్టర్ సుధీర్ నాయక్‌గారు తన ఇంటి వద్దనున్న పరికరాన్ని తీసుకువచ్చే లోపు ఆయన ప్రాణం పోయింది. ఇంత ముఖ్యమైన హాస్పిటల్‌లో అవసరమయిన పరికరం అందుబాటులోకి లేకపోవడం చాలా విచారకరమయిన విషయం. ఇప్పటికిప్పుడే బాగుచేస్తారని కాదు వీటి గురించి ఆలోచించి ఏమయినా చర్య తీసుకొంటారా?

శ్రీ ఎన్. టి. రామారావు:—అధ్యక్షా, పార్లమెంటు మెంబరుగారి విషయంలో మేము నిర్లక్ష్యము చేసి చంపినట్లు పదే పదే చెప్పడం చూస్తుంటే చాలా బాధగా ఉంది. నేనా విషయం మొన్న మనవి చేసాను, మరలా మై అల్...

(ఇంటరప్షన్)

మిస్టర్ డెప్యూటీ స్పీకర్:—ఒకసారి డిస్కస్ చేసారు, మరలా ఎందుకు చెబుతున్నారు?

శ్రీ సి. నర్సిరెడ్డి:—మీరు నిర్లక్ష్యం చేసారని నా భావం కాదు. నా 9-30 ఉ.
ఉద్దేశ్యం అది కానే కాదు. ఇలాంటి పరిస్థితి ఆసుపత్రిలో ఉంది దానిని గమనించి తగిన చర్యలు తీసుకోవాలని తమతో రిక్వెస్టు చేస్తున్నాను కానీ నిందారోపణ చేయడం లేదని మనవి చేస్తున్నాను.

శ్రీ ఎన్.టి. రామారావు:— మూడు డయాలిసిస్ మిషనులు కొనడానికి 5 లక్షల, 75 వేల రూపాయలు ఇచ్చామని ఇదివరకే మనవిచేశాను. ఉస్మానియా జనరల్ ఆసుపత్రి విషయంలో డైమండ్ జూబిలీ సందర్భంగా ఒక కోటి రూపాయల లాటరీ ఏర్పాటు చేసుకోడానికి వారికి అనుమతి యివ్వబడింది. డయాగ్నస్టిక్ బ్లాక్ కోసం 55 లక్షల రూపాయలు ఖర్చు పెట్టడం జరుగుతున్నది. మిగిలిన 45 లక్షల రూపాయలు యంత్రాలు మరమ్మతు కోసం, ప్రత్యేకంగా హాస్పిటల్ ఎక్విప్ మెంటు కోసం ఖర్చు పెట్టాలని ఆదేశాలు యివ్వడం జరిగింది. ఇదేగాకుండా కులీకుతుబ్ షా అథారిటీవారు రెండు కోట్ల రూపాయలు అడ్వాన్స్ చేయడానికి అంగీకరించడం జరిగింది. ఈ డబ్బంతా కూడా పూర్తిగా ఆసుపత్రి వైద్య సహాయాన్ని మెరుగుపరచడానికి వినియోగించబడ తుందని మనవి చేస్తున్నాను.

శ్రీ పి. వెంకటపతి:— అధ్యక్షా, నిజాం వైద్య విజ్ఞాన సంస్థను ప్రపంచ ప్రఖ్యాతి చెందిన సంస్థగా తీర్చిదిద్దడానికి ఎట్టి అభ్యంతరం లేదు. అక్కడ వైద్యం చేయించుకోడానికి ముఖ్యమంత్రిగారు కరుణా దృక్పధంతో అనేకమంది పేదలకు ఉత్తరాలు ఇస్తున్నారు. అది నిజమే అయివుంటుంది. 294 మంది శాసన సభ్యులము 294 ఉత్తరాలు తీసుకుపోగలము. కానీ ఇక్కడ అసంఖ్యాకమైన పేదలకు ఎక్కువగా ఉపయోగపడుతున్న ఉస్మానియా, గాంధీ ఆసుపత్రులకు తగిన నిధులు సమకూరడం లేదు. రాను, రాను నిధులు తగ్గిపోతున్నవనే ఆందోళన ఈ సభలో వ్యక్తపరచబడుతున్నది. ఉస్మానియా జనరల్ ఆసుపత్రిలో ఎన్ని పడకలు వున్నాయి? గాంధీ ఆసుపత్రిలో ఎన్ని పడకలు వున్నవి? నిజాం ఇన్స్టిట్యూట్ లో ఎన్ని పడకలు వున్నాయి? నిజాం వైద్య విజ్ఞాన సమితిలో వున్న అన్ని విభాగాలు ఉస్మానియా, గాంధీ ఆసుపత్రులలో వున్నాయా? ఇప్పుడు రేట్లను పెంచమని అన్నారు. ఎందుకు పెంచారు? రూపాయి విలువ 10 పైసలకు పడిపోయిందని వారే చెబుతున్నప్పుడు రేట్లు మేము పెంచమని చెప్పడంలో వున్న ఔచిత్యం ఏమిటి?

శ్రీ ఎన్. టి. రామారావు:— అధ్యక్షా, నేను స్పెసిఫిక్‌గా సమాధానం చెప్పిన దాని మీద మరల వారు స్పెసిఫిక్‌గా అడుగుతున్నారు. ఇంతకు ముందే మనవి చేశాను. గౌరవనీయ సభ్యులు నిధులు కేటాయించమని అడుగుతున్నారు. మూడు క్రొత్త డయాలిసిస్ మిషనులు కొనడం కోసం 5 లక్షల 75 వేల రూపాయలు యివ్వడం జరిగింది. ఒక కోటి రూపాయలు ప్రత్యేకంగా లాటరీ మీద ఏర్పాటు చేసుకోమనడం జరిగింది. అదే విధంగా 2 కోట్ల రూపాయలు కులీ కుతుబ్‌షా అథారిటీ వారు అడ్వాన్స్‌గా యివ్వడానికి అంగీకరించారని కూడా మనవిచేస్తున్నాను. ఇక పడకల విషయంలో 1168 పడకలు ఉస్మానియా జనరల్ ఆసుపత్రిలో వున్నాయి. 1012 పడకలు గాంధీ జనరల్ ఆసుపత్రిలో వున్నాయి. పూర్తిగా ఈ విషయంలో సదుపాయాలు కలిగించడానికి ప్రయత్నాలు చేయడం జరుగుతుంది. ఏమరుపాటు జరగదని మనవిచేస్తున్నాను.

శ్రీ పి. వెంకటపతి:— రేట్లు ఎందుకు పెంచ్చించారని అడుగుతున్నాను. ఏనాడో రోగులకు నిర్ణయించిన రేట్లు గదా. మరి వాటిని పెంచ్చించకపోవడానికి కారణం ఏమిటి?

శ్రీ ఎన్. టి. రామారావు:— ఈ నాడు ఆధునికంగా పెరిగిన రేట్ల ప్రకారం అక్కడ రేట్లు పెరగలేదనే విషయం పూర్తిగా పరిశీలించడం జరుగుతుంది.

శ్రీ నాయని నరసింహారెడ్డి (ముషీరాబాద్):— ఇప్పుడు ఉస్మానియా ఆసుపత్రిలో ఇద్దరు రోగులు వున్నారు. అక్కడ వున్న డయాలసిస్ మిషనులు పని చేయడం లేదు. మరి ఇప్పుడు వారి పరిస్థితి ఏమిటో మంత్రిగారు చెప్పాలి.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్:— అలాంటిది ఏమయినా వుంటే సెపరేట్ క్వశ్చన్ వేయండి. నోటీస్ యివ్వండి.

శ్రీ ఎస్. రాఘవరెడ్డి:— సెపరేట్ క్వశ్చన్ వేసే వరకు ఆ రోగులు బ్రతుకుతారా?

మిస్టర్ డెప్యూటీ స్పీకర్:—రాఘవరెడ్డిగారు నా రెస్క్యూకు రావాలి. 9 గంటల 40 నిమిషాలు అయిపోయింది.

శ్రీ నాయని నరసింహారెడ్డి:— హా చిన్న క్లారిఫికేషన్‌కు మంత్రిగారితో సమాధానం యిప్పించండి.

శ్రీ సి. ఆనందరావు:— మీ అనుమతి లేకుండా ప్రశ్న అడిగి, కాదన్నా కూడా టోన్ ఎక్కువ చేసి, అల్లరి చేసినంత మాత్రాన పర్మిషన్ ఇచ్చేది మంచి పద్ధతి కాదు. రూల్స్ ప్రకారంగా హౌస్‌ను సక్రమంగా నడిపించాలి. ఇప్పటికే రెండు, మూడు సార్లు తమరి అనుమతి లేకపోయినా ప్రశ్న వేస్తున్నారు.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్:— సభ్యులు ఏ విషయం గురించి ఆందోళన చెందుతున్నారో ఆ విషయం మీద మంత్రిగారు సమాధానం చెబుతారు.

డాక్టర్ పి. సుబ్బయ్య :— డయాలిసిస్ కోసం ఆల్టర్‌నేటివ్ అరేంజ్‌మెంట్ నిజాం ఆర్థోపెడిక్ ఇన్‌స్టిట్యూట్‌లో చేయబడింది. డయాలిసిస్ అక్కడ జరుగుతూ వున్నది.

శ్రీ నాయని నరసింహారెడ్డి :— ఉస్మానియా ఆసుపత్రిలో రోగులు వున్నారు. డయాలిసిస్ యంత్రము పని చేయడం లేదు. ఈ విషయంలో ప్రభుత్వం అశ్రద్ధ చేస్తున్నది. రోగులు చనిపోవడం జరుగుతున్నది.

డాక్టర్ పి. సుబ్బయ్య :— డయాలిసిస్ కోసం ఉస్మానియా ఆసుపత్రినుండి రోగులను నిజాం ఆర్థోపెడిక్ ఇన్‌స్టిట్యూట్‌కు పంపించడం జరుగుతుంది. మూడు డయాలసిస్ మిషనులు కొనడానికి 5.75 లక్షల రూపాయలు యివ్వడం కూడా జరిగింది. తరువాత ఇప్పుడు టెంపరరీ అరేంజ్‌మెంట్స్ నిజాం ఇన్‌స్టిట్యూట్‌లో చేయడం జరుగుతుంది.

( ప్రతిపక్ష సభ్యులు ఈ విషయం మీద తీవ్ర అభ్యంతరం తెలుపుతూ అందరూ ఒకేసారి మాట్లాడడానికి ప్రయత్నించారు )

శ్రీ మహమ్మద్ అమానుల్లాఖాన్ (చాంద్రాయణగుట్ట) :— మీరు మా రెస్క్యూకు రావాలి.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ :— మీకు సమాధానం ఏమి కావాలో చెప్పండి.

Sri Mohd. Amanullah Khan :— Why should they shift the patients from the Osmania Hospital to the Nizam's Institute ?

Dr. Mohd. Vizarat Rasool Khan ( Asifnagar ) :— Nizam's Institute is not for the poor people. Osmania Hospital is for the poor people.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ :— సభ్యులందరూ ఒక్కసారి అడిగితే నేను సమాధానం చెప్పించలేను. సమాధానం ఇచ్చే పరిస్థితులు రావు. మెంబర్స్ ఉదయం కోఆపరేటివ్ చేయకపోతే హౌస్‌ను ఎలా నడపమంటారు? 9-40 గం

శ్రీ మహమ్మద్ రజబలి (సుజాతనగర్) :— పాయింట్ ఆఫ్ ఆర్డర్ సర్.

మిస్టర్ డిప్యూటీ స్పీకర్ :— క్వశ్చన్ అవర్‌లో పాయింట్ ఆఫ్ ఆర్డర్ ఏమిటండి?

శ్రీ నాయని నరసింహారెడ్డి :— పదుగురు పేషంట్లు చావుబ్రతుకుల మధ్య వున్నారు. వారిని నిజాం ఆర్థోపెడిక్ హాస్పిటల్‌కు పంపుతాము అని అంటే డబ్బు ఎవరు కడతారు? వారు బీదవారు. పోవడానికి కూడా డబ్బులేనివారు. నిజాం ఆర్థోపెడిక్‌లో డబ్బు కట్టకపోతే చికిత్స చేయరు? మరి డబ్బు ఎవరు కడతారు?

శ్రీ ఎన్. టి. రామారావు :— ఆ పదుమందిని గవర్నమెంటు డబ్బు ఇచ్చి పంపిస్తుంది.

శ్రీ మహమ్మద్ అమానుల్లాఖాన్:—అసలు నిజాం ఆర్థోపెడిక్‌కు ఎందుకు పంపాలి?

Sri N.T. Rama Rao:—It is the duty of the Government to come to the help of the poor people I assure the House that the Government will take all the care to get it done.

డా. ఎం.వి. మైసూరారెడ్డి:—ఆ పదు మందికే గా, మిగిలినవారిని కూడా పంపిస్తారా?

శ్రీ ఎన్.టి. రామారావు:—ఎవరయినా వుంటే పంపండి, వారికి కూడా సహాయం చేస్తాము.

## హరిజనవాడలలో దేవాలయాల నిర్మాణం

65—

*10071-(జ)-శ్రీ కె. అచ్చెన్న:—దేవాదాయ శాఖ మంత్రి దయచేసి ఈ క్రింది విషయములు తెలిపెదరా:

(అ) హరిజనవాడలో 148 హిందూ దేవాలయాల నిర్మాణం కోసం 1988-89లో నిధులను కేటాయించిన విషయం వాస్తవమేనా;

(ఆ) అయినచో, అందుకు సంబంధించిన వివరాలెవ్వి?

దేవాదాయ ధర్మాదాయ శాఖామంత్రి (శ్రీ కె. అప్పలనాయుడు):—

(అ) అవునండి

(ఆ) బలహీన వర్గాల గృహనిర్మాణ కాలనీల దేవాలయ పథకం క్రింద 28-4-1988 వ తేదీన ముఖ్యమంత్రిగారి అధ్యక్షతన జరిగిన సర్వశ్రేయోనిధి సంఘం సమావేశంలో జిల్లావారీగా ఆమోదించిన దేవాలయాల వివరాలు ఈ క్రింది విధంగా వున్నాయి:

| | |
|---|---|
| 1. తూర్పు గోదావరి | 11 |
| 2. పశ్చిమ గోదావరి | 11 |
| 3. కృష్ణా | 5 |
| 4. విజయనగరం | 7 |
| 5. విశాఖపట్టణం | 2 |
| 6. శ్రీకాకుళం | 3 |
| 7. గుంటూరు | 1 |
| 8. నెల్లూరు | 17 |
| 9. ప్రకాశం | 16 |

[illegible]

[illegible]

[illegible]

[illegible]

[illegible]

శ్రీ కె. ఆదెన్న:—నా నియోజకవర్గంలో రెండు మంజూరు చేశారు. ఒకటి పెండింగ్ లో వుంది.

శ్రీ కె. అప్పలనాయుడు:—గ్రైడ్ లైన్సు పూర్తిచేస్తే వెంటనే శాంక్షన్ చేస్తాము.

## వరంగల్ ఆర్ అండ్ బి శాఖలో నిధుల దుర్వినియోగం

66—

* 9878 — సర్వశ్రీ ఎ. జయపాల్ (పర్కాల్), వి. శ్రీరాములు, ఎన్. ఇంద్రసేనారెడ్డి, ఆర్. శ్రీనివాస్ రెడ్డి (రామాయంపేట), ఆర్. రవీంద్రనాథ్ రెడ్డి (ఆలంపూర్), బి. బాల్ రెడ్డి (కారవాన్) :— రోడ్లు, భవనముల శాఖ మంత్రి దయచేసి ఈ క్రింది విషయములు తెలిపెదరా :

(అ) మహబూబాబాద్, జనగాం మరియు వరంగల్‌లలో రోడ్లకు మరమ్మత్తుల పేరుతో వరంగల్ జిల్లాలోని ఆర్. & బి. శాఖ సిబ్బంది కంట్రాక్టర్లతో కుమ్మక్కై 1984, 1985 సంవత్సరాలలో 23 లక్షల రూపాయలను దుర్వినియోగం చేసిన విషయం వాస్తవమేనా ;

(ఆ) అయినచో, ఈ విషయంలో తీసికొన్న చర్య ఏమి ?

రోడ్లు, భవనాల శాఖా మంత్రి (శ్రీ ఎ. రామనారాయణరెడ్డి):—

(అ) కొంత మొత్తం దుర్వినియోగం జరిగిన మాట నిజమే. విచారణాధికారి 6,49,181 రూపాయల 45 పైసల మొత్తం దుర్వినియోగం అయినట్లు నిర్ధారించారు.

(ఆ) సంబంధిత రవాణా, రోడు, భవనాల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరును, డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరును, అసిస్టెంటు ఇంజనీరును సస్పెండు చేయడం జరిగింది. అయితే వారిని ఆ తరువాత తిరిగి చేర్చుకోవడం జరిగింది. ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు విషయంలో నియమితులైన విచారణాధికారి 6,49,181 రూపాయల 45 పైసల మొత్తం దుర్వినియోగం జరిగినట్లు నిర్ధారించారు. ఆ మొత్తాన్ని రాబట్టడానికిగాను ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుకు షోకాజు నోటీసును జారీ చేయడం జరిగింది. ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు తమ సంజాయిషీని సమర్పించారు. అది పరిశీలనలో వుంది. ఇతరుల విషయంలో ప్రధాన పరిపాలన శాఖ, న్యాయ శాఖ, ఆర్థిక ప్రణాళిక శాఖలతో సంప్రదించి విడిగా షోకాజు నోటీసులను జారీ చేయడం జరుగుతున్నది.

శ్రీ వి. శ్రీరాములు:—మంత్రిగారు ఆరు లక్షలు మాత్రమే దుర్వినియోగం అయినట్లు చెప్పారు, అది వాస్తవం కాదు. అధికారులను ముందు సస్పెండ్ చేసి తరువాత రీఇన్‌స్టేట్ చేసుకోవడం ఏమిటి? విచారణ ఫైనల్

రిపోర్టు వచ్చే వరకూ సస్పెన్షన్‌లో ఎందుకు వుంచలేదు ? ఎం.జి.ఎమ్. హాస్పిటల్ చుట్టూ ఇనుప కంచె వేస్తే దానిలో కలిసి మొత్తం 40 లక్షలు వరకూ దుర్వినియోగం అయినట్లు, కుంభ కోణం జరిగినట్లు పత్రికల్లో కూడా వచ్చింది, ఇది జరిగి నాలుగు సంవత్సరాలు అవుతున్నా ఇంకా చర్యలు తీసుకోకపోవడం విచారకరం, విచారణ ప్రాపర్‌గా జరగలేదు. మొత్తం 40 లక్షల వరకూ కుంభకోణం జరిగింది కనుక పూర్తి వివరాలు బయటకు రావాలంటే ఒక సభా సంఘాన్ని వేయాలని కోరుతున్నాను అలాగే విచారణ ఫైనల్ రిపోర్టు వచ్చే వరకూ ఇంసి. సస్పెన్షన్‌లో వుంచుతారా ? ఒక సభా సంఘాన్ని వేస్తారా ?

శ్రీ ఎ. రామనారాయణరెడ్డి :—అధ్యక్షా, గౌరవ సభ్యులు అన్నట్లుగా మొదట 23 లక్షల దుర్వినియోగము జరిగినట్లు ప్రిలిమినరీ రిపోర్టులో రావడం జరిగింది. దాని తరువాత డీటేయిల్డ్ ఎంక్వయిరీ జరుపుమని ఎంక్వయిరీ ఆఫీసర్‌ను వేయడం జరిగింది. ప్రిలిమినరీ రిపోర్టును ఆధారము చేసుకొని పై ముగ్గురు అధికారులను 16-7-1986 నాడు సస్పెండు చేయడం జరిగింది. అయితే ఆంధ్రప్రదేశ్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్‌కు ఆ ఎగ్జిక్యూటివ్ యింజనీరు రిట్ పిటిషను దాఖలు చేశారు. దాని పైన 12-6-1987 నాడు వారిని రీయిన్‌స్టేట్ చేయమని అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ ప్రభుత్వానికి డైరెక్షను యిచ్చింది. దానిని పరిశీలించిన మీదట 28-2-1987 నాడు వారిని తిరిగి ఉద్యోగములో నియమించడం జరిగింది. అయితే అతనికి యిచ్చిన పోస్టింగ్ ప్రకారము అతను వెళ్ళి జాయిన్ కాలేదని తెలియజేస్తున్నాను. తరువాత ఎ.సి.బి. వారు అతని యిల్లును సోదా చేయడం వల్ల అతనికి డిస్‌ప్రపోర్షనేట్ ప్రాపర్టీస్ వున్నాయని కనుక్కోవడం వల్ల తిరిగి అతనిని సస్పెండు చేయమని ఎ. సి. బి. ప్రభుత్వానికి రికమండు చేసింది. దాని పైన అతనిని తిరిగి సస్పెన్షన్‌లో వుంచడం జరిగింది. ఇప్పటికీ అతను సస్పెన్షన్‌లో వున్నాడని తెలుపుతున్నాను.

శ్రీ వి. శ్రీరాములు :— ఇందులో యింజనీర్స్ కొల్యూషన్ వుంది, రు. 40 లక్షలకు సంబంధించిన వ్యవహారం. అందువల్ల యీ వ్యవహారాన్ని సభా సంఘం ద్వారా వెలికి తీయడం అవసరం. ఈ విషయము పేపర్సులో కూడ వచ్చింది. ఆరు లక్షల వ్యవహారం కాదు. అందుకని సభా సంఘాన్ని వేయాలని కోరుతున్నాను.

శ్రీ ఎ. రామనారాయణరెడ్డి :— అవసరం లేదు. దాని ఎస్టిమేటే రూ. 40 లక్షలు. ఎంక్వయిరీ ఆఫీసరు సబ్మిట్ చేసిన రిపోర్టు ప్రకారము రూ. 6,49,131-00 లు మిస్‌అప్రోప్రియేషను జరిగినట్లు నిర్ధారించడం అయింది. ఎవరెవరికి ఎంతెంత బాధ్యత వున్నదనే విషయం పూర్తి వివరాలు యివ్వడం జరిగింది. వారి నుండి రికవరు చేయడానికి కావలసిన అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ఈ స్థాయిలో, యిప్పుడు, హౌస్ కమిటీని వేయవలసిన అవసరం లేదని మనవి చేస్తున్నాను.

తూర్పు గోదావరి జిల్లాలో అటవీ కాంట్రాక్టర్ల వంచన :

67—

*10162—సర్వశ్రీ, ఎస్. చంద్రమౌళి, (చీరాల) ఎం. మల్లేశ్, (మైదారం) కె. అచ్చెన్న, కె. వీరయ్య (వేమూరు) :— అటవీ శాఖ మంత్రి దయచేసి ఈ క్రింది విషయములు తెలిపెదరా :

(అ) ఇటీవల, తూర్పు గోదావరి జిల్లాలోని అనేక అటవీ డివిజన్లలో అటవీ కాంట్రాక్టర్లు దాదాపు యాభై లక్షల రూపాయల నష్టం కలిగే విధంగా వంచనకు పాల్పడిన విషయం వాస్తవమేనా;

(ఆ) అందుకు బాధ్యులైన వారిపై తీసుకొన్న చర్య ఏమి ?

(అటవీ శాఖమంత్రి) :—శ్రీ, కె. సురేందర్ రెడ్డి

(అ) తూర్పు గోదావరి, విశాఖపట్టణం, ఖమ్మం జిల్లాలలో 19 లక్షల 28 వేల 663 రూపాయల 50 పైసల మేరకు నకిలీ చలానులు దాఖలుచేసి వంచనకు పాల్పడినట్లు కనుగొన్నమాట వాస్తవమే. అయితే ఆ మొత్తం 50 లక్షల రూపాయలు కాదు.

(ఆ) సవివరమైన విచారణ, తదుపరి చర్య నిమిత్తం ఈ విషయాన్ని సి.బి.సి.ఐ.డి.కి నిర్దేశించడమయింది. సి.బి.సి.ఐ.డి. ప్రత్యేక పోలీసు ఇన్‌స్పెక్టరు జనరలుకు ఒక ఫిర్యాదు కూడా దాఖలు చేయడమయింది. విచారణ జరుగుతున్నది. విచారణ నివేదిక అందిన తరువాత తగు చర్య తీసుకోవడం జరుగుతుంది.

డాక్టరు ఎస్. చంద్రమౌళి :—అధ్యక్షా, కుంభకోణం జరిగిన మాట వాస్తవమేనని మంత్రిగారు ఒప్పుకున్నారు. రూ. 50 లక్షలు కాదు 19 లక్షలు అంటున్నారు. అటవీ సంపద గురించి అటవీ డిపార్టుమెంటువారి చాలా కుంభకోణాలు వెలికి వస్తున్నాయి. అటవీ సంపద అటు ప్రభుత్వానికి ఉపయోగ పడడం లేదు, ఇటు గిరిజనుల సంక్షేమానికి కూడ వుపయోగపడకుండా పోయే పరిస్థితులు వున్నవి. ముఖ్యంగా తూర్పు గోదావరి, ఖమ్మం, విశాఖపట్టణములలో వున్నటువంటి కుంభకోణాలు కలపకు సంబంధించినా, జిగురుకు సంబంధించినా, కుంకుడు కాయలకు సంబంధించినా అనేది తెలుపలేదు. రెండవది, సి.బి. సి.ఐ.డి., ఎంక్వయిరీకి అప్పగించామన్నారు. ప్రాథమిక ఎంక్వయిరీలో అధికారులు కుమ్మక్కయినారని తేలిన విషయం వాస్తవమా ? అలాంటి పరిస్థితులలో అధికారులను ఎవరినైనా సస్పెండు చేయడం జరిగిందా ? ప్రతి దానికి సి. బి, సి.ఐ.డి, ని వేయడంకంటే యీ డిపార్టుమెంటులో ఒక విజిలెన్సు సెల్‌ను గాని ఎన్‌ఫోర్స్‌మెంటు డైరక్టరును గాని పెట్టే వుద్దేశం వుందా ? నేను ఈ ప్రశ్న వేసి చాలా కాలం అయింది. ఇంతవరకు కూడ సి.బి, సి.ఐ.డి. ఎంక్వయిరీని వేశామంటున్నారు. ప్రాథమిక విచారణలో ఏ అంశాలు తేలాయి ? కాంట్రాక్టర్లు, అక్కడి అధికార్లు కుమ్మక్కయినారనే విషయం బయటపడింది. అటువంటప్పుడు ఆ అధికార్ల మీద యాక్షను తీసుకున్నారా ?

శ్రీ కె. సురేందర్ రెడ్డి :— ఈ కుంభకోణములో ఏ అధికార్ల ఇన్‌వాల్వ్‌మెంటు లేదు. ఆక్షను చేసినప్పుడు ఫోర్జడ్ చలాన్స్ యివ్వడం జరిగింది. దానివల్ల రూ. 19,28,658 లు రావలసి వుంటే, అందులో రూ. 12,64,067 లు రికవరు చేయడం జరిగింది. కలప సీజ్ చేయడం జరిగింది. రూ. 6,51,908 లు యింకా రికవరీ చేయవలసి వుంది. సి.బి, సి.ఐ.డి, రిపోర్టు వచ్చిన తరువాత బాధ్యులైన వారి నుండి వసూలు చేయడం జరుగుతుంది. కాంట్రాక్టర్ల బాధ్యత. బి.సి. రెడ్డి, పి. శర్మ, పి.జి, ప్రభు అనే వారి మీద కోర్టులో కేసులు పెట్టడం, వారిని రిమాండు చేయడంజరిగింది. వారి బెయిల్ మీద రావడం జరిగింది.

డాక్టరు ఎస్. చంద్రమౌళి :—ఎన్‌ఫోర్స్‌మెంటు డైరక్టరును వేస్తారా ?

శ్రీ కె. సురేందర్ రెడ్డి :— సి.బి, సి.ఐ.డి.కి అప్పగించబడినందున, యిప్పుడు చేయడం బాగుండదు. ఆ రిపోర్టు వచ్చినతరువాత పరిశీలిస్తాము.

Mr. Deputy Speaker ;—Question No. 68 (10126) is postponed at the request of the Members.

### మధ్యదళారులచే మత్స్యకారుల దోపిడి

69—

* 10042—సర్వశ్రీ ఎన్. వరదరాజులు రెడ్డి (ప్రొద్దుటూరు), ఎం. కాశి రెడ్డి (కనిగిరి) :—ముఖ్యమంత్రి దయచేసి ఈ క్రింది విషయములు తెలిపెదరా :

(అ) చేపలను మార్కెటుచేయు విషయంలో మత్స్యకారులను మధ్య దళారీలు దోచుకొనుచున్న విషయం వాస్తవమేనా;

(ఆ) అయినచో, వారికి గిట్టుబాటు ధర లభించునట్లుగా మార్కెటింగ్ సదుపాయాలను కల్గజేయటానికి ఏవైనా పథకాలు తయారుచేయబడినవా ?

ముఖ్యమంత్రి గారి తరఫున అటవీ శాఖ మంత్రి ( శ్రీ కె. సురేందర్ రెడ్డి ) :—(అ) అవునండీ.

(ఆ) రాష్ట్రస్థాయిలో సహకార మత్స్యకారుల సమాఖ్యను ఏర్పాటు చేయడం జరిగింది. దీని కార్యనిర్వహణ పరిధి రాష్ట్ర వ్యాప్తంగా ఉంటుంది. ఈ సమాఖ్యలో సభ్యులుగా వున్న మత్స్యకారులు పట్టిన చేపలను పెద్ద పట్టణాలు. నగరాల్లో మార్కెటింగు సదుపాయాలు ఏర్పాటు చేయడం దీని లక్ష్యాల్లో ఒకటి.

శ్రీ యం. కాశిరెడ్డి :— అధ్యక్షా, మంత్రిగారు సహకార సంఘాలు నెలకొల్పడం, వాటి ద్వారా చేపలు కొనుగోలు చేస్తున్నామన్నారు. నాకు తెలిసినంతవరకు అది సత్యదూరమైన విషయము. మంత్రిగారు చీరాలకు వచ్చినప్పుడు మత్స్యపారిశ్రామికుల పరిస్థితిని చూశారు. అక్కడ మత్స్యకారులు పట్టిన చేపలను మధ్యదళారీలు ముందే పెట్టుబడి పెట్టి వచ్చిన చేపలను తక్కువ ధరకు కొనుగోలు చేసి కోటీశ్వరులు అవుతున్నారు. ఏ పరిస్థితులలోను మత్స్య

పారిశ్రామికులకు లాభం పుండడం లేదు. అటువంటప్పుడు ఆ దోపిడీదారుల నుండి వారికి రక్షణ కల్పించడానికి ఏ విధమైనటువంటి చర్య తీసుకుంటారు? వారు మంత్రి కాకముందు చీరాలకు వచ్చినప్పుడు పరిస్థితిని స్వయంగా చూశారు. అన్ని చోట్ల కూడ యీ విధమైనటువంటి దోపిడి జరుగుతోంది. దాని కొరకు ప్రత్యామ్నాయమైనటువంటి చర్య తీసుకుంటారా?

శ్రీ కె. సురేందర్ రెడ్డి :— ఆంధ్ర రాష్ట్రములో 2,451 మత్స్య పారిశ్రామికుల సహకార సంఘాలు వున్నవి. 11-2-1957 నాడు రాష్ట్ర స్థాయిలో సంస్థను స్థాపించడం జరిగింది—హైదరాబాదు ప్రధాన కార్యాలయముగా ఏర్పాటు చేయడం జరిగింది. ప్రస్తుతం ప్రకాశం, నెల్లూరు జిల్లాలో మత్స్య పారిశ్రామికుల సమగ్ర అభివృద్ధి ప్రాజెక్టును చేపట్టింది. అందులో 10 సహకార సంఘాలు—ఒక్కొక్క జిల్లాలో 5 మత్స్య పారిశ్రామికుల సహకార సంఘాల చొప్పున—వున్నవి. 82 గ్రామాలను కవరు చేయడం జరిగింది. ఈ సమాఖ్య రూ. 19.48 లక్షలు విలువ చేసే 311 తెప్పలను. రూ. 33.15 లక్షలు విలువ చేసే 84 బీచ్‌ల్యాండింగ్ క్రాఫ్ట్‌లను 32.85 లక్షల విలువ చేసే వలలను, రూ. 1.20 లక్షలు విలువ చేసే రవాణా వాహనాలను కొనుగోలు చేయడం జరిగింది. ఈ సమాఖ్య ఒక వేలం హాల్ నిర్మాణమును పూర్తి చేసింది. నాలుగు వేలం హాల్ నిర్మాణం అభివృద్ధిలో వుంది. ఈ పథకాన్ని యితర జిల్లాలకు దశలవారీగా అమలు పరచడం జరుగుతుంది—గుంటూరు, కృష్ణా, విశాఖపట్టణములలో —

శ్రీ ఎమ్. కాశిరెడ్డి :— ఇప్పుడు మంత్రిగారు చెప్పిన సౌకర్యాలు మత్స్యకారులకు చేరలేదా? ఇప్పుడిప్పుడే చేరుతున్నాయా?

శ్రీ కె. సురేందర్ రెడ్డి :— ఈ పథకం మొత్తం రూ. 215.24 లక్షలు దీనిలో రూ. 82.16 లక్షలు రుణం రూ. 47.70 లక్షలు వాటా మూలధనం రూ. 85.70 లక్షలు సబ్సిడీ కలిసి ఉన్నాయి. దీనితో రూ. 185 లక్షలు మొత్తం డ్రా చేసి సమాఖ్యకు చెల్లించడం జరిగింది. కార్యక్రమం జరుగుతున్నది.

## స్త్రీల సాంఘిక సంక్షేమ వసతి గృహాలు తనిఖీ చేయుటకు మహిళా అధికారుల నియామకము

70—

* 10521—సర్వశ్రీ మహమ్మద్ జానీ, ఆర్. చెంగారెడ్డి (నగరి):— సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి దయచేసి ఈ క్రింది విషయములు తెలిపెదరా:

(అ) స్త్రీల సాంఘిక సంక్షేమ వసతి గృహాలు తనిఖీ చేయుటకు మహిళా అధికారులను నియమించుట కేదేని ప్రతిపాదన ఉన్నదా;

(ఆ) అయినచో, అందుకు సంబంధించిన వివరములేవి?

సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి (శ్రీ జి. అప్పల సూర్యనారాయణ):—

(అ) లేదండి.

(అ) ఈ ప్రశ్నకు తావులేదు.

శ్రీ మహమ్మద్ జానీ:— అధ్యక్షా, శాసనసభా కమిటీ ద్వారా ఈ సాంఘిక సంక్షేమ శాఖ మహిళా హాస్టళ్ళను మేము విజిట్ చేయడం జరిగింది. అనేకచోట్ల హాస్టల్సులో ఉన్న విద్యార్థినులు ఈ ఇబ్బందిని కమిటీ దృష్టికి తీసుకొని రావడం జరిగింది. ఆ అవశ్యకతను ప్రభుత్వం దృష్టిలో ఉంచుకొని సత్వరం తనిఖీ చేయడానికి లేడీ ఆఫీసర్సును నియమించడానికి ప్రభుత్వం ఆలోచిస్తుందా ?

శ్రీ జి. అప్పల సూర్యనారాయణ:— ఈ సాంఘిక సంక్షేమ శాఖ మహిళా హాస్టళ్లను తనిఖీ చేయడానికి డైరెక్టరేట్‌లో ఒక డిప్యూటీ డైరెక్టరును వేయడం జరిగింది అంతేకాకుండా విజిలెన్సు సెల్ కూడా కూడా ఉంది. ఆ విజిలెన్సు సెల్‌లో జాయింటు డైరెక్టరు, అసిస్టెంట్ డైరెక్టరు ఉంటారు, వారు సర్‌ప్రయిజ్ ఇనస్పెక్షన్ చేస్తారు. డిస్ట్రిక్టు లెవెల్‌లో మాకు సంబంధించినంత వరకు డెప్యూటీ డైరెక్టరు, సోషల్ వెల్ఫేర్ ఆఫీసరు కూడా ఇనస్పెక్షను చేస్తారు. ఇంకా కలెక్టరుగారు ఎప్పుడయినా ఎమ్.డి.ఓ. లకు, ఎమ్.ఆర్.ఓ. లకు తనిఖీ చేసేటటువంటి అధికారం ఇస్తారు. వేరియస్ ఆఫీసర్సు ఇనస్పెక్షను చేస్తున్నారు కనుక తనిఖీ చేయడానికి మహిళా అధికారులను నియమించడం కష్టం. ఇనస్పెక్షన్ కూడా ఉదయం 5 గంటల లోపల, సాయంత్రం 8 గంటల తరువాత చేయకూడదని మేము ఇనస్ట్రక్షన్సు ఇవ్వడం జరిగింది. కేవలం మహిళా అధికారులనే ఇనస్పెక్షను అధికారులుగా వేయడం కష్టసాధ్యమైన విషయం. మాకు కొంత మంది ఉమెన్ ఆఫీసర్సు ఉన్నారు, వారు 15 నుంచి 20 శాతం వరకు ఉన్నారు. వారు ఇనస్పెక్టు చేస్తున్నారు. ఈ నాడు ఈ హాస్టల్సును వేరియస్ ఆఫీసర్సు తనిఖీ చేస్తున్నారు కనుక మహిళా అధికారులను నియమించడం కష్టమని మనవి చేస్తున్నాను.

శ్రీ మహమ్మద్ జానీ:— ఆ విషయాలన్నీ చెప్పనవసరం లేదు. బాలికల హాస్టల్సును తనిఖీ చేయడానికి లేడీస్‌నే రిక్రూట్ చేయండి. మీ సెల్‌కు సంబంధించిన ఆఫీసర్సును లేడీస్‌నే నియమించండి. ఇప్పటికయినా ప్రభుత్వం దాని అవశ్యకతను గుర్తించి లేడీ ఆఫీసర్సును నియమించండి. లేడీ ఆఫీసర్సు ఇనస్పెక్షను చేయకపోవడం వల్ల చాలా ఇబ్బందులు ఉన్నాయి. కావాలని అంటే చెబుతాము.

శ్రీ జి. అప్పల సూర్యనారాయణ:— ఈవేళ ఈ హాస్టల్సులో మాట్రిన్సును కాని హెల్పర్సును కాని కుక్సును కాని, అక్కడున్న అడ్మినిస్ట్రేషనులో మేము స్త్రీలనే పెడుతున్నాము. వీరి తాలూకు హజ్‌బెండ్సు కూడా హాస్టల్సుకు రాకూడదనే నిబంధన పెట్టాము. ఇనస్పెక్షనుకు సంబంధించి లేడీస్‌ను పెట్టడం చాలా కష్టసాధ్యమైన విషయం, అడ్మినిస్ట్రేషను ఖర్చు కూడా ఎక్కువ అవుతుంది అని మనవి చేస్తున్నాను.

## స్వల్ప వ్యవధి ప్రశ్నలు-వ్రాతపూర్వక సమాధానములు

### వరంగల్లు జిల్లాలోని పాకాల సరస్సు క్రింద పెంచిన నీటిరేట్ల వసూలు

70-ఎ-

నెం. 11051-ఎల్. శ్రీ డి. చినమల్లయ్య :—గౌరవనీయులైన రెవెన్యూ శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

(అ) వరిపంట మాత్రమే సాగుచేసే పాకాల చెరువు క్రింద ఆబి, తాబి పంటకాలాలకు అంటే దోఫస్లాకు సంబంధించి ఎకరాకు రూ. 40/-ల చొప్పున పెంచిన నీటి తీరువను వరంగల్లు జిల్లా రెవెన్యూ అధికారులు వసూలుచేస్తున్న మాట నిజమేనా?

(ఆ) ఈ విధంగా వసూలు చేయడం చట్టవిరుద్ధమన్న మాట కూడా నిజమేనా?

(ఇ) అయితే, చట్టవిరుద్ధమైన అట్టి వసూళ్ళను ఆపుచేయడానికి తీసుకొన్న చర్యఏమిటి?

రెవెన్యూ శాఖ మంత్రి:— (శ్రీ డి. వీరయ్య చౌదరి):— (అ) 1988లో 11వ చట్టం ప్రారంభానికి ముందు అమలులోవున్న పాతరేట్ల ప్రకారం నీటి పన్నును వసూలు చేయవలసిందిగా ఆదేశిస్తూ హైకోర్టు 1988లో 11వ చట్టంపై స్టే విధించింది. అందువల్ల వరంగల్లు కలెక్టరు, 1986లో 12వ చట్టం, 18-8-86 తేదీ గల రెవెన్యూ శాఖ ఎం.ఎస్.నెం. 816 జి.ఓ. ప్రకారం పాకాల చెరువు క్రింద ఎకరా ఒక్కింటికి మొదటి పంటకు రూ. 40/-లు రెండవ పంటకు రూ. 60/-ల చొప్పున నీటి పన్నును వసూలు చేయడం జరిగింది.

(ఆ) కాదండి.

(ఇ) అయితే, తిరిగి ప్రభుత్వం ఈ విషయాన్ని పునః పరిశీలించిన తరువాత 1-7-1986 తేదికి ముందున్న పాతరేట్ల చొప్పున అంటే 1975లో 2వ చట్టం 22-3-75 తేదీ రెవెన్యూశాఖ ఎం.ఎస్.నెం. 412 జి.ఓ. ప్రకారం వున్న రేట్ల చొప్పున వసూలు చేయవలసిందని 3-2-1989 తేదీన ఉత్తరువులు జారీ చేయడం జరిగింది.

శ్రీ డి. చినమల్లయ్య:—అధ్యక్షా, వరంగల్ జిల్లా కలెక్టరుగారు హైకోర్టు ఉత్తర్వుకు విరుద్ధంగా వసూలు చేయించారని మంత్రిగారు అంగీకరిస్తున్నారు. పునఃపరిశీలన తరువాత దానిని మళ్ళీ మార్పు చేయడం జరిగింది. జిల్లా కలెక్టరు చట్ట విరుద్ధంగా ఆదేశాలు ఇవ్వడం తప్పు. కనుక ఆయనపై తీసుకున్న చర్య ఏమిటి? మీ ఆదేశాల ప్రకారం రైతులు చెల్లించవలసింది ఎంత? అదనంగా వసూలు చేసిన డబ్బు ఎంత? అదనంగా వసూలు చేసిన డబ్బు రైతులకు తిరిగి చెల్లిస్తారా?

శ్రీ డి. వీరయ్యచౌదరి:— ముఖ్యంగా తెలంగాణా ప్రాంతంలో 1988వ సంవత్సరంలో చట్టం 11 ను హైకోర్టు స్టే చేసిన తరువాత అంతకుముందు ఉన్నటువంటి పద్ధతి ప్రకారం భూములను మూడు వర్గాలుగా విభజించడం జరిగింది. అవి మెట్ట, మాగాణి, తోట భూములుగా విభజించడం జరిగింది. మాగాణి భూములలో మొదటి పంట రెండవ పంట భూములుగా వర్గీకరించడం జరిగింది. అక్కడ కలెక్టరుగారు కోర్టు ఉత్తర్వులు ధిక్కరించడం అనే ప్రశ్న ఉత్పన్నం కాదు. 1988వ సంవత్సరంలోని చట్టానికి పూర్వం ఉన్నటువంటి పరిస్థితిని పునరుద్ధరించమని కోర్టు ఉత్తర్వులు ఉన్నాయి. 1986 వ సంవత్సరంలోని చట్టం ప్రకారం వసూలు చేయడం జరిగింది. 1988 కి 1986 కు వ్యత్యాసం లేదు. ప్రజలలో పన్ను ఎక్కువగా ఉన్నదనే భావన కలిగింది కనుక ప్రభుత్వం పున: పరిశీలనచేసి 1975వ చట్టం ప్రకారం వసూలు చేయాలని ఉత్తర్వులు ఇవ్వడం జరిగింది. తమరు అనుమతిస్తే ఆ రేట్లు తమద్వారా గౌరవసభ్యులకు తెలియజేస్తాను.

శ్రీ సి.హెచ్. విద్యాసాగర రావు:— రైతులనుంచి ఎక్కువగా కలెక్టు చేసారు. మొత్తం వసూలు అయింది. అటాచ్‌మెంట్సు చేస్తారు. కాని ఎక్కువ పన్ను ఉన్నదని ప్రజలకు భావం కలిగిందని మంత్రిగారు అంటున్నారు. ఎక్కువ పన్ను వసూలు చేయనట్లు మంత్రిగారు భావిస్తున్నారా ?

శ్రీ డి. వీరయ్యచౌదరి:— రైతులకు ఆ భావం కలిగింది. 1986లోని 12వ చట్టంవల్ల ఉపయోగం ఉందనే భావాన్ని వెలిబుచ్చారు కనుక ప్రభుత్వం 1975 నాటి పరిస్థితిని పునరుద్ధరించమని ఉత్తర్వులు ఇచ్చింది. ఆ రేట్లు చదువుతాను. 1986 చట్ట ప్రకారం మొదటి పంటకు 40 రూపాయలు, రెండవ పంటకు 60 రూపాయలు దోఫసలా పంటకు 100 రూ. లు 1986 చట్టానికి 1988 చట్టానికి 10-10
వ్యత్యాసం చూపించి ఎక్కువ ఉందని హైకోర్టుకు వెళ్ళారు. కాబట్టి రైతుల ఉదయము.
విజ్ఞప్తులు దృష్టిలో పెట్టుకుని, హైకోర్టు ఇచ్చిన తాత్కాలిక ఉత్తర్వులు దృష్టిలో పెట్టుకుని 1975 చట్టంలో ఉన్న రేట్సు ప్రకారం తీసుకోమని ఆదేశాలు ఇవ్వడం జరిగింది.

శ్రీ ఎమ్. ఓంకార్ (నరసంపేట):— ఈ బిల్లు పైలెట్ చేసిన మంత్రిగారు ఇప్పుడు లేరు. వీరయ్యచౌదరిగారి గురించి నాకు ఏవిధమైన దురభిప్రాయం లేదు. ఇందులో రెండు కీలక అంశాలు ఉన్నాయి. హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం 1975 చట్ట ప్రకారం వసూలు చేయమని ఆర్డర్సు ఇచ్చారు - ఫిబ్రవరి 3 వ జారీ చేశారు. కానీ అప్పటికే వసూలు చేయడం అయిపోయింది. ఫిబ్రవరి 25న నా నియోజకవర్గం వెళ్ళితే ఇప్పటివరకు ఆ ఉత్తర్వులు క్రింది అధికారులకు రాలేదు వసూలు ఆపుచేస్తూ ఇచ్చిన ఉత్తర్వులు. ఇంకా వసూలు చేస్తూనే ఉన్నారు. హైకోర్టు ఉత్తర్వులు ఇంకా వారికి రాలేదు. దోఫసలి విషయానికి వస్తే రెవిన్యూ మంత్రిగారు ఫస్ట్ క్రాపు, సెకండ్ క్రాపు, దోఫసలా క్రాపు అన్నారు. ఒక ఫసలీ సంవత్సరంలో పండే పంట-జూన్ మొదలుకొని ఒక సంవత్సరం పండేది-దోఫసలా ఇన్ ఫసలీ ఇయర్ అన్నారు. రెండు పంటలకు

కావలసిన నీరుతో వేసే పంట అని అర్థం వస్తుంది. రెవిన్యూ మంత్రి మహేంద్ర నాథ్ గారికి అప్పుడు స్పష్టంగా చెప్పాను. మొదటి పంటకు 60 రూపాయలు, రెండవ పంటకు 80 రూపాయలు వసూలు చేస్తున్నారు — ఇది అన్యాయం అని చెపితే—వారు సవరిస్తామని అన్నారు. రెండు పంటలు గానీ రెండు పంటలకు హరించే నీరు గాని అని మహేంద్రనాథ్ గారు సమాధానం చెప్పారు. దొఫసలా నిర్వచనంలో అనుమానం ఏమీలేదు. దొఫసలీ అంటే రెండు పంటల భూమి అన్నారు. తెలంగాణాలో ఆ భావం ఉంది. ఇక్కడ కూడా ఆ భావం ఉంది. రెండు పంటల నీరు హరించే పంట అని నిర్వచనం ఇవ్వడం జరిగిందని అన్నారు. వారు చెప్పిన అనుమానం రూల్స్‌లో స్పష్టంగా పెడతామని వారు నా ప్రశ్నకు సమాధానం చెప్పారు. వారు 1986 చట్టం ప్రకారం మొదటి పంటకు 40 రూపాయలు వసూలు చేశారు — రెండవ పంటకు చేసే 40 రూపాయలు చేయాలి. మా పూర్వ ఆచారం ప్రకారం మొదటి పంటాకూ 40 రూపాయలు వసూలు చేయాలి. రెండవ పంటకూ 40 రూపాయలు వసూలు చేయాలి—మొత్తం 80 రూపాయలు అవుతుంది. అట్లాకాకుండా మొదటి పంటకు 40 రూపాయలు చేశారు, రెండవ పంటకు 60 రూపాయలు చేశారు—అంటే సంవత్సరానికి మొత్తం 100 రూపాయలు అవుతున్నది. ఇది మంత్రి ఇచ్చిన హామీకే విరుద్ధం. విరుద్ధం కాదని బి-ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. వారూ వ్యవసాయదారులు—వారికి తెలుసు—మొదటి పంట. రెండవ పంట, దొఫసలీ కాకు—మూడు పంటలు ఒకే భూమిలో ఎక్కడ మంచి వస్తాయి? దొఫసలీ అనే సమస్య వచ్చినప్పుడు-మొదటి పంటను అబీ అని, రెండవ పంటను తాబీ అని అంటారు. రెండవ పంటను దొఫసలీ అంటారు రెండు పంటలలోను వరి పండించాలి. మాజీ మంత్రి మహేంద్రనాథ్ గారు ఇచ్చిన హామీ ప్రకారం దీనిని సవరిస్తారా?

శ్రీ డి. వీరయ్యచౌదరి:—వెస్టలు ఓంకార్ గారు అడిగినట్లు—మంత్రిగారు సభలో ఇచ్చిన వాగ్దానం వివరాలు తీసుకుని పరిశీలన చేయడం జరుగుతుంది. మొన్న కూడా గౌరవ సభ్యులకు చెప్పడం జరిగింది—హైకోర్టు నుంచి పైనల్ జడ్జిమెంట్ వచ్చిన తరువాత గౌరవ సభ్యులతో మాట్లాడి పున పరిశీలన చేయడానికి అవకాశం ఉంటుంది—పైనల్ జడ్జిమెంట్ రానివ్వండి మాట్లాడు కొందామని చెప్పడం జరిగినది.

శ్రీ సి. నర్సిరెడ్డి:—తెలంగాణా ప్రాంతంలో దొఫసలీ అనేది ఉంది ల్యాండ్ రెవిన్యూలో మొదటి నుంచీ, మొదటి పంటకు తీసుకునేటువంటి మొత్తం అమౌంటులో రెండవపంటకు దాంట్లో సగం తీసుకోవాలని చట్టంలోఉంది. దొఫసలీ అంటే అర్థం చేసుకోక మొదటి పంటకు తీసుకునే డబ్బు, మళ్లీ సగం కలిపి 40 రూపాయలు ఉంటే 60 రూపాయలు తీసుకోవడం అన్యాయం. ఒక పంట పండితే 40 రూపాయలు, దోఫసలాకు 60 రూపాయలు, 40 ప్లస్ 60 మొత్తం 100 రూపాయలు వసూలు చేయడం అన్యాయం. కోర్టు తీర్పుకు ఎదురు చూడవలసిన అవసరం లేదు. కోర్టు ఆదేశం వచ్చేవరకు ఇలాగే సాగిస్తాము అంటే ఎలా?

రైతులకు అన్యాయం జరుగుతుంది. రైతు బాంధవులం అంటారు కనుక తెలిసి ఇలా వారికి అన్యాయం చేయకూడదని, సవరించడానికి ప్రయత్నం చేస్తారా అని అడుగుతున్నాను.

శ్రీ డి. వీరయ్యచౌదరి:—ఈ వ్యత్యాసం గురించి 1988 చట్టంలో తెలంగాణా ప్రాంతాల, ఆంధ్ర ప్రాంతాల భూమి అని వర్గీకరించడం జరిగింది- ఆలాధారాలను బట్టి నిర్ణయించడం జరిగింది. హైకోర్టు స్టే ఉంది కాబట్టి హైకోర్టు ఫైనల్ జడ్జిమెంటు వచ్చిన తరువాత సభ్యులతో సంప్రదించి తగు నిర్ణయం తీసుకుంటాము.

శ్రీ ఎన్. రాఘవరెడ్డి:—వారు అనేది-40 రూపాయలు, 60 రూపాయలు వసూలు చేశారు-ఎందుకు చేశారు అని ప్రశ్న. రెండవ పంటకు 60 రూపాయలు ఎందుకు వసూలు చేశారు?

శ్రీ డి. వీరయ్య చౌదరి:—చట్టంలో ఉంది.

శ్రీ ఎన్. రాఘవరెడ్డి:—1988 చట్టంలో ఉంది. 1986 చట్టంలో రెండవ పంటకు 40 రూపాయలు ఉంది-పాతవాటికి వర్తించేది లేదు, కొత్త ప్రాజెక్టులు అని ఉంది. పాతాల ప్రాజెక్టు ఎప్పుడో కాకతీయుల కాలంలో నిర్మించింది. అది కూడా అర్థం చేసుకోవాలి. అధికారులకు ఎట్లా తోస్తే అలా చేశారని అర్థం అవుతున్నది. సరైన పరిశీలన జరిపి అటువంటివి రద్దు చేస్తారా?

శ్రీ డి. వీరయ్యచౌదరి:—1988 చట్టాన్ని స్టే చేశారు. కాబట్టి 1986 చట్టం కన్సిడరేషన్‌లోకి తీసుకుని జిలా కలెక్టర్లు వసూలు చేయడం జరిగింది. 1988 చట్టంలో కంటే 1986 చట్టంలో రేట్సు తక్కువ వున్నాయి కాబట్టి 1986 చట్టం ప్రకారం వసూలు చేయమని ఆదేశాలు ఇవ్వడం జరిగింది.

శ్రీ డి. కె. సమరసింహారెడ్డి:-1986 పరిస్థితి దృష్టిలో ఉంచుకొని కోర్టులో రిట్ వేయడం జరిగింది. 1986, 1988 అనే సమస్య చూడకుండా-ముఖ్యమంత్రి ఇదివరకు సభలో చెప్పారు నిర్ణయం తీసుకుంటామని-పెనాల్టీ ఎక్కువ రేట్స ప్రకారం వసూలు చేస్తున్నది వాపస్ ఇస్తామని అన్నారు. ఇది రైతులకు సంబంధించిన విషయం కాబట్టి-1986కు ముందు ఏ పరిస్థితి ఉందో ఆ పరిస్థితి ఉండాలని ఒక ఎమెండ్‌మెంటు తీసుకువచ్చి చేయండి-లెటజ్ పుట్ ఎన్ ఎండ్ టు ఆల్ దీజ్ ప్రాబ్లమ్స్ వన్స ఫర్ ఆల్-ప్రజలందరూ ఏ పద్ధతిని ఎక్సెప్ట్ చేయడం జరుగుతున్నదో ఆ పద్ధతికి ఎమెండ్‌మెంట్ తీసుకురండి.

శ్రీ డి. వీరయ్య చౌదరి:—సమరసింహారెడ్డి గారు చెప్పినట్లు — పెనాల్టీల విషయంలో ఆదేశాలు ఇవ్వడం జరిగింది. ఇప్పుడు ఉన్న వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా ఎమెండ్‌మెంట్ తీసుకురావాలని సభ్యులు అంటున్నారు. కోర్టు ఫైనల్ జడ్జిమెంటు రానివ్వండి.

10-20 ఉ. పట్టుదలకు పోకుండా తప్పనిసరిగా హైకోర్టు తీర్పు వచ్చిన తరువాత, ఫైనల్ ఉత్తర్వులు వచ్చిన తరువాత దీనిమీద తగునైన నిర్ణయం తీసుకుంటామని గౌరవ సభ్యులకు మనవి చేస్తున్నాను.

శ్రీ డి. కె. సమరసింహారెడ్డి :—హైకోర్టు నుంచి తీర్పు వచ్చేవరకు వేచి ఉండనవసరము లేదు. హైకోర్టులో పెండింగులో ఉన్నప్పుడు ఎమెండుమెంట్సు తీసుకుని వచ్చిన ఈ ప్రభుత్వము, హైకోర్టు ఆ ప్రకారం చేయవద్దు వేలిడిటీ లేదని చెబుతూ తీర్పు ఇచ్చినా ఎమెండుమెంట్సు తీసుకునివచ్చిన ఈ ప్రభుత్వము, ఇప్పుడు దీనికి సవరణ తీసుకుని రమ్మంటే ఎందుకు వెనుకాడుతున్నది? మీరు వెంటనే రైతులకు అనుగుణంగా, రైతులను ఆదుకునే విధంగా ఎమెండుమెంటు తీసుకుని రావలసిందిగా కోరుతున్నాను. హైకోర్టులో పెండింగులో ఉందని రైతుల సమస్యను నానబెట్టకండి.

శ్రీ డి. వీరయ్య చౌదరి :—ఇప్పుడు హైకోర్టులో స్టే ఉన్నందువలన దానిని పునఃపరిశీలన చేసే విషయంలో 1975 సంవత్సరములో ఉన్న ఉత్తర్వులకు ఇబ్బందులు లేవు కాబట్టి దీనికి వెంటనే మోడిఫై చేయవలసిన అవసరం కాని, చట్టము చేయవలసిన అవసరం కాని లేదు. హైకోర్టు ఫైనల్ తీర్పు వచ్చినప్పుడు పరిశీలించబడుతుంది. 1986—88 సంవత్సరాల పెనాల్టీలు వసూలు చేయడం జరగదు.

శ్రీ యం. ఓంకార్ :—హైకోర్టు తీర్పు వచ్చిన తరువాత చూస్తాము అంటున్నారు. ఆర్డర్సు అందలేదు అంటున్నారు. పంపించాము అని మీరు అంటున్నారు. పాత రేట్సు ప్రకారము వసూలు చేస్తున్నామని అంటున్నారు. యిదివరకు అసెంబ్లీలో హామీ యిచ్చిన ప్రకారం వసూలు చేస్తున్నారు. అది ఒక భాగము. రెండవ భాగము ఏమిటంటే దోపిడిలా పైరులు చెరుకు పంటమీద, అరటి తోట మీద వేయవలసిన శిస్తును రెండవ కారు వరి పంటకు వేస్తున్నారు. అది చాలా అన్యాయం. ఉదాహరణకు సర్వే నెంబరు 63 తీసుకుందాము. మొదటి కారు పంటకు 40 రూపాయలు తీసుకున్నారు. రబీ పంటకు 60 రూపాయలు తీసుకున్నారు. అంటే ఒక యకరానికి 100 రూపాయలు వసూలు చేస్తున్నారు. నిర్వహణలో కొంత గందరగోళం ఉంది. రూల్సు మార్చుతామని అప్పటి మంత్రిగారు అన్నారు. మార్చలేదు. అప్పటి రెవిన్యూ మినిష్టరుగారు నేను కలిసి తర్జనభర్జనలు జరిపాము. యిప్పుడు వారు ఈ సభలో కూర్చుని ఉన్నారు. వారిని చెప్పమనండి. ఆనాడు వారు చెప్పినదేమిటంటే చెరకు, అరటి తోటలకు ఒక సంవత్సరమునకు పన్ను వేస్తామనీ, రెండవ వరి పంటకు అది వర్తించదు అని రూల్సులో మార్పు చేస్తామని చెప్పారు. కానీ ఆ విధంగా చేయలేదు. మాజీ రెవిన్యూ మినిష్టరు యిక్కడనే ఉన్నారు కాబట్టి వారిని మాట్లాడడానికి అవకాశం యివ్వవలసిందిగా తమరిని రిక్వెస్టు చేస్తున్నాను. శ్రీ మహేంద్రనాథ్‌గారిని చెప్పమనండి.

మిస్టర్ డిప్యూటీ స్పీకర్ :... రెవిన్యూ మినిష్టరుగారు చెబుతారు, మాజీ రెవెన్యూ మినిష్టరుగారు ఎట్లాగు చెబుతారు ?

శ్రీ యం. ఓంకార్ :— 1975 చట్టము ప్రకారం దానిని ప్రశ్నించడం లేదు. రెండవ పంటకు దోపసలాకు సంబంధించిన విషయం.

మిస్టర్ డిప్యూటీ స్పీకర్ :—మీరు సీనియర్ మెంబరు. హౌస్‌లో పద్ధతి మీకు తెలుసు, సప్లిమెంటరీస్‌కు మంత్రిగారు సమాధానం చెబుతున్నారు, మాజీ రెవెన్యూ మినిష్టరుగారు ఎట్లాగు చెబుతారు ?

శ్రీ యం. ఓంకార్ :— నేను వేసిన ప్రశ్న ద్వారా మంత్రిగారిని పాలసీ ప్రకటించమని కోరడం లేదు. క్రొత్త నిర్ణయాలను ప్రకటించమని మంత్రిగారిని కోరడం లేదు. చేసినటువంటి నిర్ణయాన్ని అధికారులు గందరగోళము చేస్తున్నారు. దీని విషయంలో క్లియరు లేదు. యిది చట్టవిరుద్ధం కాదా అని అడిగితే. యిది చట్ట ప్రకారమే చేశామంటున్నారు. నేను యిప్పుడున్న రెవిన్యూ మినిష్టరుగారిని కించపరచడం లేదు, అగౌరవించడం లేదు. అప్పటి రెవిన్యూ మినిష్టరుగారు దీని మీద చెప్పినారు కాబట్టి, వారు యిక్కడనే ఉన్నారు కాబట్టి వారిని మాట్లాడ నివ్వండి.

మిస్టర్ డిప్యూటీ స్పీకర్ :—యిప్పటి రెవిన్యూ మినిష్టరుగారు మీ సప్లిమెంటరీకి సమాధానం యిస్తారు.

శ్రీ డి. వీరయ్య చౌదరి :—యీ సభలో మంత్రిగారు ఏ హామీ ఇచ్చారో ఆ విషయాలను సేకరించి దానికి కావలసిన విషయాలను తీసుకుంటాము. దోపసలీ విషయంలో 1975 సంవత్సరం చట్టంలో ఉన్నట్లుగా 75 రూపాయలే వసూలు చేస్తున్నారు.

శ్రీ యం ఓంకార్ :—అప్పటి మాజీ రెవెన్యూ మినిష్టరుగారు బిల్లును పైలట్ చేశారు. అట్లాగు వారిని మాట్లాడమనడం సాంప్రదాయం.

శ్రీ డి. వీరయ్య చౌదరి :—వారు చెప్పిన విషయాలనే పరిగణనలోనికి తీసుకుంటాను. దీనిమీద ప్రెస్ చేయవద్దని గౌరవ సభ్యులకు మనవిచేస్తున్నాను.

శ్రీ మహమ్మద్ రజబలి :—యిక్కడ సమస్య ఏమిటంటే నీటితీరువా తగ్గించి వసూలు చేయాలని, మన రాష్ట్రములో మూడు రీజియన్సుగా ఉన్నాయి. ఒకటి, రెండు, మూడు అని మూడు రీజియన్సు ఉన్నాయి. ఒకటి డెల్టా ప్రాంతము, రెండవది డ్రౌట్ ప్రోన్ ఏరియా అయినటువంటి తెలంగాణా, మూడవది రాయలసీమ ప్రాంతము. ఈ మూడు రీజియన్సులోను ఒకే నీటి తీరువా "కలిపి కొట్టరా కావేటి రంగా" అన్నట్లుగా తేడా లేకుండా రైతాంగము దగ్గర పేడా బెల్లము కలిసినట్లుగా మొత్తం అంతా కలిపి వసూలు చేస్తున్నారు, ఆ నిర్ణయం అమలు చేస్తున్నారు, ఒకటి, రెండు, మూడు పంటలు నాకు తెలిసినంతవరకు ప్రభుత్వము వారు అవరణలో మొదట పంట ఎట్లాగు-వర్షము మీద ఆధారపడుతుంది. రెండవ పంట విషయంలో ఎస్యూర్డ్ వాటర్ కనుక డెఫినిట్‌గా పండుతుంది. అధ్యక్షులు వారు—తమరికి తెలుసు, తమరు

కోనసీమలో ఉన్నారు. తెలంగాణా రెండవ రీజియను, రాయలసీమ మూడవ రీజియను, ఒకటి, రెండు, మూడు పంటలు తమరి లెక్కల ప్రకారం హైకోర్టులో యిది డిస్ప్యూట్‌లో ఉంది కాబట్టి సంసారపక్షంగా దీనిని పరిష్కారము చేసుకుంటాము అని అన్నారు. ఎప్పుడైతే వసూలు చేయడంలో వ్యత్యాసాలు, అసమానతలు ఉన్నాయో దాని వలన రైతులు ఆందోళన చేయవలసి వస్తూంది. కాబట్టి రైతులు ఆందోళనకు పూనుకుంటున్నారు. డెల్టా ప్రాంతములో నీటి తీరువా విధించి 100 రూపాయలకు పైగా వసూలు చేస్తున్నారు. యిది చాలా అన్యాయం. గవర్నమెంటు ఆలోచించి ఈ కలెక్షన్సు నిలుపుదల చేయమని అర్ధర్సు యిచ్చినారు. దీనికి సవరణ తేవాలని శ్రీ సముర సింహారెడ్డి గారు సూచించారు. తమరు చెప్పారు—సంసారపక్షంగా పరిష్కారం చేసుకోండి అని చెప్పారు. ఈ విధంగా రాష్ట్రములో పేదా బెల్లము కలిపి వసూలు చేసుకోవడం. ప్రభుత్వ బొక్కసము నింపుకోవడం జరుగుతుంది. వెంటనే వసూలు నిలుపుదల చేయాలి. చేసిన డబ్బును రిఫండు చేయాలి. మంత్రివర్యులకు తెలుసు. వారి ఆస్తులను జప్తు చేసినది వెలుగులోకి వచ్చింది. శ్రీ ఓంకారుగారు చాలా రెఫరెన్సులు యిచ్చారు. శ్రీ చినమల్లయ్యగారు చెప్పారు. ఎమెండుమెంటు తీసుకునిరమ్మనమని డబ్బులు వసూలు చేస్తున్నందులకు రైతులు ఆగ్రహావేశాలతో ఉన్నారు.

10—30 ఉ. శ్రీ డి. వీరయ్య చౌదరి :— గౌరవ సభ్యులు చెప్పిన భావనలు దృష్టిలో పెట్టుకొని చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఇదివరకే మనవి చేయడం జరిగింది. సర్దిష్టంగా 1976వ చట్టం ప్రకారం శిస్తు వసూలు చేయమని ఆదేశాలిచ్చాము. దీని విషయంలో ఆలస్యము ఎక్కడయినా అయివుంటే తిరిగి ఆదేశాలు ఇవ్వడం జరుగుతుంది. దీని విషయంలో గౌరవ సభ్యులు వారి వారి అభిప్రాయాలను, భావనలను చెప్పారు. వాటినన్నింటిని దృష్టిలో పెట్టుకొని హైకోర్టు నుండి జడ్జిమెంట్ వచ్చిన తరువాత, గౌరవ సభ్యులతో చర్చించి నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని మనవి చేస్తున్నాను.

మిస్టర్ డిప్యూటీ స్పీకర్ :— స్వల్ప వ్యవధి ప్రశ్న – వాగ్రూప సమాధానములు యింతటితో ముగిసినవి.

## సమాచారం నిమిత్తం కోరిన అంశం :

## కేంద్ర బడ్జెట్‌పై దూరదర్శన్ అభిప్రాయసేకరణ గురించి

శ్రీ సిహెచ్. విద్యాసాగరరావు :— అధ్యక్షా, రూలు 148 క్రింద బ్రీచ్ ఆఫ్ ప్రివిలేజ్ మోషన్‌పై, నిన్న సెంట్రల్ గవర్నమెంటులో చౌహాన్ గారు బడ్జెటు ప్రెజెంట్ చేశారు. చేసిన తరువాత, ఆల్ ఇండియా రేడియో వారు అన్ని పార్టీల వారిని కామెంట్ చేయడానికి అవకాశమిచ్చారు. దూరదర్శన్‌లో . . . . . .

మిస్టర్ డిప్యూటీ స్పీకర్ :— మీరు నోటీసు యిచ్చారా ?

శ్రీ సి హెచ్. విద్యాసాగర రావు :—బడ్జెటుపై దూరదర్శన్‌లో కామెంట్ చేయడానికి అన్ని పార్టీల వారికి అవకాశమివ్వాలి. ఇక్కడ తెలుగు దేశం పార్టీ అధికారంలో వుంది. నిన్న దూరదర్శన్‌లో సాయంత్రం 7–30 గంటల తరువాత కాంగ్రెస్ పార్టీకి చెందిన రామభూపాల్ చౌదరిగారు సెంట్రల్ గవర్నమెంటు బడ్జెటుపై కామెంట్ చేశారు. వారు చేయకూడదని కాదు, మిగతా పార్టీల వారికి కూడా ఆ అవకాశం యివ్వాలి. ఈ దేశాన్ని పరిపాలిస్తున్న కాంగ్రెసు పార్టీ డెమొక్రాటిక్‌గా వుండాలి. ఈ దేశాన్ని పాలించేది కాంగ్రెసు పార్టీనా, ఈస్టు ఇండియా కంపెనీనా ? ఇక్కడ మిగతా పార్టీలవారు లేరా ? జనతా, బి. జె. పి ; సి. పి. ఐ ; సి. పి. ఎం ; ఎం. పి. పి. మున్నగు ఇతర పార్టీల వారు ఇక్కడ వున్నప్పుడు, వారి మనోభావాలను కూడా దూరదర్శన్‌లో తెలియజేయ వలసిన అవసరం వుందా లేదా ? ముఖ్యంగా రూలింగ్ పార్టీకి అవకాశం యివ్వకపోతే......... Is it not breach of privilege of the House ?

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ :—మీరు నోటీసు యిచ్చారా ?

శ్రీ సిహెచ్. విద్యాసాగరరావు :—ఇపుడు యిస్తున్నాను. But even without that the Hon. Speaker can take cognizance of it. Sir, you might yourselves have seen it yesterday. You ought to have already taken cognizance of it. It is an insult to the House. These are the recognised parties........

(Interruption)

శ్రీ ఎస్. రాఘవరెడ్డి :—కేంద్ర ప్రభుత్వము ప్రవేశ పెట్టిన బడ్జెటుపై అన్ని పార్టీల వారి కామెంటు అవసరమా, కాదా ? ఒక పార్టీ వారిని పిలిచి వారి కామెంటు తీసుకోవడం అది ప్రభుత్వ సంస్థనా లేక వారి యొక్క జాగీరా ? జాగీరు కాకపోతే మిగతా పార్టీల వారు ఏమి చెప్పిన దానిని వినే బాధ్యత వుందా, లేదా ?......

(ఇంటరప్షన్)

డా. యం.వి. మైసూరారెడ్డి :—పార్లమెంటులో బాయ్‌కాట్......

(ఇంటరప్షన్)

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ :—నేను ఎగ్జామిను చేస్తాను.

శ్రీ సి హెచ్. విద్యాసాగరరావు :—మీరు పరిశీలన చేస్తామని అంటున్నారు. My humble submission is all are recognised political part es. Door Darshan is not the grand-fathers's property of anybody. Congress Party is a historical party which is performing the Centenary

Celebrations of Pandit Jawaharlal Nehru. Hon. Speaker need not examineit. Straightaway, I request the Hon. Speaker to refer the matter to the Privileges Committee Where is the question of examining it ?

(ఇంటర్ప్షన్)

Dr. M.V. Mysoora Reddy :—It is nothing but black-mailing the T.V......

శ్రీ సి. ఆనందరావు :—అధ్యక్షా, ఎందుకు ఎలా చేస్తున్నారు ? జీరో అవరా ఇది ?

(ఇంటరప్షన్)

Dr. M.V. Mysoora Reddy :—This is nothing but black-mailing....

(Interruptions)

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ :—నా పర్మిషను లేకుండా ఎవరు మాట్లాడినా రికార్డుసకు వెళ్ళవు.

( ఇంటరప్షన్ )

డా. వై.ఎస్. రాజశేఖర రెడ్డి (పులివెందుల) :—ఎంగిలి మెతుకులు తినే వారికి మాట్లాడడానికి స్పెషల్ ప్రివిలేజి వుందా ......

( ఇంటరప్షన్ )

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ :—కూర్చోండి. ఒకరు తరువాత ఒకరు మాట్లాడాలని రెక్వెస్టు చేస్తున్నాను. సభ్యుల కోపరేషను కావాలని చెప్పినా వినడం లేదు. ఈ విధంగా......

( ఇంటరప్షన్ )

శ్రీ సి.హెచ్. విద్యాసాగరరావు :—నేను పదే పదే అడిగినా మీరు....

డా. వై. ఎస్. రాజశేఖర రెడ్డి :—ఎంగిలి మెతుకులు తినే విద్యాసాగర రావుగారు......

( ఇంటరప్షను )

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ :—విద్యాసాగరరావుగారు మీరు అడుగుతున్న దానిమీద నోటీసు యివ్వండి. సభ్యులు కోఆపరేట్ చేయకుండా నడుచుకుంటే నేను రూలింగు యివ్వవలసివస్తుంది. జక్కా వెంకయ్యగారు మీరు 304 మీద మాట్లాడండి......

( ఇంటరప్షన్ )

కేంద్ర బడ్జెటుపై దూరదర్శన్
అభిప్రాయ సేకరణ గురించి.

డా. వై. ఎస్. రాజశేఖర రెడ్డి :—xxx

(Interruption)

Mr. Deputy Speaker :—No. I will expunge from the records. దానికి ఇప్పుడు కాదు అడిగేది. నోటీసు ఇచ్చేదానికి ఒక పద్ధతి అంటూ వుంది.

(Interruption)

No, no. I will not allow such a thing again in the House.

(Interruption)

No, Zero hour, please......

(Interruption)

నో జీరో అవర్. అసలు జీరో అవర్ లేదు. నేను 304 పిలిచాను. జక్కా 10-40 ఉ. వెంకయ్యగారిని పిలిచాను.

శ్రీ జక్కా వెంకయ్య:—అధ్యక్షా....

(ఇంటరప్షన్స్)

మిస్టర్ డెప్యూటీ స్పీకర్:—శాసనసభ అంటే నవ్వులాటగా చేస్తే సరి అయిన పద్ధతి కాదు. ఒక వ్యక్తి నిమిష నిమిషానికి శాసన సభ ప్రొసీడింగ్స్ అబ్‌స్ట్రక్టు చేయడం ఇది మంచి మర్యాద అయిన పద్ధతి కాదు. అసలు ఎలా చేయను, జీరో అవర్‌లో, నథింగు గో ఆన్ రికార్డు. నో ఐ విల్ నాట్ ఎలౌ.

(ఇంటరప్షన్స్)

సభలో మాట్లాడే భాష ఉంది. దానికి ఒక పద్ధతి ఉంది. చైర్ మీద ఆయన మాట్లాడిన భాష ఏమిటండి?

శ్రీ కె. సి. దివాకరరెడ్డి:—ఎంగిలి మెతుకులు తినే వారికి అయితే మీరు అవకాశం ఇస్తున్నారు. లేని వారికి ఇవ్వడం లేదు.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్:—మీరు దయచేసి కో ఆపరేట్ చేస్తే నేను 304 లోనికి వెడతాను. రాజశేఖరరెడ్డి గారు, మీరు సభలో మాట్లాడేటప్పుడు కొంచెము మర్యాద పాటించవలసిన అవసరం ఉంటుంది. సభలో సభ్యులు కనుక దయచేసి కో ఆపరేట్ చేయకపోతే సభను వాయిదా వేయవలసి వస్తుంది.

---

xxx Expunged at ordered by the Chair.

శ్రీ డి. కె. సమరసింహారెడ్డి :—మీరు అంతా రికార్డులోకి పోదుఅన్నారు. నేను అంగీకరిస్తాను. మరి విద్యాసాగరుగారు మాట్లాడినవి, మా సభ్యులు మాట్లాడినవి, మీరు ఎక్స్‌పంజ్ చేస్తే, ఆ రూలింగు ఇవ్వండి అంతే. జీరో అవరులో మాట్లాడినవి ఏవీ రికార్డులోనికి పోవు అని మీరు అనండి.

మిస్టర్ డిప్యూటీ స్పీకర్ :—నా పర్మిషన్ లేకుండా మాట్లాడినవి ఏమీ రికార్డు లోనికి పోవు. నేను 304 ఇస్తున్నాను. జక్కా వెంకయ్యగారు మీరు మాట్లాడండి.

## రూలు – 304 క్రింద ప్రభుత్వము దృష్టికి తీసుకువచ్చిన విషయము : నెల్లూరు జిల్లా పొట్టేలు పాలెం గ్రామంలో హరిజన బాలికను, చిన్న చెరుకూరులో మరొక బాలికను మానభంగం చేయుటను గురించి

శ్రీ జక్కా వెంకయ్య :— అధ్యక్షా, నెల్లూరు జిల్లాలో, నెల్లూరు రూరల్ మండలములో ఫిబ్రవరి నెలలో ఇద్దరు హరిజన యువతుల మానభంగము జరిగింది. ఒకటి, చిన చెరుకూరులో జరిగిన మానభంగములో, ఒక హరిజన యువతి విషం తిని ఆత్మ హత్య కూడ చేసుకున్నది. ఇది చాల తీవ్రమైనటువంటి విషయం, వీటికి సంబంధించిన వివరాలకు వస్తే 9-2-1989వ తేదీ ఉదయం అల్లారెడ్డి రవీంద్ర రెడ్డి అనే అతను భూస్వామి బిడ్డ. హరిజన యువతి కొప్పుల మస్తానమ్మ పనికి పోతూ ఉంటే ఆయన చేపల చెరువు మాటున దాగి ఉండి ఆమెను 9–2–1989 ఉదయం పది గంటలకు మాన భంగము చేశాడు. ఆమె అన్నదమ్ములు భూస్వాముల ఇంటికి పోయి అడుగగా వారిని చువ్వలతో కొట్టారు, వారిద్దరికి గాయాలు కూడ తగిలినవి. ఆ రోజు సాయంత్రం మూడు గంటలకు నెల్లూరు రూరల్ స్టేషన్‌కి పోయి రిపోర్టు చేశారు. రిపోర్టు చేసిన తరువాత, ఆ అమ్మాయిని జూబిలీ హాస్పిటలుకి పంపించారు. వయస్సు నిర్ణయానికి హెడ్ క్వార్టర్స్ హాస్పిటలుకి జూబిలీ హాస్పిటలు నుంచి ఆ అమ్మాయిని పంపించడం జరిగింది. ఆ అమ్మాయి రాత్రి ఒంటిగంటకు తిరిగి జూబిలీ హాస్పిటలుకు వచ్చింది. మానభంగము జరిగినప్పుడు ఉన్న గుడ్డలను తెమ్మని మళ్లీ గుడ్డిసాకు పెట్టి పంపించారు. 10–2–1989 వ తేదీన పరీక్షించి మానభంగము జరగలేదు అని ఒక సర్టిఫికెట్ యిచ్చారు. ఈ సర్టిఫికేట్ బయటకి వచ్చే దానికి సుమారు వారము రోజులు పైన పట్టింది. దాని తరువాత మళ్లీ అక్కడ స్థానిక ప్రజలు ఎస్.పి. ని, జిల్లా కలెక్టరుని కలుసుకుని జరిగిన అన్యాయాన్ని వివరించడానికి ప్రయత్నించిన తరువాత తిరిగి 20 వ తేదీన హెడ్ క్వార్టర్సు హాస్పిటలుకి ఆ అమ్మాయిని పంపించారు, ఆమెకు మానభంగము జరిగిందని హెడ్‌క్వార్టర్సు

హాస్పిటలులో నిర్ణయించారు. తరువాత 25 వ తేదీన దాని మీద సబ్-ఇన్స్పెక్టరు గాని జూబిలీ హాస్పిటలు వైద్య అధికారులు గాని అక్కడ అన్యాయం చేశారు. భూస్వాములు పలుకుబడిని ఉపయోగించి వారు ఆ రకంగా చేశారు. ఆ విధంగా జరిగింది. 25 వ తేదీ నుంచి నెల్లూరులో దాని మీద ఆ సబ్-ఇన్స్పెక్టరుని మార్చాలని అదే విధంగా వైద్యశాఖ అధికారుల మీద చర్యలు తీసుకోవాలని ధారణ జరుగుతున్నది. రాస్తారోకో కూడా జరుగుతున్నది.

(శ్రీ కె. ఎర్రన్నాయుడు అధ్యక్ష స్థానంలో ఉన్నారు)

ఈ రోజు పొట్టేంపాలెంలో ఉండేటటువంటి స్థానిక పేద హరిజనులు వారు పేదలు భూస్వాముల బెదిరింపులకు భయపడిపోతున్నారు అన్న ఒక వాస్తవాన్ని మీ దృష్టికి తీసుకు వస్తున్నాను.

అదే విధంగా గత శుక్రవారం రోజు అదే నెల్లూరు రూరల్ మండలములో చిన చెరుకూరు అనే గ్రామంలో గంగాపట్టణం మల్లమ్మ అని పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని తన అత్తగారి ఇంటికి మజ్జిగ తీసుకుని రావడానికి పోయే సందర్భములో హరిజన వాడకే చెందిన ఇంకొక అబ్బాయి ఆ అమ్మాయిని ఇంటిలోనికి పిలిచి మజ్జిగ ఇంటిలో ఉందని చెప్పి పిలిచి రేప్ చేశాడు. తిరిగి మరుసటి రోజు ఆ అమ్మాయి ఆ అబ్బాయిని కొట్టడానికి ప్రయత్నం చేసింది. ఆదివారం ఉదయం ఆ అబ్బాయి వాళ్ళ ఇంటి మీదకి పోయి దాడిచేసి ఇంటిలో వారిని అందరిని చంపుతామని బెదిరించాడు. ఆ అమ్మాయి విషము తీసుకుని నెల్లూరు ప్రయివేటు నర్సింగు హోంలో మరణించింది. ఇద్దరు అదే గ్రామానికి చెందినవారు. అధ్యక్షా, ఇందులో రెండు ముఖ్యమైన విషయాలు; స్త్రీలమీద మానభంగాలు జరిగినప్పుడు అందులో బలహీన వర్గాలలో బలహీన వర్గాలు స్త్రీలు. అటువంటి స్త్రీలమీద మానభంగాలు జరిగినప్పుడు ఈ రోజు ఉండే పోలీసు వ్యవస్థ గాని డాక్టర్లుగాని మానభంగము చేసినటువంటి ఉన్నత వర్గాలకు, ధనవంతులకు పలుకుబడికి లొంగి గాని లేదా లంచాలు తీసుకుని గాని ఆ విధంగా వారికి సహాయం చేస్తున్నారు. ఒకవైపు మానభంగాలకు గురి అయిన స్త్రీలు మానం పోగా గౌరవం సమాజంలో తగ్గిపోయి కేసులలోనుంచి అవతలవారు బయట పడేదానికి ఆస్కారము ఇస్తున్నది. పైగా అది అడగడానికి పోయినటువంటి పేదలను వాళ్ళ అన్నదమ్ములను, బంధువులను కొట్టడం గ్రామంలో బెదిరించడం కూడ ఆనవాయితి అయిపోయింది. అందువల్ల బలహీన వర్గాలలో ఉండే స్త్రీలకు తమ మానాన్ని కాపాడుకొనే దానికి గాని గౌరవాన్ని నిలుపుకునే దానికి గాని ఏమాత్రము ఆస్కారము లేకుండా పోయింది అనే విషయం నెల్లూరులో జరిగిన, ఈ ఫిబ్రవరిలో జరిగినటువంటి రెండు ఘటనలను బట్టే తెలుస్తున్నది. దీనిమీద తీవ్రమైన చర్యలు తీసుకోవలసిన అవసరమున్నది. ఆరోజు మూడు గంటలకు ఆ అమ్మాయి పోయి రిపోర్టు చేసేప్పుడు ఎస్.ఐ. ఆ రిపోర్టు వ్రాసుకునేప్పుడు ప్రక్క

దారి పట్టించాడు. కామా వివరాలు చెప్పడానికి ప్రయత్నం చేస్తున్న ప్రక్క వాళ్ళని బెదిరించాడు. అదే విధంగా హాస్పిటలులో డాక్టర్లు కూడా సకాలములో పరీక్ష చేయకుండా పంపించారు. దీనివల్ల కేసులోనుండి బయటపడే దానికి అల్లాడి రవీంద్రరెడ్డికి అవకాశం చిక్కింది. ఆ అవకాశం కల్పించడానికి ఉపయోగపడ్డ సబ్ ఇన్స్పెక్టరుని అదే విధంగా వైద్య అధికారుల మీద తక్షణం ట్రాన్స్ఫరు చేసి విచారణ జరిపించి సబ్ ఇన్స్పెక్టరును సస్పెండు చేసి వారిమీద తక్షణం చర్య తీసుకోవలసిందిగా కోరుతున్నాము. అదే విధంగా చెరుకూరుకు సంబంధించిన ఘటన మీద తీవ్రమైన చర్య తీసుకుని అక్కడ బలహీన వర్గాలకు జరిగిన అన్యాయం దృష్ట్యా వారికి రక్షణ కల్పించమని కోరుతున్నాము. దీనిమీద సరైన అయిన చర్యలు తీసుకొని అవి సభకు తెలియచేయమని కోరుతున్నాను.

శ్రీ బి. బాల్ రెడ్డి:—అధ్యక్షా, ఈనాడు మన రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు ఎన్నో జరుగుతున్నాయి మరి రామరాజ్యము వచ్చిన తరువాత ఈ మహిళలపై అత్యాచారాలు జరుగవు అనే విషయం ఆనాడు అధికారంలోకి రాక ముందరే నందమూరి తారకరామారావు అర్ధరాత్రి పూట ఒక మహిళ ఆడపడుచు ఏడువారాల ఆభరణాలు ధరించి నడిరోడ్డున నడిచినా కూడా ఆమెకు రక్షణ కల్పిస్తాను అన్నటువంటి అన్నగారి అభయముకి ఈ నాడు ఏమి జరిగింది? జక్కా వెంకయ్యగారు నెల్లూరులో విషయం చెప్పారు. ఇక్కడ కూడ ఈవేళ హైదరాబాదు నగరములో భాగ్యనగరములో మహిళలు నడిరోడ్డుమీదనే కాదు అసలు బస్తీలలో తిరుగుతున్న వారికి కూడా రక్షణ లేకుండా పోతున్నది. 1983–88 వరకు హైదరాబాదు నగరములో 148 మంది మహిళలపై అత్యాచారాలు జరిగినవి. నగర శివార్లుగా ఉన్న నగరను చుట్టువున్న రంగారెడ్డి జిల్లాలో కూడా 97 మహిళలపై అత్యాచారాలు జరిగినాయి. ఇందులో దౌర్భాగ్యము ఏమిటంటే ఈనాడు పోలీసుల పరిస్థితి రంగారెడ్డి జిల్లాలో జరుగుతున్నటువంటి ఈ మహిళలపై అత్యాచారాలు అని వారికి ఒకటి కూడా కనిపించడంలేదు అసలు మేము దీనిని కనుక్కోలేకపోతున్నాము అని వాళ్ళు వాళ్ళ అసమర్థతని తెలియజేస్తున్నారు. ఒక ఉదాహరణ పాటన్ నగరము మండలములోని లింగారెడ్డి గ్రామంలో మహబూబ్‌నగర్ జిల్లాలో ఒక హరిజన మహిళపై సామూహిక అత్యాచారం చేస్తే వాళ్లు ఇంతవరకు కూడ ఎలాంటి చర్య తీసుకోలేదు. అదేవిధంగా నగర శివార్లలో ఉన్నటువంటి పహాడి షరీఫ్ జూబ్లి హిల్సులలో ఇవి ఏ రకంగా జరుగుతున్నాయి అంటే సిటీనుంచి మహిళలను కిడ్నాప్ చేసి పహాడీ షెరీఫ్, జూబ్లి హిల్సు, బంజారాహిల్సు ఏరియాలకు తీసుకుపోయి అత్యాచారాలు చేసి కిరోసిన్ పోసి వారిని మటుమాయము చేసినప్పటికి కూడా ఈ విషయం పోలీసులకు తెలిపినా ఇంతవరకు దుండగులను అరెస్టు చేయలేకపోతున్నారు.

అయితే యీ రకంగా పోలీసులు అసమర్థతవల్ల మహిళలపై అత్యాచారాలు చేసే దౌర్భాగ్య స్థితులు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. గత నాలుగు సంవత్సరాలలో నగరంలో పరిసరాలలో హరిజనులపై 80 మంది మహిళలపై అత్యాచారాలు జరిగాయి. ముఖ్యంగా రంగారెడ్డి జిల్లాలో తీసుకుంటే నిర్మాణస్య ప్రాంతాలలో గ్రామాలలో నివశిస్తున్న యువతులపై జరిగిన అత్యాచారాలు కూడా ఉన్నాయి. పోలీసులు అసలు ప్రజలను రక్షించడానికి ఉన్నారా? లేక పోతే యీ అత్యాచారాలు జరిపిన నేరస్థుల ఆచూకి కూడా తెలియకుండా నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారా? అంతేకాకుండా రాజధాని నగరంలో సైఫాబాద్ పోలీసు స్టేషను పరిధిలో అపార్టుమెంటులు గలిగిన బిల్డింగులో ఒక యజమానురాలిని, ఆవిడ పని మనిషి మానభంగం చేసి దారుణంగా హత్య చేస్తే యీనాటికి కూడా పోలీసులు నిందితులను కనుక్కోలేక పోయారు. నా నియోజకవర్గంలో మూసీనదిలో పడి అమ్మాయిలు చాలామంది అత్యాచారాలు జరిగి చనిపోయినారు. 10-50 ఉ.

శ్రీ సి. అనందరావు:—సభ్యులు నెల్లూరులో జరిగిన సంఘటన మీద క్వశ్చన్ ఉంది కాబట్టి దానిమీద మాట్లాడితే బాగుంటుంది. మొత్తం రాష్ట్రంలో జరిగిన అన్నింటి మీద మాట్లాడితే ఎట్లాగు?

శ్రీ బి. బాల్ రెడ్డి:—న్యాయశాఖామంత్రిగారు మహిళల విషయం వచ్చినప్పుడు న్యాయం చేయకుండా అన్యాయం చేస్తే ఎట్లాగు? నిన్న కాక మొన్న అదివారం రోజున సనత్‌నగర్ రైల్వే కాబిన్ దగ్గర మెదక్ జిల్లా నుంచి వచ్చిన ఒక వివాహిత స్త్రీపై ఒక దుర్మార్గుడు సామూహికంగా మానభంగం చేసినా పోలీసులు నిందితుని కనుక్కోలేకపోయారు. ఇపుడు నెల్లూరు సంఘటన విషయం వచ్చే సరికి యీ మస్తానమ్మ హరిజన స్త్రీ కూలినాలి చేసుకునే అమ్మాయిని భూస్వామి అయిన రెడ్డి కుమారుడు మానభంగం చేస్తే దాని వెనుక ఉన్న పోలీసువారు యీ రకంగా తప్పుడు రిపోర్టు తీసుకువచ్చి అది మానభంగం కాదని అనడం న్యాయం కాదు. ఈ హరిజనుల పైన భూస్వాములు జరిపే అత్యాచారాలను పోలీసువారు కప్పిపుచ్చుతున్నారు. అటువంటివాటిని యిక్కడ అందరూ ఖండించాలి. ఈనాడు మహిళలకు రక్షణ కల్పించడానికి వుమెన్స్ ప్రొటెక్షన్ సెల్ రాజధానిలోనే పెడితే సరిపోదు. మహిళలకు హైదరాబాదులోనే రక్షణలేదు. ఇక జిల్లాలో ఏమి రక్షణ ఉంటుంది? అందువల్ల జిల్లాలో కూడా యీ వుమెన్స్ ప్రొటెక్షన్ సెల్స్ ఏర్పాటు చేయాలి. వాటి ద్వారా యీ భూస్వాములు గ్రామాలలో మహిళలపై అఘాయిత్యాలు చేస్తున్నపుడు వారిని కోర్టులలో కేసులు పెట్టి శిక్షించడానికి యీ సెల్స్ పని చేయాలి. ఇపుడు నెల్లూరులో మానభంగము చేసిన వ్యక్తిని యింతవరకూ పట్టుకోలేదు. నేను యింతవరకూ చెప్పిన అత్యాచారాలు ఏవైతే

ఉన్నాయో వాటిలో నిందితులను యింతవరకూ 4 సంవత్సరాలు అయిన కేసులలో కూడా పట్టుకోలేదు. ఈ రకంగా పోలీసులు నిగజారిపోతున్నారు. ఒక మహిళను గుట్టలో మానభంగము చేయడానికి తీసుకుపోతూ ఉంటే వేరే దుండగులు వచ్చి వారిని హత్యలు చేసి దుండగులు మానభంగాలు చేస్తున్నారు. అటువంటి కేసులలో దుండగులను పట్టుకోకపోవడంలో యీ పోలీసులమీద అనుమానం వస్తున్నది. కాబట్టి జిల్లా స్థాయిలో కూడా వుమెన్స్ సెల్స్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ సెలవుతీసుకుంటున్నాను.

శ్రీ వి. రామ్‌భూపాల్ చౌదరి (కర్నూలు) :— స్పీకర్ సర్, ఈ మానభంగాలు చేయడం అనేది ఒక సోషల్ యీవిల్. నెల్లూరు జిల్లాలో 9-2-1989 తెదీన 23-2-1989 తేదీలలో జరిగిన రేప్ కేసెస్ వల్ల మనం అందరమూ కూడా సిగ్గుతో తలవంచాలి. ముఖ్యంగా యిలాంటి సంఘటనలు అదుపుచేయడం కోసం మనకు ఉన్న చట్టాల ప్రకారం నిందితులను శిక్షించడం చాలా కష్టంగా ఉంది. ఇలాంటి సంఘటనలను డీల్ చేయడానికి స్పెషల్ కోర్టులను ఏర్పాటుచేసి, నిందితులను పట్టుకొని, వారికి కాపిటల్ పనిష్‌మెంటు పడేలా చేస్తే యిటువంటి సంఘటనలు మరల పునరావృతము కావు. ముఖ్యంగా అదిలాబాదు జిల్లాలో యీ మానభంగాలు పోలీసు స్టేషన్స్‌లోనే జరిగితే యిక స్త్రీలకు రాష్ట్రంలో రక్షణ ఎక్కడ ఉంటుంది? పోలీసులు రాష్ట్రంలోని స్త్రీలకు ఏమీ రక్షణ కల్పించలేకపోతున్నారు. అందువల్ల మానభంగాల కేసులను పరిష్కారం చేయడానికి స్పెషల్ కోర్టులు ఏర్పాటుచేసి నిందితులైన వారి విషయంలో కాపిటల్ స్ట్రింజెంట్ పనిష్‌మెంటు యిచ్చేదానికి వీలుగా తగిన చట్టాలను తీసుకురావాలని కోరుతూ సెలవుతీసుకుంటున్నాను.

శ్రీ ఎం. ఓంకార్ :— అధ్యక్షా, బహుశా ఫిబ్రవరి 9వ తేదీనాడు జరిగిన సంఘటనలో కొప్పల మస్తానమ్మ అనే హరిజన బాలికను రవీంద్రరెడ్డి అనే భూస్వామి కొడుకు అసలు పేరు రవి అయితే పెద్దబ్బాయి అని పిలుస్తూ ఉంటారు. అతను గొప్ప పాపాత్ముడు. ఆయనమీద పోలీసులు సరైన చర్య తీసుకుంటే తరువాత ఫిబ్రవరి 23వ తేదీనాడు గంగపట్నం మల్లమ్మ అనే బాలికకు యీ దుర్గతి పట్టి ఉండేది కాదు. ఈ విషయంలో జక్కా వెంకయ్యగారు స్పష్టంగా వివరించారు. ఇందులో నేరం చేయడం వారి వంతే, ఇటు నెల్లూరు రూరల్ సబ్ ఇన్‌స్పెక్టరును ఆకట్టుకోవడం వారి వంతే, జూబ్లీ హాస్పటల్‌లోని లేడీ డాక్టరును ఆకట్టుకోవడం వారి వంతే. ఈ విధంగా యీ కేసులనుంచి బయటపడడానికి సకల ప్రయత్నాలు చేశారు. ఇక్కడ రాష్ట్రం అంతటా, దేశం అంతటా మహిళలపై జరిగిన అత్యాచారాలపై ఖండించడం జరిగింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, అన్ని రాజకీయ పార్టీలవారు కూడా యీ మానభంగాలను ఖండిస్తూ ఉంటే యీ విధంగా నెల్లూరు రూరల్ సబ్ ఇన్‌స్పెక్టర్ యీ విధంగా ప్రవర్తించేదు అంటే

ఎంత నీచానికి దిగజారుతున్నారో తెలుస్తున్నది. డబ్బు ఠక్కుత్తితో కేవలం మగవాడైన ఆ సబ్ ఇన్‌స్పెక్టర్ మాత్రమే కాకుండా ఆడదైన జూబ్లీ హాస్పటల్ డాక్టర్ కూడా యింత నీచానికి దిగజారిపోయిందంటే యీ సంఘటనలోని వారి యిద్దరిని వారు నేరస్థులకు తోడ్పడినందుకుగాను వెంటనే అరెస్టు చేయవలసిన అవసరం ఉంది. అదే విధంగా ఈ నెల్లూరు రూరల్ సబ్-ఇన్‌స్పెక్టరు, జూబ్లి హాస్పిటల్ లేడీ డాక్టర్ పుణ్యాన కేసు బల 11-00 గం.
హీనపడి రవీందర్ రెడ్డి బయటపడే అవకాశం ఏర్పడింది. అలాంటి అవకాశం ఉదయం
లేకుండా ఆ కేసును కూడా నిపుణులయిన పోలీసు అధికారులు కట్టుదిట్టంగా నడపవలసిన అవసరం ఉంది. అసలు వ్యక్తి మానభంగం చేశాడని కేసు పెడితే నేను మానభంగం చేయలేదని నిరూపించుకోవలసిన బాధ్యత నిందితుడిపై ఉంటుంది. అలాంటి అవకాశం వున్నప్పుడు కేసును ఇంకా పకడ్బందీగా నడిపించవలసిన అవసరం ఉంది. ఇక్కడ రేప్ చేయడమే కాదు, మర్డర్ చేయడం కూడా జరిగింది. ఆ అమ్మాయి ఆత్మహత్య చేసుకొనడానికి అతను కారకుడు అయ్యాడు. అతనిపై వెంటనే చర్యలు తీసుకోవడమే కాకుండా రవీందర్ రెడ్డి సోదరులను కూడా ఇందులో ఇరికించవలసిన అవసరం ఉంది. 28 వ తేదీన మరియు 9 వ తేదీన జరిగిన కేసులలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలి, దానికి సంబంధించి మంత్రిగారు స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరుతున్నాను.

హోం శాఖ మంత్రి (శ్రీ ఎ. మాధవరెడ్డి):— అధ్యక్షా, 9-2-1989 న 11-00 గంటలకు కొప్పుల మస్తానమ్మ అనే హరిజన బాలిక వ్యవసాయ పనుల కోసం పొలాలలోకి వెడుతున్న సందర్భంలో అల్లారెడ్డి రవీందర్ రెడ్డి అనే ఆ గ్రామస్తుడు ఆమెపై అత్యాచారం చేయడం జరిగింది. మస్తానమ్మ అన్నలు ఇద్దరు కొప్పుల మస్తానయ్య, కొప్పుల రమణయ్యలు కలిసి రవీందర్ రెడ్డి ఇంటికి వెళ్ళి ఈ విషయమై ఆయనను అడిగిన సందర్భంలో రవీందర్ రెడ్డి, ఆయన సోదరుడు సురేందర్ రెడ్డి కలిసి వారిద్దరినీ తలలపై ఇనుపచువ్వలతో కొట్టడం జరిగింది. ఆ తరువాత మస్తానయ్య గారు నెల్లూరు పోలీసు స్టేషనుకు వెళ్ళి ఫిర్యాదు చేయడం జరిగింది. 9-2-1989 న సాయంత్రం 7-00 గంటలకు నెల్లూరు రూరల్ పోలీసు స్టేషనుకు వెళ్ళి కొప్పుల చిన్నయ్య కూతురు కొప్పుల మస్తానమ్మ ఆదే రోజు ఉదయం 11-00 గంటలకు పొలానికి పోతుండగా అదే గ్రామానికి చెందిన అల్లారెడ్డి రవీందర్ రెడ్డి ఆమెను పట్టుకొని, క్రింద పడవేసి చీర చింపినాడని, ఆ విషయమై ఆమె తమ్ముడు ముద్దాయి రవీందర్ రెడ్డిని అడగగా రవీందర్ రెడ్డి, ఇతని తమ్ముడు సురేందర్ రెడ్డి వారిని కర్రలతో కొట్టారని కంప్లెయింట్ ఇవ్వడం జరిగింది. అక్కడి ఎస్.ఐ. గారు వెంటనే సెక్షన్స 324, 354 క్రింద కేసు రిజిష్టరు చేయడం జరిగింది. తరువాత డాక్టర్ పరీక్షకు

నెల్లూరుజిల్లా పొట్టేలుపాలెం గ్రామంలో హరిజన బాలికను, చిన్న చెరుకూరులో మరొక బాలికను మానభంగం చేయుటను గురించి.

పంపితే రేప్ జరగలేదని డాక్టరు కూడా రిపోర్టు ఇవ్వడం జరిగింది. ఎస్.ఐ. గారు 20 వ తారీఖున ఉదయం 8-30 గంటలకు రవీందర్ రెడ్డిగారిని, అట్లాగే అతని సోదరుడు సురేందర్ రెడ్డిగారిని అరెస్టు చేయడం జరిగింది. అయితే అక్కడి సి. పి. ఎం. నాయకులు, అట్లాగే అక్కడి మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు రమణయ్యగారు ఇది ఖచ్చితంగా 'రేప్' అయినప్పటికీ పోలీసులు పట్టించుకోవడం లేదని ఊరేగింపుగా వెళ్ళి ఎస్. పి. గారికి, కలెక్టరు గారికి కూడా చెప్పడం జరిగింది. ఆ సందర్భంలో నెల్లూరు జిల్లా ఎస్.పి. కూడా ఆ బాలిక వాంగ్మూలాన్ని తీసుకోవడం జరిగింది. తనను మానభంగం చేశారని అయితే తాను అవివాహిత అయినందున 9-2-1989న గాని, ఆ తరువాత గాని పోలీసులకు తెలియపరచలేదని ఆమె ఎస్.పి. కి చెప్పిన సందర్భంలో సెక్షన్లు మార్చి సెక్షన్ 376 క్రింద కేసును నమోదు చేయడం జరిగింది. ఆ తరువాత డాక్టరు పరీక్ష కొరకు రెండవ సారి పంపిస్తే రెండవ సారి పరీక్షించిన డాక్టరు మానభంగం జరిగినట్టు వుందని రిపోర్టు ఇవ్వడం జరిగింది. తరువాత నిందితులను కోర్టుకు పంపిన సందర్భంలో రవీందర్ రెడ్డిగారికి బెయిల్ ఇవ్వలేదు, అతని సోదరుడికి మాత్రం బెయిల్ ఇవ్వడం జరిగింది. అంతే కాకుండా రెండవ కేసు 23-2-1989న జరిగింది. 23-2-1989న సాయంత్రం 6 గంటలకు చినచెరుకూరు గ్రామంలో 10వ తరగతి చదువుతున్న అంకయ్య కుమార్తె గంగపట్నం మల్లమ్మ అనే హరిజన బాలిక తన పినతల్లి అయిన చిన్నమ్మ ఇంటికి మజ్జిగ తీసుకువెడుతుండగా దారిలో దాసరి కాంతమ్మ తనకు కూడా కొంత మజ్జిగ పోయవలసిందని కోరడం జరిగింది. కాంతమ్మ తన ఇంటికిపోయి మజ్జిగ పోసి రమ్మని అనడం, ఆ బాలిక ఇంట్లోకి వెళ్ళి మజ్జిగ పోస్తున్న సందర్భంలో కాంతమ్మ బయట వుండి డోర్ క్లోజ్ చేయడం జరిగింది. లోపల అంతకు క్రితమే వున్న సంపత్ కుమార్ అనే హరిజన యువకుడు ఆ అమ్మాయిని రేప్ చేయడం జరిగింది. అటుపిమ్మట కాంతమ్మ తలుపు తెరవగా ఆ బాలిక తన పినతల్లి చిన్నమ్మ ఇంటికి ఏడ్చుకుంటూ వెళ్ళడం జరిగింది. చిన్నమ్మ రాత్రి సుమారు 7 గంటలకు కూలి పనినుంచి తిరిగివచ్చినప్పుడు ఆ బాలిక ఆమెకు, ఆమె బంధువులకు ఈ సంఘటన గురించి చెప్పింది. ఆ సమయంలో బాలిక తల్లిదండ్రులు మోడి గుంట గ్రామంలో ఉండడంవల్ల చిన్నమ్మ దాసరి కాంతమ్మ వద్దకుపోయి ఈ విషయమై ప్రశ్నించి చెడుగా ప్రవర్తించినందుకు ఆమెను చెంపపై కొట్టడంకూడా జరిగింది. 24-2-89 ఉదయం 11-00 గంటలకు ఈ బాలిక కాంతమ్మ ఇంటిలో నిందితుడు మళ్ళీ వుండడంచూసి అతని వద్దకువెళ్ళి తన చెప్పుతో కొట్టడం జరిగింది. తరువాత 25-2-1989న 10-00 గంటలకు కాంతమ్మ భర్త అయిన దాసరి రమణయ్య, ఆయన అనుచరులు పూడి వెంకటేశ్వర్లు, పూడి చంద్రయ్యలు ఆ బాలిక అవ్వ ఇంటిపై దాడి చేయడం కూడా జరిగింది. 26-2-1989న ఉదయం ఆ బాలిక "మోనోసైడ్-36" క్రిమిసంహారక మందును మింగడం జరిగింది, ఆమె

నెల్లూరుజిల్లా పొట్టేలుపాలెం గ్రామంలో హరిజన బాలికను, చిన్నచెరుకూరులో మరొక బాలికను మానభంగం చేయుటను గురించి.

వాంతులు చేసుకొంటుండగా అక్కడి రామచంద్రారెడ్డి ఆసుపత్రికి తరలించడం జరిగింది. అక్కడికి వెళ్ళినాక ఆమె చనిపోయినట్లు ప్రకటించడం జరిగింది. మధ్యాహ్నం 1 గంటకు ఆ బాలిక మేనమామ పరిమళ రమణయ్య, తోటపల్లి, గూడూరు పోలీసు స్టేషన్ సబ్-ఇనిస్పెక్టర్‌కు ఈ విషయాన్ని నివేదించడం జరిగింది. ఈ కేసులో దాసరి కాంతమ్మను అరెస్టు చేయడం జరిగింది. మిగతా వాళ్ళు ఇంతవరకు దొరకలేదు. వాళ్ళను త్వరలోనే అరెస్టుచేసి కోర్టుకు పంపించడం జరుగుతుందని గౌరవ సభ్యులకు మనవిచేస్తున్నాను.

శ్రీ ఎన్. రామువిరెడ్డి :- అధ్యక్షా, ఇక్కడ గమనించవలసిన అంశం ఏమిటంటే మంత్రిగారు చెప్పింది చాలా ప్రశాంతంగా ఏదో మెకానికల్‌గా చెప్పినట్లు ఉంది తప్ప అసలు ప్రభుత్వం ఏమీ చలించినట్లు లేదు. ఆ ఊరిలో అమీన్‌గారు ఎట్లా ఉన్నారో ఇక్కడ మంత్రిగారు అట్లానే ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అట్లానే ఉంది. హరిజనులపై అత్యాచారం జరగడమే నేరమైతే, ఈ అన్యాయం ఏమిటని నేరం చేసిన భూస్వామి ఇంటికి పోయి అడిగితే వారిని కొట్టడం జరిగింది అట్లాగే ఎస్. ఐ. వాళ్ళను భయపెట్టడం జరిగింది. 'చల్ల' పేరుతో ఇంట్లోకి రమ్మని తలుపు పెట్టి మానభంగం చేయడం, దానిగురించి చెప్పబోతే దెబ్బలు కొట్టడం, ఆ అమ్మాయి ఆత్మహత్య చేసుకోవడం జరిగింది. ఆ అమ్మాయి ఆత్మహత్య చేసుకొన్నది, చేసేది ఏమీలేదు అన్నట్లుగా మంత్రిగారి సమాధానం ఉంది. మంత్రిగారికి సీరియస్‌గా కనిపించడం లేదు. ఇదేమి సూచిస్తున్నదంటే పదే పదే హరిజనులపై దాడులు జరుగుతున్నాయని అసెంబ్లీలో ప్రస్తావిస్తున్నప్పటికీ ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల చక్కదనం ఏమిటో కనపడుతున్నది. ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలు అమలుజరుగుతున్న తీరు ఏమిటి ? అక్కడ జూబ్లీ హాస్పిటల్‌కు పోతే ఏమీ జరగలేదని డాక్టర్ సర్టిఫికేట్ ఇవ్వడం జరిగింది. గవర్నమెంట్ హెడ్ క్వార్టర్స్ హాస్పిటల్ వుండగా జూబ్లీ హాస్పిటల్‌కు ఎందుకు పంపించారు ? తరువాత అక్కడికి పంపితే నేరం జరిగినట్లు రిపోర్టు వచ్చింది కదా ? ఇది ఎస్. ఐ. కుంభకోణం కాదా ? ఇందులో ఎస్. ఐ., భూస్వామి కుమ్మక్కయినారని తెలియడం లేదా అని అడుగుతున్నాను. మీరు చెప్పిన సమాధానం చూస్తే ఎట్లా వున్నారంటే అంటుకు, సొంటుకు వున్నట్లు ఉంది. ఏదో ఒక కంప్లైయింట్ వచ్చింది, ఒక అమ్మాయిని చెరిచినట్లు కంప్లైయింట్ వచ్చింది అన్నట్లు చెపుతున్నారు తప్ప ప్రభుత్వం దానిని విచారించింది అని అడుగుతున్నాను.

హరిజనులను మేము దేవునిగా కొలుస్తున్నారని చెప్పారు. ఏమయింది? దేవుళ్ళమీద మానభంగం జరుగుతుంటే ప్రభుత్వం చూస్తున్నది. ఆ దేవుళ్ళ సంగతి ఏమయిందని అడుగుతున్నాను. హరిజనుల యెడల మీరు వ్యవహరిస్తున్న తీరు ఇదా? అని అడుగుతున్నాను. దీన్ని తీవ్రంగాతీసుకుని ఇప్పటికైనా స్పెషల్ ఐజిని 11-10 ఉ.

పంపించి ఆ ఎస్.ఐ.ని, డాక్టరును, వీరిద్దరిని కూడా ఆ కేసులో భాగస్తులుగా చేసి శిక్షించకపోతే అసలు యీ ప్రభుత్వం నిజంగా పేదల పట్ల ఏ విధంగా వ్యవహరిస్తున్నదనే దానికి నిదర్శనం అవుతుందని చెప్పవచ్చు. ప్రశాంతంగా ఇవాళ ఇది జరిగింది, ఇంటికి పోతే వారు కొట్టారు, తెల్లవారుజామున కొట్టారని చెప్పుతున్నారు. వినడానికి సిగ్గుగా ఉన్నది; తలవంచుకొనవలసిన విషయం. సభ యావత్తు యీ విషయానికి తలవంచుకొంటున్నది. 42 యేళ్ళలో దేశ స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఇవాళ కూడా హరిజనులపై బహిరంగంగా మానభంగాలు జరిగితే—అది కూడా కూలీకి పిలిచి, మార్గమధ్యంలో, ఆ భూస్వామి ఆ అమ్మాయిని పట్టుకుని చెరిస్తే దీనికి దిక్కులేని పరిస్థితి ఉంది. ఏ స్వాతంత్ర్యంలో ఉన్నాము? ఏ దేశంలో ఉన్నాము, ఏమి చేస్తున్నామునే సంగతి గమనించాలని కోరుతున్నాను. తలవంచుకోవలసిన అవసరం ఉంది. యీ విధంగా మన పిల్లలకు, మన బిడ్డలకు, అక్కలకు జరిగితే ఏ విధంగా ఉంటుందో ఆలోచించాలని కోరుతున్నాను. ప్రభుత్వం యీ విషయాన్ని తీవ్రంగా తీసుకుని ఇక్కడనుంచి స్పెషల్ ఐ జి గారిని పంపించి విచారణ చేయిస్తుందా ? జనవరిలో ఊరేగింపు తీసి, రాస్తారోకో కూర్చున్న తరువాత విచారిస్తారా ? అప్పటివరకు ఎందుకు ముందుకు రాలేదని, ఏమి కారణమని అడుగుతున్నాను. అందుకని మంత్రిగారు చెప్పాలని కోరుతున్నాను.

శ్రీ ఎ. మాధవరెడ్డి:— అధ్యక్షా, చట్టప్రకారంగా తీసుకోవలసిన చర్యలు తీసుకోవడం జరిగింది. గౌరవసభ్యులు చాలా ఆవేదనతో చెప్పారు. నేను మొదటే చెప్పాను. మొదటిసారిగా పరీక్షకు పంపినప్పుడు రేప్ జరగలేదని చెప్పారు. రెండవసారి పరీక్షకు పంపినప్పుడు రేప్ జరిగిందని చెప్పారు.

(ఇంటరప్షన్)

శ్రీ ఎన్. రాఘవరెడ్డి:— మొదటిసారి హెడ్ క్వార్టర్ హాస్పిటల్‌కు పంపకుండా వేరే హాస్పిటల్‌కు ఎందుకు పంపారు? కేసుకు కావలసిన గ్రౌండ్స్ పోతాయి.

చైర్మన్:— మంత్రిగారు స్టేట్‌మెంటు ఇవ్వనివ్వండి?....

శ్రీ ఎ. మాధవరెడ్డి:— మొదట చెప్పాను—కేసు రిజిస్టరు చేయడం జరిగింది.

(ఇంటరప్షన్)

తరువాత, ఎస్ పి దగ్గరికి అమ్మాయి వెళ్ళిన తరువాత, సి పి ఎం నాయకులు వెళ్లిన తరువాత మానభంగం చేశారని చాలా తీవ్రంగా చెప్పిన తరువాత 326 సెక్షను క్రింద కేసు బుక్ చేసి మళ్ళి డాక్టరు పరీక్షకు పంపడం జరిగింది. ముద్దాయిని కూడా అరెస్టు చేసి కోర్టుకు పంపించారు. ఇంతవరకు బెయిల్ కూడా దొరకలేదు. కోర్టులో ఉన్నారు. 20 తారీఖున అరెస్టు చేయడం

రూలు—304 క్రింద ప్రభుత్వము దృష్టికి
తీసుకువచ్చిన విషయము :
నెల్లూరుజిల్లా, పొలేలుపాలెం గ్రామంలో హరిజన
బాలికను, చిన్నచెరుకూరులో మరొక బాలికను
మానభంగం చేయుటను గురించి.

జరిగింది, 9వ తారీఖున మానభంగం జరిగింది. రాఘవరెడ్డిగారు అన్నట్లుగా, అక్కడ ఉన్న ఎస్. ఐ, గాని, అక్కడ ఉన్న డాక్టర్లు ఏమైనా పొరపాటు చేసి నట్లయితే ఇక్కడ నుంచి ఒక అఫీసరును పంపించి విచారణ జరిపించి తగిన చర్య తీసుకోవడం జరుగుతుంది.

శ్రీ జక్కా వెంకయ్య:—మంత్రిగారు యీ సభను తప్పుదోవ పట్టిస్తున్నారు. అందుకు నేను విచారిస్తున్నాను. సత్యదూరమైన విషయాలు చెప్పుతున్నాడు. మొదటి సారిగా బాలిక తనకు మానభంగం జరిగిందని సూప రింటెండెంటుకు ఫిర్యాదు చేసిన మాట కరెక్టు కాదు. మొట్టమొదటి రోజే మానభంగం జరిగినట్లు తెలిసింది. 9వ తారీఖునే ఎందుకు జూబిలీ హాస్పిటల్‌కు పంపారు? తరువాత డిటర్‌మినేషన్ కొరకు హెడ్ క్వార్టర్ హాస్పిటల్‌కు పంపించారు. రాత్రి 1—00 గం.కు తీసుకొచ్చారు. గుడ్డలు లేవనే కారణంతో 9వ తేదీన రాత్రి ఒంటి గంటకు తిరిగి ఇంటికి పంపించారు. ఆ డాక్టరు లేడు, వేరే డాక్టరు చేత పరీక్ష చేసి, ఇంటర్‌కోర్సు జరుగలేదని సర్టిఫికేటు ఇప్పించారు. తరువాత 20వ తేదీన మానభంగం జరిగిందని హెడ్ క్వార్టర్స్ హాస్పిటల్‌లో సర్టిఫికేట్ ఇచ్చారు. దీని విషయం ఏమిటి? ఒక హాస్పిటల్‌లో మానభంగం జరిగిందని. ఇంకో హాస్పిటల్‌లో మానభంగం జరగలేదని సర్టిఫికేట్ ఇవ్వడం జరిగింది. జూబిలి హాస్పిటల్ డాక్టర్సు కొల్యూడ్ అయి దీన్ని అణగ తొక్కడానికి చేశారు. డిటర్‌మినేషన్‌కు అప్పుడే పంపించాలి కదా వాయిదా ఎందుకు వేసి, పంపారు? ఆ డాక్టరును ఎందుకు సస్పెండ్ చేయలేదు. ఎందుకు చర్య తీసుకోలేదు? ఆరెస్టు ఎందుకు చేయలేదు? అదేమాదిరిగా ఎస్.ఐ.ని సస్పెండ్ చేయాలి. అత్యాచారం జరిగిందని అంటే, జూబ్లి హాస్పిటల్‌కు ఎందుకు పంపించాలి? ఎందుకని వేరే సెక్షన్‌ను, తప్పు సెక్షన్‌ను ఎస్.ఐ ఉద్దేశ్యపూర్వకంగా వేశాడు? దీన్ని బట్టి రుజువు అవుతుంది. ఎస్.ఐ. కూడా కొల్యూడ్ అయ్యాడని. ఆ రకంగా శీలాన్ని హరించిన భూస్వామిని తప్పించడానికి ప్రయత్నం చేశారని, వారు చాలా పలుకుబడి కలవారు, యీరకంగా ఇన్‌ఫ్లుయెన్సు చేశారని చెప్పుతున్నాను. ఎస్.ఐ.ని, డాక్టరును వెంటనే సస్పెండు చేసి వారి మీద కేసు పెట్టి అరెస్టు చేయాలని కోరుతున్నాను.

శ్రీ ఎ మాధవరెడ్డి:—పోలీసు స్టేషన్‌లో ఇచ్చిన కంప్లెయింటును చదవమంటే చదువుతాను . . . .

( ఇంటరప్షన్ )

శ్రీ రాఘవరెడ్డిగారు అడిగినట్లుగా, ఆఫీసరును పంపించి ఎంక్వయిర్ ...

శ్రీ ఎన్. రాఘవరెడ్డి:—స్పెషల్ ఐ.జి.ని పంపండి? ... ...

నెల్లూరుజిల్లా, పొదలకూరుపాలెం గ్రామంలో హరిజన బాలికను, చిన్న చెరుకూరులో మరొక బాలికను మానభంగం చేయుటను గురించి.

శ్రీ ఎ. మాధవరెడ్డి :— స్పెషల్ ఐ.జి. ని పంపి, ఎంక్వయిరీ చేయిస్తాము, కావలసిన చర్య తీసుకోవడం జరుగుతుంది.

(ఇంటరప్షన్)

శ్రీ ఎన్. రాఘవరెడ్డి :— ఎస్. ఐ. ని మార్చాలి. కంప్లెయింటు ఇస్తే రేప్ కాదని అది ఊరికే చీర చింపారని, చీర చింపితే హాస్పిటల్‌కు ఎందుకు పంపారు ? రేప్ కాలేదని సర్టిఫికేట్ ఎందుకు తెచ్చుకున్నారు ? అందుకని ఎస్. ఐ. ని మార్చండి ? దీనివల్ల ఎంక్వయిరీకి అనుకూలంగా ఉంటుంది.

శ్రీ పి. వెంకటపతి :— ఇప్పుడు ఒక విషయం విచారణ చేయాలి, రుజువు అయిన ఒక విషయం ఏమిటంటే, ఎస్. ఐ. రేప్ జరగలేదని మంత్రిగారు స్టేట్‌మెంటులో ఉన్నది. రేప్ జరిగిన అనుమానం లేకపోతే 9 వ తేదీన కూడా హాస్పిటల్‌కు ఎస్. ఐ. ఎందుకు పంపించారు ? రేప్ జరగలేదని సర్టిఫికేట్ ఎందుకు తెప్పించాడు ? అయినప్పుడు, యీ సెక్షన్‌ను ఎందుకు వేయలేదు. ఆ విధంగా ఎస్. ఐ. కావాలనే యీ పని చేసినట్లుగా తెలుస్తున్నది. కాబట్టి, ఐ. జి. గారిని పంపించి, ఇదివరకు, ఇక్కడే రుజువు అవుతుంది కనుక ఎస్. ఐ పై తీవ్రచర్య తీసుకోవడానికి మంత్రిగారు హామీ ఇవ్వాలని కోరుతున్నాను. అట్లాగే డాక్టరును.........

శ్రీ ఆర్. శ్రీనివాసరెడ్డి :— మంత్రిగారు స్వయంగా ఒప్పుకున్నారు. ఒక డాక్టరు రేప్ జరగలేదని సర్టిఫికేట్ ఇచ్చారు ; ఇంకో డాక్టరు జరిగిందని ఇచ్చారు. స్పష్టంగా దోషి అని తెలుస్తున్నది. డాక్టరుమీద, ఎస్. ఐ. మీద యాక్షన్ ఎందుకు తీసుకోరు. యాక్షన్ తీసుకుంటారా లేదా ? రెండవది, ఈ బాలికల కుటుంబాలకు గవర్నమెంటు తరఫున ఏమైనా ఎక్స్‌గ్రేషియా చెల్లించారా ? చెల్లించకపోతే చెల్లిస్తారా ?

శ్రీ ఎం. ఓంకార్ :— మన న్యాయ వ్యవస్థ ఎలా ఉందంటే—Benefit of doubt is given to the accused .....మంత్రిగారు హౌస్‌లో సమాధానం ఇచ్చేటప్పుడు కేసును కాస్త దృష్టిలో పెట్టుకుని మాట్లాడాలి. ఎస్. ఐ. రిపోర్టు కావాలని అతనికి అనుకూలంగా వ్రాయించుకోవడం జరిగింది. నాకు తల వెంట్రుకలు ఎన్ని ఉన్నాయో అన్ని అనుభవాలు ఉన్నాయి.

గ, వారు కేసును క్రిందు మీదు చేయాలనుకున్నప్పుడు, పోయినవారు యిచ్చిన అసలు దరఖాస్తును తీసిపారవేసి, ఇంకొకటి వ్రాయించుకొని వుంటారు. జక్కా వెంకయ్యగారు ఈ విషయం స్పష్టంగా చెప్పారు. బెదిరించి, తాను రేప్ చేయలేదు అనే విధంగా వారు వ్రాయించుకున్నారు. వెంకటపతిగారు చెప్పినట్లు ప్రైమా ఫేసి కేసు ఎస్టాబ్లిష్ అయింది, కాలూ, చెయ్యి

తిరిగిస్తున్నదు దవాఖానాకు ఎందుకు పంపించారు ? ఏమయినా దెబ్బలు తగిలితే రిఫర్ చేసి, ఫలానా దెబ్బలు సింపుల్‌గానో, గ్రీవియస్‌గానో తగిలాయని సర్టిఫికేట్ యివ్వకుండా రేప్ లేదని ఆమె సర్టిఫికేట్ యివ్వవలసిన అవసరం ఏమిటి ? ఇదంతా ప్రీ ప్లాన్డ్‌గా జరిగింది. ప్రైమా ఫెసీ కేస్ ఎస్టాబ్లిష్ అయి డి. డాక్టరు, సబ్ ఇన్‌స్పెక్టర్ కుమ్మక్కయి, నేరస్థులుగా వున్నారు. అందుకని, వారి మీద ఏమి చర్య తీసుకుంటారు ? ఈపాటికే జరిగి వుండవలసింది. బెనిఫిట్ ఆఫ్ డౌట్ ఎక్యూజ్డుకు వచ్చే విధంగా మంత్రిగారు మాట్లాడకూడదు. ఆ జాగ్రత్తతో మాట్లాడాలి.

చైర్మన్ :— మంత్రిగారూ, స్పెసిఫిక్‌గా డాక్టర్, యస్.ఐ. గార్లను గురించి చెప్పండి.

శ్రీ ఎ. మాధవరెడ్డి :—అధ్యక్షా, అమ్మాయి యస్.పి. గారి దగ్గరకు వెళ్లి రేప్ విషయం చెప్పడం జరిగింది. మానభంగం చేశారనే విషయం, తనకు వివాహం కానందున ఇతరుల ముందు తెలపడం జరుగలేదు అని ఆమె యస్.పి. ముందు చెప్పడం జరిగింది.

శ్రీ పి. వెంకటపతి :—అధ్యక్షా, ఆమె ఏమి చెప్పిందనేది కాదు, మీరు ఎందుకు పంపించారు ?

శ్రీ ఎ. మాధవరెడ్డి :—అధ్యక్షా, మామూలుగా, వీరు యిచ్చినటువంటి కంప్లెయింటులో అమ్మాయిని క్రింద పడేసి చేరచింపడం జరిగింది అని అమ్మాయి వాళ్ల అన్న కంప్లెయింట్ యిచ్చిన సందర్భంలో, ఇటువంటి కేసుల విషయంలో పరీక్ష కోసం ఆసుపత్రికి పంపడం జరుగుతుంది. ఇదే విధంగా ఈమె విషయంలోను జరిగింది. రాఘవరెడ్డిగారు చెప్పినట్లుగా నేను ఒప్పుకున్నాను. ఐ.జి. ని యిక్కడ నుండి పంపించి యస్.ఐ. కానివ్వండి, డాక్టర్ కానివ్వండి, ఎవరి పొరపాట్లు వున్నప్పటికీ విచారణ జరిపించి వారి మీద యాక్షన్ తీసుకోవడం జరుగుతుందని హామీ యిస్తున్నాను.

శ్రీ ఆర్. శ్రీనివాసరెడ్డి :—అధ్యక్షా, వారి వల్ల తప్పు జరుగలేదని మంత్రిగారు నమ్ముతున్నారా ?

శ్రీ పి. వెంకటపతి :—అధ్యక్షా, ఐ.జి. గారిని యిటువంటి కేసుల విషయములో లోతుకు వెళ్లి యికముందు యిటువంటివి జరుగకుండా వుండడానికి ఏమి చేయాలో, అన్ని వివరాలతో ఎంక్వయిరీ చేయమనండి. కానీ, యిక్కడ ఋజువు అయినదానిమీద ఏమి చేస్తారు ? ముందు సబ్ ఇన్‌స్పెక్టరును సస్పెండు చేస్తున్నారా ? లేదా ? డాక్టరును సస్పెండు చేస్తున్నారా ? లేదా ? ఈ విషయంలో మంత్రిగారిని హామీ యివ్వమనండి.

నెల్లూరుజిల్లా, పొశేలుపాలెం గ్రామంలో హరిజన బాలికను, చిన్నచెరుకూరులో మరొక బాలికను మానభంగం చేయుటను గురించి.

శ్రీ ఎ. మాధవరెడ్డి:— సబ్ ఇన్‌స్పెక్టరు, ఇచ్చిన కంప్లయింట్ మీదనే కేసు రిజిస్టరు చేశారు. అమ్మాయి యస్.పి. దగ్గర చెప్పడం జరిగింది. 'ఇంతకు ముందు ఎక్కడా రేప్ జరిగినట్లు చెప్పలేదు మీ ముందే చెబుతున్నాను' అని ఆమె వారితో చెప్పింది. ఐ.జి. గారితో ఎంక్వయిరీ చేయిస్తాము.

శ్రీ ఎన్. రాఘవరెడ్డి: — అధ్యక్షా, కేసు ఏ సెక్షను క్రింద రిజిస్టరు చేశారు ? 324 సెక్షన్ ఏమిటి ?

శ్రీ ఎ. మాధవరెడ్డి:— కొట్టినందుకు 324 సెక్షను, వాళ్ళు అడగడానికి వెళ్ళినందుకు రవీంద్రరెడ్డి అన్న కొట్టినందుకు 324 సెక్షను, అంతేకాకుండా 354 సెక్షన్ క్రింద కూడా కేసు రిజిస్టరు చేయడం జరిగింది. అమ్మాయి చెప్పిన వివరాల ప్రకారం సెక్షన్ మార్చడం జరిగింది. అతను జైలులో ఉన్నాడు. ఇంతవరకు బెయిలు దొరకలేదు.

శ్రీ ఎన్. రాఘవరెడ్డి:— అధ్యక్షా, సబ్ యిన్‌స్పెక్టరును కాపాడడానికి ప్రయత్నం జరుగుతున్నది. ఆమె స్పష్టంగా చెప్పింది. ఆమెను గవర్నమెంట్ హెడ్ క్వార్టర్సు ఆసుపత్రికి కాకుండా మరొక ఆసుపత్రికి పంపుతే ఈ సర్టిఫికేటు వచ్చింది. గవర్నమెంట్ హెడ్ క్వార్టర్సు ఆసుపత్రికి పంపితే రేప్ జరిగినట్లుగా వచ్చింది. ఇక్కడ ఆ డిఫరెన్సు వుంది. అదీ జనం జోక్యం చేసుకొని, రోడ్డుకు అడ్డం పడుకొని, యస్.పి. గారు, కలెక్టరుగారు వచ్చే విధంగా చేసిన మీదట యిది జరిగిందనేది కనబడుతూవుంది. అప్పుడు హాస్పటల్ సర్టిఫికేటు వచ్చింది. ఆ తరువాత కూడా ఒక హరిజన బాలికపై జరిగిన అత్యాచారాన్ని తీవ్రంగా తీసుకొని విచారించే బదులు, సబ్‌యిన్‌స్పెక్టరు చక్కగా చేశాడు అనే పద్ధతిలో మీరు వుంటే, మేము చేయగలిగింది ఏమీలేదు. ఈ రాష్ట్రములో వున్న హరిజనులందరికీ చాలా బ్రహ్మాండంగా రక్షణ కలుగుతుందని అనుకోవడం తప్ప యింకేమీ జరుగదు. ఇప్పటికయినా ఆ సబ్ యిన్స్‌పెక్టరును అక్కడనుండి మార్చండి. కనీసం అదయినా చేసి విచారణ జరిపించండి.

చైర్మన్ :—గౌరవ సభ్యులు చెప్పినట్లుగా సబ్ ఇన్‌స్పెక్టరును అక్కడ నుండి మార్పించి విచారణ జరిపిస్తామని చెప్పండి.

శ్రీ ఎ. మాధవరెడ్డి :—అధ్యక్షా, ఐ.జి.ని పంపించి, విచారణ జరిపించి, డాక్టర్‌ని గాని, సబ్ ఇన్‌స్పెక్టర్‌ని గాని పొరపాట్లు వుంటే చర్య తీసుకుంటాము.

శ్రీ ఎన్. రాఘవరెడ్డి :—అధ్యక్షా, సబ్ ఇన్‌స్పెక్టరు అక్కడే వుంటే, విచారణ సరిగా జరుగుతుందా ? న్యాయం జరుగుతుందా ?

శ్రీ ఎ. మాధవరెడ్డి :—అధ్యక్షా, మీరు చెప్పినట్లే సబ్ ఇనస్పెక్టరును అక్కడ నుండి మార్చి, విచారణ జరిపిస్తాము.

Chairman :—The remaining 304 and the calling attention matters are postponed for tomorrow.

The House, now stands adjourned for 15 minutes for Tea-Break.

( The House, then adjourned at 11-27 A.M. )

(సభ తిరిగి ఉదయం 11-47 గం.లకు సమావేశమైనది)

(ఉప సభాపతి అధ్యక్ష స్థానములో ఉన్నారు)

## 1989-90 సంవత్సరమునకు బడ్జెటుపై సాధారణ చర్చ

శ్రీ సి.హెచ్. విఠల్ రెడ్డి :—అధ్యక్షా, ఈ ఆరు సం వత్సరాల పరిపాలనలో అనుసరిస్తున్న దివాళాకోరు ఆర్థిక విధానం వలన ప్రగతి సంపూర్ణముగా స్థంభించి పోయింది. నీటిపారుదలే కాని, విద్యుచ్ఛక్తి రంగములో కాని, రోడ్లు, మురుగు కాలువలు, స్కూల్స్, హాస్టల్స్, ఆసుపత్రుల కార్యక్రమాలు అన్నీ స్థంభించిపోయాయి, నిలిచిపోయాయి. కాబట్టి, ఈనాడు ఈ ఆర్థిక ప్రగతి, రాష్ట్ర ప్రగతి స్థంభించిపోయిందని అనడానికి నేను విచారపడుతున్నాను. అంతేగాక 1989-90 బడ్జెట్‌ను ఆర్థిక మంత్రిగారు ప్రవేశపెట్టారు. అది కూడా రూ. 230.39 కోట్ల లోటు బడ్జెట్. దీనిని ఏ విధంగా పూడుస్తారనేది వారి యొక్క సూచనలలో కాని, వారి యొక్క ఉపన్యాసాలలో కాని కనపడడం లేదు. కాని దీనిపైన నేను కోరేది ఈ లోటు, ఈ అంకెల గారడీ చూస్తే ఇంకా అదనముగా కూడా లోటు వుంది. ఈ లోటును పూడ్చే పరిస్థితులు, మన రాష్ట్రములో ఆర్థిక పరిస్థితులు, వనరులు లేవని మనవి చేస్తున్నాను. ఈ లోటు అనేది అసలు బడ్జెట్ మటుకే పరిమితమై లేదు. ఈ లోటు వలన అభివృద్ధి కార్యక్రమాలకు కేటాయించినది చివరకు మనము వదలుకోవలసి వస్తుంది, తగ్గించుకోవలసి వస్తుందని నేను మీ ద్వారా ఆర్థిక మంత్రిగారికి మనవి చేస్తున్నాను. ఈ నాడు మనము ఎక్సయిజు లోను, ఇతరత్రా సేల్సుటాక్సు రూ. 800 కోట్ల వరకు యితర రంగాలలో ప్రధానమైన పన్ను వేశాము. నీటి తీరువ పన్ను రైతులపైన విధిస్తున్నారు. తిరిగి అదనంగా పన్నులు వేసి, రూ. 200 కోట్ల లోటును పూడ్చుకొనేందుకు ఆర్థిక వనరులు సేకరించే రంగాలు కూడా లేవు. పన్నులు వేసే విధానాలు లేవు కనుక ఈ లోటును పూడ్చే విధానం కూడా కానరావడం లేదు. ఇందుకుగాను ఒకటే మార్గం ఉంది. ధనికవర్గాలపైన పన్నులువేసి పూడ్చగలరా? ఆ రకంగా డబ్బు రాబట్టగలరా? ఆర్థిక మంత్రి గారు ఏదీ స్పష్టంగా చెప్పలేదు. ధనికవర్గాలపైన పన్నులు వేసే పరిస్థితి లేదు కనుక స్పష్టంగా చెప్పలేదు. మన ప్రణాళికను సుమారు రూ. 7,500 కోట్లకు రూపొందించుకున్నాము. ప్రణాళికా సంఘంవారు మన ప్రణాళికను రూ. 5,200 కోట్లకు రూపొందిస్తే, రూ. 7,500 కోట్లు ఖర్చు చేయగలము, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టగలము అని ఆ మేరకు ప్రణాళికను రూపొందించాము. ఉ. 11-50

కానీ ఇప్పటికి నాలుగు సంవత్సరాలయింది. కానీ వనరులు సేకరించినది మాత్రం రూ. 650 కోట్లు మాత్రమే. 1990 మార్చి నాటికి 7 వ ప్రణాళిక పూర్తి అవుతుంది. అప్పటిలోగా రూ. 1700 కోట్లు ఖర్చు చేయాలి. ఇంకా రూ. 1000 కోట్లు ఎట్లా సేకరిస్తారు? సేకరించే స్థితిలో లేము. ఖర్చు చేసే స్థితిలో లేము. ఏమయినా క్రొత్త పన్నులు విధించవలసివస్తుంది. విద్యుచ్ఛక్తి, నీటి పారుదల వంటి ముఖ్యమైన రంగాలలో మరం కుదించవలసిన పరిస్థితి వచ్చింది అనే విషయం మరచిపోరాదు. నీటి తీరువా మనకు ఏ విధంగా ఉందో మీ ద్వారా ఆర్థిక మంత్రిగారి దృష్టికి తెస్తాను. నీటి వనరుల క్రింద రూ. 290 కోట్లు మాత్రమే కేటాయించాము. తీవ్రమైన దుర్భిక్ష ప్రాంతాలు, వెనుకబడిన ప్రాంతమయిన రాయలసీమ పరిస్థితి చూస్తే, కేంద్ర ప్రభుత్వము ఆమోదించిన పెన్న అహోబిలం, శ్రీశైలం కుడి కాలువలకు వనరులు కేటాయించలేదు. ఆ కార్యక్రమం "నత్తనడక" లాగా జరుగుతోంది. బచావత్ ట్రిబ్యునల్ నీరు కేటాయించినది. మహబూబ్‌నగర్ జిల్లా వెనుకబడిన ప్రాంతం అనావృష్టికి గురిఅవుతున్నది. నాలుగు సంవత్సరాలయినా జూరాల ప్రాజెక్టు పూర్తికావడంలేదు. తగిన నిధులు కేటాయించడంలేదు. విశాఖపట్టణం ఉక్కు ఫ్యాక్టరీ గురించి మనకందరకూ తెలుసు. అది ఇతర రాష్ట్రాలకు తరలించే పరిస్థితి వస్తే, సమైక్య కమ్యూనిస్టు పార్టీ వీరోచిత పోరాటం చేసింది. ఒక సందర్భంలో సుమారు 12 మంది మరణించారు. శాసన సభ్యులం రిజైన్ చేసి బయటకు వెళ్ళాము. ఉక్కు ఫ్యాక్టరీ స్థాపించి ఇప్పటికి 10 సంవత్సరాలయినా పూర్తి కావడం లేదు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించవలసి ఉంటుంది. ఏలేరు ప్రాజెక్టు ఇప్పటికి పూర్తికావడం లేదు. దీనివల్ల ఆర్థికాభివృద్ధి కుంటుపడి, మనకు వచ్చే ఆదాయం రాకుండా పోతుంది. ప్రభుత్వం బాధ్యత విస్మరించడం జరుగుతోంది చివరకు ఏలేరు ప్రాజెక్టుకి కేంద్ర ప్రభుత్వం నిధులు ఇచ్చినా సకాలంలో ఖర్చు చేయడం లేదు. త్వరితగతిన పూర్తి చేయడం లేదు. మహత్తరమైన ఈ ప్రాజెక్టు కూడా సకాలంలో నిర్మించుకోలేకుండా ఉన్నాము. నిర్మించుకుంటే కోట్ల రూపాయల ఆదాయం వచ్చేది. ఈ విషయంలో ప్రభుత్వం సంపూర్ణంగా విఫలమయిందని చెప్పకతప్పదు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఉంది. వంశధార ఉంది. శ్రీశైలం ఎడమ గట్టు సొరంగం నేటికీ పూర్తి కాలేదు. ఈ ప్రభుత్వంయొక్క దివాలా కోరువిధానం వల్ల ఏ ప్రాజెక్టుల వల్ల అయితే వెనుకబడిన ప్రాంతాలకు నీరు అందించగలమో, వాటికి పూర్తి చేయలేకపోవడం జరుగుతోంది. చిన్న, మధ్యతరగతి ప్రాజెక్టులకు కేటాయించిన నిధులు సక్రమంగా ఖర్చు చేయడం లేదు. పర్యవసానంగా 7వ పంచవర్ష ప్రణాళికలో కూడా ప్రాజెక్టులు పూర్తి చేసే పరిస్థితి లేదు. 8వ ప్రణాళికలో అయినా పూర్తి చేస్తామనే విశ్వాసం ఆంధ్రప్రదేశ్‌లో గల అరుకోట్ల ప్రజలకూ లేదని చెప్పవలసి వస్తున్నది. ప్రాజెక్టులకు కేటాయించిన డబ్బు ఖర్చు చేయడం లేదు. తక్కువగా కూడా కేటాయిస్తున్నారు. గోదావరిపైన నిర్మించవలసిన పోలవరం, ఇచ్చంపల్లి వంటి భారీ ప్రాజెక్టులు ఎన్ని సంవత్సరాలకు పూర్తి అవుతాయో చెప్పలేని పరిస్థితి, పరిస్థితి

చూస్తే, ఏ ఒక్క ప్రాజెక్టు అయినా ఆరు సంవత్సరాలలో పూర్తి చేశారా? నీరు ఇవ్వగలిగారా? ఏ ఒక్క ప్రాజెక్టు ద్వారా అయినా ఆదాయం పెంచుకో గలిగామా? లేదే? ఈ ప్రభుత్వం అనుసరించే దివాలాకోరు విధానాల వల్ల కావడం లేదని మనవిచేస్తున్నాను. మెదక్ జిల్లాలో సింగూరు ప్రాజెక్టుకి జి.ఓ. ఎం. ఎస్. నెం. 486, తేది 31-10-88లో 40 వేల ఎకరాలకు నీరు ఇస్తామని వాగ్దానం చేసినా, వాగ్దానంగానే ఉంది. తిరిగి అంచనా రు. 18 కోట్లకు పెరిగింది. 46 గ్రామాలు మునిగిపోతాయి. వాటి పునర్నిర్మాణం ప్రభుత్వం చేపట్టడం లేదు. ఆ 46 గ్రామాల వారు వలసపోతున్నారు. కేంద్రప్రభుత్వం కూడా దీని అమలుకు ఒక షరతు పెట్టింది. 46 గ్రామాలకు పునరావాసం చేపడితేనే, అనుమతి ఇస్తామని ఉంది. ఆ అడ్డుని తొలగించటానికి రాష్ట్ర ప్రభుత్వ ఏ రకమైన చర్యలూ తీసుకోలేదు. 1988 మే నెలలో "ఆర్థిక కొరత ఉంది కనుక ఈ ప్రాజెక్టు నిర్మాణం ఇప్పుడు చేయవలసిన పని లేదు" అని టెలిగ్రాం కూడా వచ్చింది. దీనిని ప్రభుత్వం గమనించాలి.

విద్యుచ్ఛక్తి రంగం కీలకమైనది. రాష్ట్రాభివృద్ధికి దోహదం చేసే రంగం ఇది. దీనికి కేటాయించినది రు. 272 కోట్లు, తీసుకునే పరపతి, ఇచ్చే దానితో కలిపి. ఈ 6 సంవత్సరాలలో ఒక్క మెగావాటయినా ఉత్పత్తి అయిందా? దేశాభివృద్ధికి, రాష్ట్రాభివృద్ధికి కీలకమయిన ఈ రంగం పట్ల ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యం చూపుతున్నదో అవగాహనచేసుకోవాలి. ఆర్థికమంత్రిగారు ఆత్మవిమర్శ చేసుకుని సమాధానం చెప్పాలి.

దీనివల్ల మన పరిశ్రమలు ఎన్నో మూలపడ్డాయి. ఉత్పత్తి ఎంతో తగ్గిపోయింది. మన రాష్ట్రానికి దాని మీద వచ్చే ఆదాయం ఎంతో తగ్గిపోయింది. నిరుద్యోగ సమస్య పెరుగుతోంది. నేను తరువాత వివరాలు చెబుతాను. విజయవాడ థర్మల్ స్టేషన్ రెండవ దశ కూడా ఇంతవరకు ప్రారంభించలేదు. ఉత్పత్తి పెరగడం లేదు. చాలా విద్యుచ్ఛక్తి కేంద్రాలు ఉన్నాయి. కానీ 2, 3 సంవత్సరాలనుంచీ వర్షాలు లేనందున ప్రాజెక్టులలో విద్యుత్తు ఉత్పత్తి కావడం లేదు. మన అదృష్ట వశాత్తు ఈ సంవత్సరం వర్షాలు పడ్డాయి. ప్రాజెక్టులలో నీళ్లున్నాయి. మన రాష్ట్రానికి విద్యుచ్ఛక్తి ఎంత అవసరమో అంత ఉత్పత్తి చేయడం లేదు. వ్యయం కూడా చేయడం లేదు. నిర్మాణాత్మకంగా ఆలోచించుకోండి. వర్షాలు పడినప్పటికి, నీళ్ళున్నప్పటికి 30, 40 శాతం కట్ చేస్తున్నాము. పోయిన సంవత్సరం 80 శాతం కట్ చేశాము. వ్యవసాయ రంగానికి, పారిశ్రామిక రంగానికి కట్ చేయడం వల్ల ఎంతో ఆదాయం పోయింది. ఎన్నో పరిశ్రమలు మూలపడ్డాయి. ఉత్పత్తి పైన రూ. 500 కోట్ల ఆదాయం తగ్గిపోయింది. వ్యవసాయ రంగంలో మనకు వచ్చే రూ. 200 కోట్ల ఆదాయం పోయింది. మొత్తం రు. 700 కోట్ల ఆదాయం పోగొట్టుకున్నాము. ఈ సంవత్సరం కూడా 30, 40 శాతం కరెంటు కట్ చేయడం వల్ల సుమారు రూ. 500 కోట్ల ఆదాయం తగ్గే పరిస్థితి ఉంది. ఇది క్షమించరాని విషయం. ఈ రంగానికి ప్రాముఖ్యత నివ్వడం లేదు. వేలాది, లక్షలాది మంది కార్మికులు బయట కూర్చున్నారు. ఎంతో బాధ పడుతున్నారు.

12-00

విద్యుచ్ఛక్తి రంగానికి ఎక్కువ కేటాయింపులు చేయక ఇతరులపైన ఆధారపడి ఉన్నారు. ముద్దనూరు థర్మల్ స్టేషన్ ఎప్పుడు ప్రారంభిస్తారు? ఎప్పుడు పూర్తి చేస్తారు? వనరుల మాట ఏమిటి? ప్రపంచ బ్యాంకు అంటున్నారు? ఎప్పటికి చేస్తారు? విద్యుచ్ఛక్తి కొరత తీరుస్తారా? ప్రజలను భ్రమ పెట్టడానికి వాగ్దానాలు చేసి మోసం, దగా చేయడానికి పూనుకున్నారని చెప్పడానికి చాలా విచారపడుతున్నాను. ఇది చేయడానికి మాకు సాధ్యం అవుతుంది, మేము ఇవి నిర్మిస్తాము, 5 సంవత్సరాలలో, 2 సంవత్సరాలలో ఇంత విద్యుచ్ఛక్తి ఇవ్వగలము అని మీరు నిర్మొఖమాటంగా ప్రజల ముందు, సభలో ఆర్థిక మంత్రిగారిని చెప్పమనండి. అది స్థాపిస్తాము, ఇది స్థాపిస్తామని చెప్పి ప్రజలను నమ్మించలేరు.

మన ఆంధ్రప్రదేశ్ వ్యవసాయిక రాష్ట్రం. 75 శాతం రైతులు భూముల పైన ఆధారపడి, నీటిపైన, విద్యుచ్ఛక్తిపైన ఆధారపడి జీవిస్తున్నారు. కాని ఉత్పత్తి చేసిన దానికి గిట్టుబాటు ధర లేదు. రాష్ట్రం యొక్క బాధ్యతలను ఏదో ఒక దానిపైన నెడుతున్నారు. రైతులే ధర నిర్ణయించాలి, రైతులే అమ్ముకోవాలి అని చెప్పి మీ బాధ్యతలను విస్మరిస్తున్నారు. రాష్ట్ర కర్షక పరిషత్తుపైన బాధ్యత నిలుపుతున్నారు. ఈ కర్షక పరిషత్తుకు వనరులు ఏవి? ఏమి చేయగలుగుతారు? గిట్టుబాటు ధర ఇవ్వగలుగుతారా? దీని పర్యవసానాలు మీరు అనుభవించవలసి ఉంటుంది. రైతులు గమనిస్తున్నారు. పోయిన ప్రభుత్వాన్ని కూడా, వారి పరిపాలనను, గమనించారు. ఇప్పుడు మిమ్ములనుకూడా గమనిస్తారు. రైతులు చైతన్యవంతులు. రైతులు గిట్టుబాటు ధర లేక బాధ పడుతున్నారు. బీద వారు బలహీన వర్గాల వారు ఉత్పత్తి చేస్తారు. ధరలు తగ్గిపోతాయి. మరలా వారి దగ్గర ఉత్పత్తి లేనప్పుడు భాగ్యవంతులు, మధ్యదళారీలు అవకాశం తీసుకొని బాగుపడుతున్నారు, మీ యొక్క విధానాల వల్ల లాభపడుతున్నారు. పేదవారు బాధ పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి చేతనయిన కార్యక్రమాలు కూడా చేయడం లేదు. మన పొరుగు రాష్ట్రంలలో చెరుకుకు టన్నుకు రూ. 300 లు ఇస్తుంటే ఈ రాష్ట్ర ప్రభుత్వం రు. 249 ప్రకటించింది. మహారాష్ట్ర కాంగ్రెసు ప్రభుత్వం, కర్నాటక కాంగ్రెసేతర ప్రభుత్వం వాళ్లు టన్నుకు రూ. 300 లు ఇస్తున్నారు. ఈ ప్రభుత్వం రైతుల ప్రభుత్వం అనీ, రైతులకు అండగా ఉన్న ప్రభుత్వం అనీ, తెలుగుదేశం ప్రభుత్వం అని చెప్పుకొంటున్నారు తప్ప రైతులకు ఏమి చేస్తున్నారు, వాళ్లు ట్రాన్స్‌ఫర్ ఖర్చులు కూడా ఇస్తున్నారు. కానీ మన చెరుకు రైతులను దివాళా తీసే విధానంగా ఉంది. మనకు చెప్పుకోవడానికి ఒక్కటే ఉంది. కిలో రూ. 2/-లు బియ్యం. ముసలి వాళ్లకు ఇచ్చే పెన్షన్. ఇవన్నీ ప్రజలను ఆకర్షించే విధానాలు.

గ్రామీణ ప్రాంతాలలో కూడా ఈ ప్రభుత్వ విధానం దిగజారిపోతున్నది. ఇది స్థిరంగా వుండే పరిస్థితి లేదు. ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. మా జిల్లాలో 30 వేల గ్రీన్ కార్డులను వెరిఫికేషన్ నిమిత్తం తీసుకొన్నారు. తిరిగి వాపస్ ఇవ్వలేదు కలెక్టర్ వెరిఫికేషన్ చేసిన తరువాత 60 వేల గ్రీన్ కార్డులు వాపస్ యివ్వవలసివుంటే 60 వేలు కాదు గదా కనీసం 10 వేల

కార్డులు కూడా కావడం లేదు. కాబట్టి వున్న గ్రీన్ కార్డులు లాక్కున్నారు. కొత్త గ్రీన్ కార్డులు యివ్వడం లేదు. కాబట్టి ఈ విధానం దిగజారిపోతున్నది. ఇది గమనించవలసిన అవసరం వున్నది. క్రొత్తగా వచ్చిన ఆర్థిక మంత్రిగారు ఈ రెండు రూపాయలకు కిలో బియ్యం పథకం కోసం 322 కోట్ల రూపాయలు కేటాయించారు. అంత మొత్తం వాస్తవంగా ఖర్చు కావడం లేదు. అయినా ట్రాన్స్‌ఫోర్టేషన్ విషయంలో విశాఖపట్టణం నుంచి మెదక్, మెదక్ నుండి విశాఖపట్టణం ఈ విధంగా 100 కోట్ల రూపాయలు వృధా అవుతున్నాయి. అలాగే బ్లాక్ మార్కెటింగ్ విపరీతంగా జరుగుతున్నది. ఈ బ్లాక్ మార్కెట్ పద్ధతిని అరికట్టే స్థోమత వీరికి లేదు. కాబట్టి ఇందులో రూ. 100 కోట్లు వృధా అవుతున్నాయి. ఈ ప్రభుత్వం వారు పేద వారికి అందించేది 100 కోట్ల బియ్యం మాత్రమే. ఎంత వృధా అవుతున్నదో అర్థం చేసుకోవాలి. కాబట్టి ఇది లాభప్రదం కావాలంటే టోకు వ్యాపారాన్ని జాతీయం చేయాలి. ఇది వారి నుంచి అయ్యే పనేనా, వారికి సాధ్యం అవుతుందా? ఈ టోకు వ్యాపారాన్ని నిర్వహించగలుగుతారా? ఇది ఈ ప్రభుత్వం చేస్తుందనే విశ్వాసం మాకు లేదు. ఎందుకంటే వారు చేస్తున్న కార్యక్రమాలు సంపూర్ణంగా విఫలం అవుతున్నాయి. ఓట్లు సంపాదించుకొనేందుకు వారికి సాధ్యం కానివి కూడా వాగ్దానం చేస్తున్నారు అని నేను చెప్పకతప్పదు.

ఇక విద్యా విధానం ఎంత లోపభూయిష్టంగా తయారు అయిందంటే చెప్పనవసరం లేదు. ఈ నాడు మన రామారావుగారు, రాజీవ్ గాంధిగారు ప్రకటించిన నూతన విద్యా విధానం ఏ విధంగా వున్నదో ఒకసారి అర్థం చేసుకో వలసిన అవసరం వున్నది. ఈనాడు మన రాష్ట్రంలో 22 వేల ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా వున్నాయి. ఒక నెలలో అన్ని పోస్టులు భర్తీ చేస్తామని మన ముఖ్యమంత్రిగారు రెండు నెలల క్రితము స్టేట్‌మెంట్ యిచ్చారు. ఒక నెల దాటి పోయింది. ఇంక రెండు, మూడు నెలలు దాటిపోయాయి. నాలుగవ నెల వస్తున్నది. ఒక ఉపాధ్యాయుడి పోస్టు అయినా భర్తీ చేయగలిగారా? చేయలేదు. మరి ఎందుకు మోసపూరితమైన వాగ్దానాలు చేస్తారు? విచిత్రమైన విషయం ఏమిటంటే ఉన్నత విద్యావిధానాన్ని ప్రయివెటేజేషన్ చేస్తున్నారు. మన రాష్ట్రం పేద రాష్ట్రం. అట్టడుగున వున్న బలహీన వర్గాల పిల్లలు ఉన్నత విద్య చదువుకొనే అవకాశాన్ని తొలగించారు. ఇది అమెరికా కాదు. భారత దేశం. మీరు ఆ అమెరికా విధానం ఇక్కడికి దిగుమతి చేసుకొంటున్నారా? ఆ విధానాన్ని ఇక్కడ ప్రవేశ పెడుతున్నారా? ఈ విధానం ఈ దేశానికి వర్తించదు. ఇది ప్రమాదకరమైనది. ఈ నాడు జూనియర్ కాలేజీలను ఓపెన్ చేసే ఆర్థిక స్థోమత లేదు. కో ఆపరేటివ్ సొసైటీల ద్వారా ఓపెన్ చేసుకోమంటున్నారు. కో ఆపరేటివ్ సొసైటీల ద్వారా ఓపెన్ చేసుకొంటే పేద పిల్లలు ఫీజు చెల్లించు కోలేరు. హరిజనులకు, బలహీన వర్గాల పిల్లలకు ఉన్నత విద్యాసౌకర్యం కల్పిస్తామని ప్రగల్భాలు పలికినారే అది ఈ ప్రభుత్వం చేత కాదని మనవి చేస్తున్నాను. ఇదేనా నూతన విద్యా విధానమని అడుగుతున్నాను. జి.ఓ.ఎం.ఎస్.

నెం. 370 ఉపాధ్యాయులపైన కఠిన సాధింపు చర్యగా వున్నది. వీరికి ఓట్లు వేయలేదని వాళ్లను లొంగతీసుకోడానికి ఒక డివిజన్ నుండి ఇంకొక డివిజన్‌కు ట్రాన్స్‌ఫర్ చేస్తున్నారు. మన ఆర్థిక మంత్రిగారికి ప్రాక్టికల్‌గా తెలుసు. ఎంత ఇబ్బంది అవుతున్నది. ఏ ఏ సంస్థలు మూత పడుతున్నది. ఎవరు సక్రమంగా పని చేయడం లేదు. అందుకే కక్ష సాధింపు చర్యలు తీసుకోవద్దు. ప్రభుత్వోద్యోగులపైన కూడా కక్ష సాధింపు చర్యలు తీసుకొంటున్నారు. దీని పర్యవసానంగా మనం సాధించవలసిన లక్ష్యాలు, ప్రణాళికలు విఫలం అవుతున్నాయి. ప్రాజెక్టులకు కేటాయించిన డబ్బులు ఖర్చు కావడం లేదు. ఎవరయితే పని చేసి ముందుకు పోయే వారు వుంటారో, ఎవరయితే నిర్మాణానికి పూనుకొంటారో వాళ్లతో శత్రుత్వం పెట్టుకొంటారా? వారితో శత్రుత్వం పెట్టుకొంటే ప్రణాళికలు సక్సెస్ కావు. వారి ఉపాధ్యాయుల మీద, ప్రభుత్వ ఉద్యోగుల మీద పగనా? ఈ విధంగా అయితే సాధ్యం అవుతుందా?

ఇక ప్రధానమైనది భూ సంస్కరణలు. గ్రామీణ ప్రాంతాలలో కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యాన అప్పుడు వున్న ముఖ్యులు, చాలా మంది దేశభక్తులు 4 వేల మంది తెలంగాణా పోరాటంలో ప్రాణాలు అర్పితం చేసారు. దాని పర్యవసానంగా అప్పుడున్న ప్రభుత్వం అనివార్య పరిస్థితులలో భూ సంస్కరణలు తీసుకురావడం జరిగింది. ఆ భూ సంస్కరణలు తెచ్చిన భూస్వాములకు అన్ని అవకాశాలు కలిగించారు. జల్లెడ చట్టంలో ఎన్ని చిల్లులు వున్నాయో ఆ చట్టంలో కూడా అన్ని అవకాశాలు కలిగించడం జరిగింది. అయినప్పటికి గత ప్రభుత్వం నాలుగు వెల ఎకరాలు పంపిణీ చేస్తే ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత 500 ఎకరాలు అయినా పంపిణీ చేశారా? భూ స్వాముల దగ్గర నుండి స్వాధీనం చేసుకొన్నారా? ఆ న్యాయాక్రాంతమైన భూములను ఆ భూస్వాముల దగ్గర నుండి స్వాధీనం చేసుకోవచ్చని సుప్రీంకోర్టు తీర్పు యిచ్చింది. దీనికి సంబంధించి ఒక అమెండ్‌మెంట్ తీసుకురమ్మన్నారు. అది తీసుకు రావడానికి వారికి దమ్ములు లేవు. చిత్తశుద్ధి లేదు. ముఖ్యమంత్రి ఇబ్బంది ఏమిటో మాకు తెలుసు. వారి పార్టీలో భూస్వామ్య శక్తులు ప్రవేశించాయి ఏమైనా భూ సంస్కరణలు తెచ్చినట్లయితే కుప్ప కూలిపోతారు. అందుకే భయపడి ఈనాడు అలాంటివి తేవడానికి సిద్ధంగా లేరు. కాంగ్రెస్‌లో కూడా భూస్వాములు వున్నారు. ఈ సవరణలు తీసుకురమ్మంటే అప్పటి ప్రభుత్వం కూడ వాళ్లకు లొంగి సవరణలు తీసుకురాలేదు. ఈ ప్రభుత్వం కూడా ఆ సవరణలు తీసుకవచ్చే పరిస్థితిలో లేదు.

ఇక శాంతిభద్రతల గురించి చెప్పే అవసరమే లేదు. తెలుగుదేశంలో కూడా కులరహిత శక్తులు వున్నాయి కాంగ్రెస్ పార్టీలో కూడా వున్నాయి. నేను కాదనడం లేదు. కానీ ఈనాడు కులాలు రాజకీయాలకు ముడిపడుతున్నది. అందుకే ఏ పార్టీని విమర్శించడం లేదు. కొంత మంది కుల రాజకీయాలు, సమ్మెవాళ్ళు, గుండాలు ఈ పార్టీలో ప్రవేశిస్తున్నారు. ఈ కుల రాజకీయాలతోటి

ఈనాడు దేశం విధ్వంస కాండకు గురి అయింది. విజయవాడ సంగతికి నేను వెళ్ళడం లేదు. ఈ కుల రాజకీయాలు వున్నంత సేపు మన రాష్ట్రం అభివృద్ధి కాజాలదు.

కుల రాజకీయాలను తమ స్వార్థానికి ఉపయోగించుకొని అధికారం చేపట్టాలని కొంతమంది ప్రయత్నం చేస్తున్నారు. అది కొనసాగకూడదని మనవి చేస్తు 12-20 గం. మ.
న్నాను. ఇది ఇటు కాంగ్రెసు వారికి, అటు తెలుగుదేశం పార్టీ వారికి కూడా నేను చెబుతున్నాను. కుల రాజకీయాలతో తిరిగి ప్రభుత్వంలోకి రావాలని ప్రయత్నిస్తే ప్రజలు బుద్ధి చెబుతారని, గుణపాఠం నేర్పుతారని మనవి చేస్తున్నాను. అదే విధంగా మనం ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలి. మన ముఖ్యమంత్రిగారు ఎప్పుడూ ప్రజాస్వామ్యం ప్రజాస్వామ్యం అని చెబుతూవుంటారు కాని చేతలలో ఎక్కడా ప్రజాస్వామ్యం కనబడడం లేదు. నిరంకుశ విధానమే కనిపిస్తున్నది. వ్యక్తిగత పాలన మంచిది కాదు. నిర్మాణాత్మకములయిన విమర్శలు వస్తే వాటిని సహృదయంతో స్వీకరించాలి కాని ఉద్రేకపడకూడదు. నిరంకుశ ధోరణిలో వ్యక్తిగత పాలన కొనసాగితే అది పార్టీ విచ్ఛిత్తికి దారితీస్తుంది. ఇప్పటికే విచ్ఛిన్నం అయ్యే పరిస్థితి వచ్చింది, విచ్ఛిన్నం అవుతున్నది గవర్నరుగారి ప్రసంగంపై జరిగిన చర్చకు సమాధానం ఇస్తూ ముఖ్యమంత్రిగారు మా పార్టీ విషయాల్లో ఎవరు జోక్యం చేసుకున్నా సహించను అన్నారు. దానికి నేను విచారపడ్డాను. ఆరుకోట్ల మంది ప్రజలు వారికి ఓటు వేసి వారి పార్టీని గెలిపించారు. దానికి మేము కూడా సహకరించాము, కమ్యూనిస్టుపార్టీ కూడా సహకరించింది. మేమందరం మీ వెనకనే వున్నాము కనుక విమర్శించే హక్కు మాకు కూడా వుంది. వారి నిరంకుశత్వానికి ఒక ఉదాహరణ చెబుతాను. ఒక్క కలం పోటుతో 31 మందిమంత్రిలను తొలగించారు, కాని పరిణామాలు అనుభవించవలసివస్తున్నది. కనుక నిరంకుశ ధోరణిని విడచి విమర్శనాత్మక సూచనలను స్వీకరించాలని కోరుతూ చెప్పవలసిన విషయాలు ఇంకా చాలా వున్నప్పటికీ సమయం లేదు కనుక ఇంతటితో సెలవు తీసుకుంటున్నాను.

డా. ఆర్. రవీంద్రనాథ రెడ్డి :— అధ్యక్షా, బడ్జెటును ప్రవేశపెట్టిన రాజయ్యగారిని వ్యక్తిగతంగా అభినందిస్తున్నాను. కాని ఆర్థికమంత్రిగా వారిని అభినందించలేక పోతున్నాను. 280 కోట్ల రూపాయల లోటు చూపుతూ దానిని ఎలా భర్తీ చేయాలో సూచించనందుకు అభినందించలేకపోతున్నాను. సంక్షేమ కార్యక్రమాలను వారు అభివృద్ధి కార్యక్రమాలుగా పేర్కొన్నారు. సింగిల్ విండో, కర్షక పరిషత్, ప్రజా సంస్థల ఏర్పాటు, కొన్ని శాఖల విలీనీకరణ మొదలైనవి అభివృద్ధి కార్యక్రమాలుగా తెలిపారు, ఇది చెల్లని రూపాయికి గీతలు ఎక్కువ అన్నట్లుగా వుంది. వీటివల్ల అభివృద్ధి ఎలా మెరుగు అవుతుందని అడుగుతున్నాను. ఈ బడ్జెటును చదివిన తరువాత ఇది వాగ్దానాల పెరుగుదలగా, నినాదాల మెరుగుదలగా కన్పిస్తున్నది, ఉత్పత్తి తరుగుదలగా కన్పిస్తున్నది. వారు తమప్రసంగంలో ఏడవ పంచవర్ష ప్రణాళికలో సంఘం ఆమోదించిన పెట్టుబడి 5200 కోట్ల రూపాయలే అయినా మన పెట్టుబడి 6000 కోట్లకు మించవచ్చు

నని తెలిపారు. సర్వే ఆఫ్ ఎకనమిక్ ట్రెండ్స్‌లో మీరు తెల్పింది చూస్తే మీరు పెట్టుకున్న ప్రొవిజన్ 7500 కోట్ల అయితే ఆరువేల కోట్లను మాత్రమే కేటాయించారు. దీనివల్ల ప్రజలను ఏ విధంగా మభ్యపెడుతున్నారో అర్థమవుతుంది. ప్రధాన రంగాలైన ఇరిగేషన్, ఎలక్ట్రిసిటి, ఇండస్ట్రీస్, మైన్స్, వాటర్ సప్లయి, హెల్త్ అండ్ మెడికల్, న్యూట్రిషన్ వీటికి చాలా తక్కువ కేటాయింపు చేయడం జరిగింది. ప్రాజెక్టుల విషయం చూస్తే ఏడవ పంచవర్ష ప్రణాళికలో ప్లాన్ ఔట్ లే, రు. 2050 కోట్లు, 1988 వరకూ మనం ఖర్చు పెట్టింది రూ. 817 కోట్లు, ఇరిగేషన్‌కు సంబంధించిన 531 కోట్ల రూపాయల షార్ట్ ఫాల్ చూపించారు, ఇరిగేషన్ ప్రాజెక్టుల విషయంలో వెనుకబడిన ప్రాంతాలకు ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. మహబూబ్‌నగర్ జిల్లాలో జూరాల ప్రాజెక్టు ద్వారా 1990 నాటికి నీరు ఇస్తామని చెప్పారు. ఇది సాధ్యమా అని అడుగుతున్నాను, తప్పక ఇస్తామని ముఖ్యమంత్రిగారు ఛాలెంజి చేసి చెప్పగలరా అని అడుగుతున్నాను. ఇప్పుడిప్పుడే టెండర్స్ పిలిచారు. కనీసం స్పిల్ వే పనులు కూడా కావు. ఎందుకు అబద్ధాలు చెబుతారని అడుగుతున్నాను. అక్రమ భూముల గురించి అనేకసార్లు తెలిపాము. కర్నాటక, మన చీఫ్ ఇంజనీర్లు విన్పించుకోవడం లేదు, వాటిని ఆపాయకపోవడం వల్ల తెలంగాణా ప్రాంతానికి అన్యాయం
12-30 మ. జరుగుతున్నది. రాయలసీమకు నీరు పోతున్నది, అదే విధంగా జూరాల ప్రాజెక్టుకు ప్రతి సంవత్సరము ఎన్నో కోట్ల రూపాయలు యిస్తున్నామని చెబుతున్నారు. ఈ సంవత్సరం యిచ్చింది ఎంత? 14 కోట్ల రూపాయలు, ఇట్లా యిస్తే 1992 నాటికి జూరాల ప్రాజెక్టును పూర్తి చేస్తారా? అబద్ధాలు చెప్పడం ఎక్కువ అయిపోయింది. భీమా ప్రాజక్టును సర్వే చేయడానికి అయిదు సంవత్సరాలు పట్టింది. ఎలక్షన్ల సందర్భములో ప్రచారం చేసేప్పుడు భీమా ప్రాజక్టును పూర్తి చేసి ఎండు భూములకు పారిస్తామని చెప్పడం ఆనవాయితీగా మారింది. ఈ సంవత్సరం బడ్జెటులో ఒక లక్ష రూపాయలు అయినా కేటాయించారా? అట్లా జరగలేదు. ఈ విధంగా తెలంగాణ ప్రజలను ప్రత్యేకంగా మహబూబ్‌నగర్ లాంటి వెనుకబడిన ప్రాంతాల ప్రజలను దగా చేయడం మాత్రం జరుగుతుందని మనవిచేస్తున్నాను. నెట్టంపాడు ప్రాజెక్టు వుంది. అప్పర్ కృష్ణా ప్రాజెక్టు వల్ల న్యాయం జరుగవలసి వుండెను, అన్యాయానికి గురి అయింది గాబట్టి అక్కడ నెట్టంపాడు ప్రాజెక్టును తీసుకోవలసిన అవసరం వుంది—మహబూబ్‌నగర్ జిల్లాలో—కాని దానికి యింతవరకు డిటేల్డ్ సర్వేకు ఆర్డరు యివ్వలేదు. దానిని ఎప్పుడు తీసుకుంటారో చెప్పాలి. లిఫ్టు ఇరిగేషన్‌కు సంబంధించి ఒంగోలు గుంటూరు జిల్లాలకుయిచ్చిన ప్రాధాన్యతను కనీసం వెనుకబడిన జిల్లాలకు యివ్వాలనే చిత్తశుద్ధి యీ ప్రభుత్వానికి వుందా అని అడుగుతున్నాను. ఆరు లిఫ్టు యిరిగేషను స్కీమ్స్‌కు హైడ్రోలాజికల్ క్లియరెన్సు వచ్చి రెండు సంవత్సరాలు అయినా కూడ యింతవరకు ఫైనాన్సియల్ క్లియరెన్సు యివ్వకుండా పని మొదలు పెట్టకపోతే యీ ప్రభుత్వము వెనుకబడిన ప్రాంతాలను ముందుకు తీసుకుపోతుందని ఆశించనుంటారా? ఈ విధంగా ప్రాజెక్టుల విషయములో అన్యాయం జరుగుతున్నది. ఇక మిగతా విషయాలకు వస్తాను.

సిక్ యిండస్ట్రీస్ విషయం. ఈ రాష్ట్రములో రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా చెప్పిన ప్రకారము 18 వేల స్మాల్ స్కేల్ సిక్ ఇండస్ట్రీస్ వున్నవి–యిన్ వాల్వింగ్ 119,72 క్రోర్స్–ఒక కొత్త పాలసీని ఈ ప్రభుత్వం ఎడాప్టు చేస్తున్నది. ఈ స్మాల్ స్కేల్ సిక్ ఇండస్ట్రీస్‌ను అన్నింటిని మేజర్ ఇండస్ట్రీస్‌కు ఎడాప్ట్ చేసుకోడానికి – వారికి టక్నాలోజి, ఎక్స్‌పర్టయిజ్ వుందని – వారికి యివ్వాలనే –ప్రపోజలు వున్నట్లుగా వుంది. వాటిని మేజర్ యిండస్ట్రీస్ వారి చేతిలో పెడితే తిరిగి అవి స్మాల్ స్కేల్ యిండస్ట్రీస్ ఓనర్సుకు వస్తాయా? లార్జ్ స్కేల్ యిండస్ట్రీస్ 18 మూతపడ్డాయి. అందులో పని చేసే ఉద్యోగులు యీనాడు రోడ్ల మీద పడి ఆకలితో అలమటిస్తున్నారు, వారి గురించి ఆలోచించారా? ఈ మధ్యన ఎన్.ఆర్.ఐ.స్. కాంట్రాక్ట్సుకు ప్రిఫరెన్సు యివ్వాలని కార్డ్‌లెస్ ఫోన్స్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. వారికి లైసన్సు. లెటర్ ఆఫ్ యింటెంట్ ఇవ్వడం జరిగింది. వారు ఎస్టాబ్లిష్ చేయడం జరిగింది అమ్మి వేయడం కూడ జరిగింది. ఇట్లా ఎందుకు జరుగుతున్నది? వారికి ప్రిఫరెన్సు యిచ్చినప్పుడు వాటికి పడవలసిన బాధ్యత వారి వుందా లేదా అని అడుగుతున్నాను.

ఇక గ్రామోదయ ప్రోగ్రాం క్రింద యీ అయిదు సంవత్సరాల కాలంలో 86,701 యూనిట్సు సాంక్షను అయినవి. అయితే గ్రౌండ్ అయినవి 37,051 మాత్రమే. మిగాతావి ఎందుకు గ్రౌండ్ కావడం లేదు? బ్యాంకర్స్ కోఆపరేట్ చేయడం లేదా? లేకపోతే బెనిఫిషరీస్ ముందుకు రావడం లేదా అనేది ఆలోచించాలి. బ్యాంకర్సును కదిలించడానికి ప్రభుత్వంవద్ద యాక్షనువుందా? పోతే మీరు గొప్పగా చెప్పుకునే కూడు, గుడ్డ, గూడు విషయం. కూడు విషయం చూస్తాము. దారిద్ర్య నిర్మూలనకు రెండు రూపాయలకు కిలో బియ్యం స్కీం అని యింతాక చెప్పారు. ఇప్పటికీ నాకు అర్థం కాదు, వివరణ ఇస్తే సంతోషిస్తాను. 1987లో మీరు పంచిన సబ్సిడి బియ్యం 16.8 లక్షల టన్నులు. 1988 నాటికి 12.18 లక్షల టన్నులకు వచ్చింది. అంటే మీ సబ్సిడీ రైస్ స్కీం ఎంత ప్రాముఖ్యత వహిస్తున్నదో అర్థం చేసుకోవచ్చు. 1988 నాటికి 4 లక్షల టన్నుల బియ్యాన్ని తగ్గించారు. ఎల్లో కార్డ్స్ పైన రూ. 3–50 లకు కే.జి. బియ్యం సప్లయి చేయాలని నిర్ణయం తీసుకున్నారు అప్పుడు. ఇప్పుడేమయినా సప్లయి చేస్తున్నారా చెప్పండి.

ఇక విద్యా విషయానికి వస్తే సహకార జూనియర్ కళాశాలలను ఓపెన్ చేశారు. రాష్ట్రంలో 75 కాలేజీలను ఏర్పాటు చేశారు. వాటికి సరైన యిన్‌ఫ్రాస్ట్రక్చరు వుందా? అవి సరిగా పని చేస్తున్నవా? వాటిల్లో చదివే విద్యార్థుల కొరకు బెంచీలు గాని బ్లాక్ బోర్డ్సుగాని ఏమైనా వున్నవా? ఎన్ని మూతబడ్డాయి, ఎంత మంది విద్యార్థు చదువుతున్నారు. ఇండిస్క్రిమినేట్‌గా కోఆపరేటివ్ జూనియర్ కాలేజీలను మీ కార్యకర్తలకో, మీ వారికో సాంక్షను చేయడం వల్ల జరిగే నష్టం మీకేమైనా అర్థం అయిందా? వాటిల్లో చదువుకుంటే ఎడ్యుకేషనల్ స్టాండర్డ్స్ మెరుగు అవుతాయా? ఆ విషయం ఆలోచించండి పోతే యంత్రాంగం మంత్రాంగం మధ్య సమన్వయ లోపం వున్నదని మాకు తెలుస్తున్నది–యీ రాష్ట్రముతో పరిపాలన చూస్తే–విభేదాలు ఎక్కువ అయిపోయాయి. యంత్రాంగం మంత్రాంగం మధ్య సమన్వయ లోపం వల్ల ఏ ఫైలు కదలడం లేదు–మండల

స్థాయిలో, జిల్లా స్థాయిలో, సెక్రటేరియట్ స్థాయిలో—నిన్ననే ఒక పెద్దమనిషి వద్దకు వెళ్ళాము—జాయింటు సెక్రటరీ, హోం డిపార్టుమెంటు. వారు మమ్ములను అర గంట కూర్చోబెట్టుకున్నారు. ఫైలు ఏ స్టేజీలో వుందో చెప్పండి అంటే, నేను ఎవరికి చెప్పవలసిన బాధ్యత లేదు అన్నాడు ఆ పెద్దమనిషి—అట్లా చెప్పించుకోవలసిన ఖర్మ పట్టింది లెజిస్లేటర్సుగా మాకు. పది రోజులుగా ఆ ఫైలు వెంట పడితే స్టేజి తెలుసుకునే పరిస్థితి లేదు శాసనసభ్యులకే, అలాంటప్పుడు ఒక సామాన్య వ్యక్తికి ఫైలు మూవ్‌మెంట్ ఏమి తెలుస్తుంది? ఫైల్సు అన్ని దుమ్ము పట్టి పోతున్నాయి. కదిలించే నాథుడే లేడు. మేము చూచిన పెద్దమనిషి ఫైల్సు మధ్యలో కూరుకుని పోయాడు, అతని ముఖంకూడా కన్పించడం లేదు. అటువంటి పరిస్థితి సెక్రటేరియట్‌లో వుండే ఫైల్సును కదలించడానికి ఏమైనా ఆలోచన చేశారా? అడ్మినిస్ట్రేటివ్ రిఫార్మ్సు తీసుకురావడానికి రుస్తుంజీని వేశారు, ఫీజు ఇచ్చారు. ఆయన చెప్పిన అడ్మినిస్ట్రేటివ్ రిఫార్మ్సు ఏమిటి? వాటిని అమలు చేసే ఆలోచన వుందా?

పోతే హాస్పిటల్సు విషయం. నిన్న, మొన్న, యీ రోజుకూడా ఆ విషయము చర్చకు వచ్చింది. ఆసుపత్రుల కొరకు యింతవరకు – మెడికల్ అండ్ హెల్త్‌కు– అయిదు సంవత్సరాలకు కేటాయించింది రూ. 220 కోట్లు. ఇప్పటి వరకు రిలీజు చేసింది రూ. 72 43 కోట్లు. మిగతా రెండు సంవత్సరాలకు రూ. 72.59 కోట్లు అని నిర్ణయంచేశారు. అంటే షార్ట్ ఫాల్ రూ. 75 కోట్లు—రూ. 75 కోట్లు మెడికల్ అండ్ హెల్త్‌లో కట్ చేశారు. ఈ విధంగా ప్రజలకు అవసరమైన ఆరోగ్యం విషయంలో బడ్జెటు కేటాయింపులు యివ్వకుండా ఒక హాస్పిటల్‌ను డెవలప్ చేయడం అంటే ఎంత అన్యాయమైన విషయమో ఆలోచించండి. ఈ మధ్య సివిల్ సర్జన్స్ ఎసోసియేషను, అసిస్టెంటు సివిల్ సర్జన్స్ ఎసోసియేషన్ కూడ ఒక స్ట్రైక్ నోటీసు యివ్వడం జరిగింది. మీరు ఎప్పుడైనా ఉస్మానియా హాస్పిటల్ వెడితే చూచి వుంటారు. సున్నం వేసిన పాపాన పోలేదు. సంవత్సరానికి 40 రోజులు మనం కలిసే యీ అసెంబ్లీ గేట్‌కు మూడు సార్లు, యీ హాల్‌కు రెండు సార్లు సున్నం వేస్తారు. కాని కంటిన్యుయస్‌గా పేషంట్సు వుండే ఉస్మానియా హాస్పిటల్‌కు ఎన్ని సంవత్సరాలు అయినా సున్నం వేసిన పాపానా పోలేదు. సూపర్ స్పెషాలిటీస్ ఫండ్సు లేక స్టార్వ్ అయిపోతున్నాయి. పేషంట్సుకు ప్రాణ రక్షణ కల్పించే డయాలిసిస్ లాంటి యూనిట్స్ అవుట్ ఆఫ్ ఆర్డరుగా వున్నవి. డిఫైబ్రిలేటరు లేక యం. వి. నర్సింగ్ నాయక్‌గారు చనిపోయిన విషయం మీకు తెలుసు. దాని మీద ఏమైనా ఎంక్వయిరీ చేస్తున్నారా? గత సంవత్సరము, టి.బి. హాస్పిటల్ సూపరింటెండెంట్‌గా వున్న పి. వి. ఆర్. భాస్కరరావు ఎంతో అన్యాయం చేస్తున్నాడు, అవినీతికి పాల్పడుతున్నాడు కొన్ని లక్షల రూపాయలు తిని వేశాడని నేను చెబితే, అతనిని ట్రాన్స్‌ఫర్ చేసినట్లుగా మరునాడు పేపర్సులో వచ్చింది. చాలా సంతోషించాను, యీ ప్రభుత్వం పని చేసే ప్రభుత్వం అనుకున్నాను. కాని పని కాదు, ఆశ్రితపక్షపాతం వుంది. అతనే చక్కటి వ్యక్తి అని యిప్పటి వరకు అతనిని కదిలించలేదు. అక్కడే వుంచడం జరిగింది. పైగా మెరిట్ సర్టిఫికెట్సు యిచ్చి వుండవచ్చు. ఇంకా కొన్ని లక్షల రూపాయలు కేటా

యించారని తెలుస్తున్నది వారు అంత చక్కటి అడ్మినిస్ట్రేటరు అని. అంటే బంధు
ప్రీతే గాకుండా ఆశ్రిత పక్షపాతం కూడ చోటు చేసుకుంటూ ఆని అడుగుతున్నాను.
ఎన్నో ప్రైమరీ హెల్తు సెంటర్సులో డాక్టర్లు లేరు. అక్కడ నర్సులు ట్రీట్ 12-40 మ.
మెంట్ చేస్తున్నారు. రియాక్షను ఇచ్చే పెన్సిలిన్ ఇంజక్షన్సు కూడా వారు
ఇస్తున్నారు. ఎంతోమంది చచ్చిపోతున్నారు. అది మీకు తెలుసా? అందుచేత
వెంటనే వాటిలో డాక్టర్లను అప్పాయింటు చేయండి. నిజాం ఆర్థోపెడిక్ హాస్పి
టలుపైన ప్రభుత్వం ప్రత్యేకమైన ప్రేమ చూపిస్తున్నది? It should not be
at the cost of the common man దానికి ప్రత్యేకత ఎందుకు? ఉస్మానియా
హాస్పిటలు, గాంధీ హాస్పిటల్సుకు ప్రపంచంలో రెప్యుటేషను ఉంది. ఆ రెప్యుటే
షను ఉన్న హాస్పిటల్సుకు ప్రాముఖ్యత ఇవ్వాలని చెబుతూ ఉంటే వాటికి ఇవ్వడం
లేదు. మేము ఎన్నిసార్లు చెప్పినా యాక్షను ఉండదు. కంఠశోష మిగులుతున్నది.
టి. బి. హాస్పిటలు సూపరింటెండెంటు శ్రీ భాస్కరరావుగారి గురించి ఏమి
చేస్తున్నారు? ఆ విషయం తెలియజేయాలని కోరుతున్నాను.

లా అండ్ ఆర్డర్ విషయం గురించి మనవిచేస్తాను. ఈనాడు నక్సలైట్లు పేరలల్ గవర్నమెంటు నడుపుతున్నారు కొన్ని జిల్లాలలో. అక్కడ మీ కంట్రోలు లేదు మీ వ్యవస్థలు లేవు. మీ మండల్ ఆఫీసులు అక్కడ మిథ్యగా మిగిలి పోయాయి. వాటన్నింటిమీద నక్సలైట్సుకు కంట్రోలు ఉంది. ఈ విషయంలో మీరు ఏమి చేయబోతున్నారు. గ్రేహౌండ్సు వస్తున్నారని మీరు గత రెండు సంవత్సరాల నుంచి అంటున్నారు. వారు ఎక్కడ ఉన్నారు? మనకు కనిపించడం లేదు. వారికి ఇచ్చే ట్రెయినింగు ఏమిటి? వారికి హైదరాబాదులో ట్రెయినింగు ఇస్తున్నారా లేకపోతే ఇంపోర్టు చేసుకొంటున్నారా? ఆ విషయం గురించి చెప్పడం లేదు. ఈ విషయాలు మీరు గుర్తించాలని మనవిచేస్తున్నాను. నక్సలైట్లు మందు పాతరలు పెట్టి పోలీసులను నిర్దాక్షిణ్యంగా చంపివేసారు. వారి దగ్గర మోడరన్ ఎక్విప్‌మెంటు ఉంది. పోలీసులకు కూడా మోడరన్ ఎక్విప్‌మెంటు ఇస్తారా? నక్సలైట్సును ఎదుర్కొనడానికి పోలీసులకు ట్రెయినింగు ఇస్తారా? మినిస్టరు గారు ఈ విషయాల గురించి తెలియజేయాలి. ఈ మధ్య సిజనవాడలో జరిగిన పరిస్థితి మనకు తెలుసు. మొన్న ఒంగోలులో తెలుగుదేశం శాసనసభ్యుని ఇంటి మీద ఎవరో దాడిచేసారు. అందువల్ల లా అండ్ ఆర్డరును కంట్రోలు చేయడం మీవల్ల కాదని మాకు అర్థం అయింది. పోలీసు డిపార్టుమెంటు అంతా వేకప్ చేస్తే పని మెరుగు అవుతుందని చెప్పారు. ఇప్పుడు ఏమైనా మెరుగు అయిందా? ఇంకా హరిజనులమీద, స్త్రీలమీద అత్యాచారాలు జరుగుతున్నాయి కదా. వీటన్నింటిని అరికట్టుటకు ప్రభుత్వం ఏమి చేస్తున్నది? నక్సలైట్ ఏరియాలకు పోయే ఉద్యోగులకు ప్రత్యేకమైన ఎలవెన్సును ఏర్పాటు చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని మనవిచేస్తున్నాను. పోలీసు ఆఫీసర్లలో అవినీతిపరులు ఉన్నారని, వారు ప్రేక్షన్సును ఎంకరేజి చేస్తున్నారని మేము చెబితే వారిమీద ఎటువంటి యాక్షను తీసుకోవడం లేదు. వారికి సపోర్టు చేస్తున్నారు. గద్వాల సర్కిల్ ఇనస్పెక్టరు విషయం నేను చాలాసార్లు చెప్పాను, పిటిషను ఇచ్చాను. లంచాలు

తింటున్నాడు. క్రైమ్‌ను ఎంకరేజి చేస్తున్నాడని ఎన్నోసార్లు చెప్పాను. ఇంతకుముందున్న హోం మినిష్టరుగారు ఆయనను ట్రాన్స్‌ఫర్ చేసామని నాకు టెలిఫోను చేశారు. ట్రాన్స్‌ఫర్ చేసారని సంతోషించాము. కాని ఆయన ఇంత వరకు ట్రాన్స్‌ఫర్ కాలేదు. ఆయన అక్కడ తెలుగుదేశం కార్యకర్తకు సహాయం చేసాడట. తెలుగుదేశం పార్టీ సర్కిల్ ఇనస్పెక్టరు అని అక్కడివారు చెప్పుకొంటున్నారు. ఈ అధికారులందరు ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ వ్యక్తులే. ఈ విషయం గ్రహించాలి. రూ. 20 వేలు లంచం తీసుకొని అవతల వేరే వ్యక్తిని సపోర్టు చేస్తున్నాడని మీకు చెబితే మీకు చీ. కుట్టినట్లు కూడా లేదు. అవినీతి పరులైన అధికారులను మీరు సపోర్టు చేస్తూవుంటే లెజిస్లేటర్సు నిస్సహాయంగా ఉండి ఏమి చేయాలో తెలియడం లేదు. ఇప్పుడు పోలీసు వ్యవస్థ అంతా మంత్రుల చేతులకే వెళ్ళిపోయిందని మనవిచేస్తున్నాను.

పవర్ కట్ గురించి సభ్యులు చాలామంది చెప్పారు. ముఖ్యమంత్రిగారు వాగ్దానం చేసారు. 6 గంటల కన్నా ఎక్కువ కట్ ఉండదని చెప్పారు. కాని 10, 12 గంటలు పవర్ కట్ ఉందని మనవిచేస్తున్నాను. ప్రతి సంవత్సరం 10.5% ఎలక్ట్రిసిటీ ఎక్కువ అవసరం అవుతుంది. అది జనరేషన్ చేసుకోవాలి. ఆ విధంగా మీరు ప్లాన్ చేశారా ? 6 సంవత్సరాలనాడు ఏ జనరేషను అయితే ఉందో అదే జనరేషను ఇప్పుడూ కొనసాగుతున్నది. ఏమీ పెరగలేదు. ఎలక్ట్రిసిటీ బోర్డు ఒక పద్మవ్యూహం. ఇందులో ఏమి జరుగుతున్నదో ఎవరికీ అర్థం కావడం లేదు. మా దగ్గర ఒక అసిస్టెంటు ఇంజనీరును ట్రాన్స్‌ఫర్ చేసారు. ఆయన మంచివాడు. ఎప్పుడో విజిలెన్సు వారు వచ్చినప్పుడు ఏదో పొరపాటు చేసాడట.. తెలియకుండా జరిగిన దానికి ఆయనను ట్రాన్స్‌ఫర్ చేసారు. బోర్డు మెంబర్సును అడిగితే ఆయనను రిలెయిన్ చేయలేదు, ఇంకొకరిని వేయలేదు. ఈ బోర్డులో ఏమి జరుగుతున్నదో తెలుసుకొనడానికి ముగ్గురు చైర్మన్‌లను అయినా పెట్టండి. జనరేషనుకు ఒకరిని, సర్వీసెస్‌కు ఒకరిని, ట్రాన్స్‌మిషనుకు ఒకరిని పెట్టండి. ఒకే చైర్మన్‌ను పెడితే ఈ పరిస్థితి ఏర్పడుతున్నది. ఈ ఎలక్ట్రిసిటీ బోర్డు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కంట్రోలులో ఉన్నట్లు కనిపించడం లేదు.

ఈనాడు మన రాష్ట్రం నుంచి పెద్ద పరిశ్రమలన్నీ తరలిపోతున్నాయి. మన రాష్ట్రంలో పెద్ద పరిశ్రమలు వచ్చే అవకాశం లేదు. ఉన్న పరిశ్రమలను కాపాడుకుందామని అనుకుంటే అవి మూతపడిపోతున్నాయి. వాటిని తెరవడానికి కూడా మనం అవకాశం ఇవ్వడం లేదు. నాన్‌కన్వెన్షనల్ ఎలక్ట్రిసిటీ–గ్యాస్, సోలార్ మొదలైన వాటి నుంచి ఎక్కువ ఎలక్ట్రిసిటీ జనరేషను అయ్యే ఏర్పాటు ఏమైనా చేస్తున్నారా? ఈ ఇండస్ట్రీస్ మూతపడడం వల్ల రాష్ట్ర ఎక్చెకర్ తగ్గిపోవడం లేదా అని అడుగుతున్నాను. పర్ సిల్కు ఫ్యాక్టరీలో ఎంతో మంది బ్రతుకుతున్నారు. ఈనాడు వారిని ఆకలిబాధలకు గురిచేసారు. చాలా మంది

నీచమైన వృత్తులకు కూడా దిగజారిపోయారు. వారి గురించి ఏమీ పట్టించుకోవడం లేదు. దానిని మూత వేయడం జరిగింది. కేంద్ర ప్రభుత్వానికి రిపోర్టు పంపించమని అంటే రిపోర్టు పంపించలేదని మనవి చేస్తున్నాను.

అగ్రికల్చర్ విషయం మనవి చేస్తాను. మనం ఎంతో పురోభివృద్ధి సాధించాము, అందులో నూతనత్వం సాధించామని చెప్పారు. వాల్యూమ్ 7లో సర్వే అండ్ ఎకనమిక్ ట్రెండ్స్ నుంచి కొన్ని విషయాలు చెబుతాను. రైస్ 1982–83లో 76.72 లక్షల టన్నులు ఉత్పత్తి అయితే 1987–88 వరకు మన ఉత్పత్తి 70.87 లక్షల టన్నులకు తగ్గిపోయింది. అంటే 6 లక్షల టన్నులు ఉత్పత్తి తగ్గిపోయింది. అదే విధంగా జువార్, షుగర్ కేన్, టుబాకో మొదలైన వాటి నన్నింటి ఉత్పత్తి తగ్గిపోయినట్లు కనిపిస్తున్నది. ఎంతో ఇరిగేషను డెవలప్ చేస్తామని అంటున్నారు మీరు. ఎక్కువ ఆయకట్టు సాగులోకి వచ్చిందని అంటున్నారు. అటువంటప్పుడు ఉత్పత్తి ఎందుకు తగ్గిపోయింది అని అడుగుతున్నాను. రైతులకు ఇంట్రెస్టు రిబేటు ఇచ్చారు, చాలా సంతోషం. రైతులకు మేలు జరిగింది. కాని అది ఎప్పుడు ఇచ్చారు? అనావృష్టి సంవత్సరాలలో ఇచ్చారు. ఇంట్రెస్టు రిబేటు ఈ సంవత్సరం చివరవరకు పొడిగించాలి. అది చేస్తే బీద రైతులు బాగుపడతారని మనవిచేస్తున్నాను. ఎవరైతే అగ్రికల్చరల్ లోన్సు కట్టలేకపోయారో వారికి ఆ లోన్సు మాఫీ చేయాలని మా భారతీయ జనతాపార్టీ చెబుతున్నది. హర్యానాలో చేసినట్లుగా ఇక్కడ కూడా చేస్తే ఆ క్రెడిట్ మీకు దక్కుతుంది. రైతులు మీకు ఓట్ల రూపంలో ఋణం చెల్లించడం జరుగుతుందని మేము చెప్పడం జరిగింది. కాని దానిమీద యింతవరకు యాక్షను లేదు. దాని విషయంలో వెంటనే చర్య తీసుకోవాలని మనవిచేస్తున్నాను.

నేత కార్మికుల గురించి మా పార్టీ శాసన సభ్యులు శ్రీ పి. శ్రీరాములు గారు ఎప్పుడూ చెబుతూ ఉంటారు. వారు ఈనాడు ఆకలిచావులకు గురి అవుతున్నారు. వారికి కావలసిన మగ్గాలు, రంగులు, రసాయనాలు సబ్సిడీ రేట్లకు అందించవలసిన అవసరం ఎంతైనా ఉందని మనవిచేస్తున్నాను.

గిరిజన లాండ్సు ట్రాన్స్‌ఫర్ విషయంలో ఎ. పి. ట్రయిబల్ అడ్వయిజరీ కౌన్సిలు ఈ యాక్టును రిపీల్ చేయాలని చెప్పడం జరిగింది. అది ఎంతవరకు సమంజసమో మీరు ఆలోచించాలి. ట్రయిబల్ లాండ్సును నాన్‌ట్రయిబల్సుకు ట్రాన్స్‌ఫర్ చేసే విషయంలో అడుగు చాలా జాగ్రత్తగా వేయాలి. ట్రయిబల్సు ఆందోళన మొదలుపెడితే ఈ ప్రభుత్వ పరిస్థితి ఏమి అవుతుందో ఒకసారి ఆలోచించండి. ఈ విషయంలో అన్ని పక్షాలతో ఒకసారి సమావేశం చేసి దీనిని రిపీల్ చేయాలా వద్దా అని ఆలోచించి నిర్ణయం తీసుకుంటే మంచిదని మనవి చేస్తున్నాను.

లాండు రిఫారమ్సు విషయంలో కమ్యూనిస్టు సోదరులు చెప్పారు. ఉన్న సర్‌ప్లస్ లాండు పంచండి. ఖాళీగా ఉన్న ల్యాండు ఈ రాష్ట్రంలో ఎంతో ఉంది. దాని హద్దులు ఎవరికీ తెలియడం లేదు. ఎవరి కబ్జాలో ఉన్నది వారే

అక్యుపై చేసుకొంటున్నారు. ఇంతకుముందు శ్రీ బద్దం బాల్‌రెడ్డిగారు చెప్పారు. నేరేడుమెట్టులో భూదాన ల్యాండు ఎంతో మిగిలింది. అది పేదవారికి గుడిసెకోసం పంచాలని ఎన్నోసార్లు విజ్ఞప్తులు చేయడం జరిగింది. కాని అక్కడ ల్యాండు గ్రాబర్సు ఎవరైతే ఉన్నారో వారు పక్కా బిల్డింగ్స్ కట్టుకొని అక్కడ నివశిస్తున్నారు. వాటిమీద యాక్షను తీసుకోవాలని మనవి చేస్తున్నాను. ఇటువంటి విషయాలలో సరైన నిర్ణయాలు తీసుకోవలసిన అవసరం ఎంతో వుంది.
12-50 మ. ఎసైన్‌మెంట్ కమిటీస్‌లో అన్ని పార్టీల వారికి ప్రాతినిధ్యం ఇవ్వండి. ఎట్రాసిటీస్ ఆన్ ఉమెన్. డౌరీ డెత్స్ జరుగుతున్నాయి. స్త్రీల మీద అనేక అన్యాయాలు జరుగుతున్నాయి. ముఖ్యమంత్రి స్త్రీలకు రిక్రూట్‌మెంట్‌లో 30 శాతం రిజర్వేషను ఇస్తామన్నారు. కానీ 24 మంది మంత్రులుంటే ఒక్కరే స్త్రీ ఉన్నారు. ఆ చేసేదేదో ఇక్కడ నుంచి చేస్తే క్రింది వరకు పాకుతుంది. రిక్రూట్‌మెంట్ విషయంలో బ్యాన్ లిఫ్టు చేశామని క్రిందటి శాసనసభా సమావేశంలో చెప్పారు. అయినా రిక్రూట్‌మెంట్ ఎందుకు జరగడం లేదు? 27 లక్షల మంది నిరుద్యోగులు ఈ రాష్ట్రంలో ఉన్నారు – వారికి బెంగాల్‌లో లాగా ఎలవెన్స్ ఇవ్వండి. ఫ్రీ బస్ పాస్‌లు ఇవ్వండి – కనీసం ఫ్రీ పాసుల మీద ప్రయాణం చేసి ఇన్‌టర్‌వ్యూలకు వెళ్ళే పరిస్థితి కల్పించండి. మీకు జ్ఞానం ఉంటే ఆ 27 లక్షల మందిని ఆవిధంగా మీ వోటర్స్‌గా మార్చుకోండి. నేటివిటీ జి. ఓ. గురించి–ఔట్ ఆఫ్ డివిజన్ బదిలీ చేయాలని నిర్ణయం తీసుకున్నారు. దానివల్ల ఏ టీచర్ సరిగ్గా పనిచేయడం లేదు. శనివారం వెళ్ళిపోతే సోమవారం వస్తాడు – సరిగ్గా డ్యూటీ చేయడం లేదు. విద్యార్థులకు బోధన జరగడం లేదు. నాన్ ఫార్మల్, ఎడల్ట్ ఎడ్యుకేషన్ సరిగ్గా జరుగుతున్నదా ఒక కమిటీ వేసి పరిశీలించండి. 100 రూపాయలు, 105 రూపాయలు ఇచ్చి బయటి వారిని ఇన్‌స్ట్రక్టర్సుగా వేయడం– వారు వర్క్ చేయకుండా వెళ్ళిపోవడం జరుగుతున్నది. ఈ ప్రభుత్వం ఎన్.జి.ఓ.లకు వ్యతిరేకం – ఐ.ఏ.ఎస్., ఐ.పి.ఎస్., మీద విరుచుకుపడ్డారు – డాక్టర్సు కూడా వ్యతిరేకం అయ్యారు. అందరికీ వ్యతిరేకం అయితే పరిపాలన చేసేది ఎవరు? ఎన్జీవోలకు స్ట్రయిక్ పిరియడ్‌కు జీతాలు ఇవ్వండి – వారితో ఒక ఎమికబుల్ సెటిల్‌మెంట్ చేసుకోండి – కాంప్రమైజ్ చేసుకోండి. ప్రభుత్వం నడిచేది వారితోనే కనుక ఒక కాంప్రమైజు ఎగ్రిమెంటు చేసుకోండి. ఇరిగేషన్ విషయంలో–ఛానల్స్ రిపేర్సు జరగడం లేదు కెనాల్స్ రిపేర్సు జరగడంలేదు– పి.డబ్ల్యు.డి పబ్లిక్ వేస్ట్ డిపార్టుమెంటుగా తయారయింది–మీరు నిధులు ఇవ్వడం లేదు – ఎలా చేస్తారు? ఆర్ అండ్ బి, పంచాయితీ రోడ్సు వర్షం పడినప్పుడు గుంటలు పడితే రిపేర్ చేయడం లేదు. లోకల్ బాడీస్‌కు ఇవ్వవలసిన నిధులు ఇవ్వకపోతే ఏమి పని చేస్తారు? జిల్లా పరిషత్తు చైర్మన్ ఎక్కడైనా ఒక టీచర్‌ను బదిలీ చేయాలంటే ఇక్కడికి రాయాలి జీతాలకు, టి.ఏ లకు కూడా డబ్బు లేదు ప్రభుత్వం దగ్గర. కన్సల్టేటివ్ కమిటీస్ ఉన్నాయి అన్ని డిపార్టుమెంటులకు – వాటని రివైవ్ చేయండి–తరుచుగా మీటింగ్స్ పెట్టండి. అక్కడ కొన్ని సమస్యలు పరిష్కారం అయితే ఇక్కడ అసెంబ్లీలో ఫసిగా ఉండదు. రిటైర్ అయిన

పెన్షనర్స్ విషయంలో సానుభూతి చూపించాలి. ఫిషి కల్చర్‌ను వ్యవసాయ శాఖకు తీసుకుని పౌల్ట్రీ ఫారమ్స్‌కు ఇస్తున్నట్లుగా సబ్సిడీలు ఇవ్వండి. వ్యవసాయ కార్మికుల విషయంలో కాంప్రెహెన్సివ్ లెజిస్లేషన్ చాలా అవసరం - అది తీసుకు వచ్చి వారి జీవితాలు మెరుగుపర్చాలి. రూరల్ ఎంప్లాయిమెంట్ గ్యారంటీ స్కీము విషయంలో మహారాష్ట్రలో ఒక పద్ధతి ఉంది. ప్రతిరోజూ వారికి పని చూపించాలి - చూపించకపోతే పనికి బదులుగా ఆ రోజుకు రేషన్ ఇచ్చే పద్ధతి ఉంది. అలాంటి స్కీము ఏర్పాటు చేయండి. ఆవిధంగా ప్రభుత్వానికి ఎంతో క్రెడిట్ వస్తుంది. ల్యాండ్ ఎక్విజిషన్ విషయంలో - వీకర్ సెక్షన్స్‌కు హౌస్ సైట్స్‌కు ల్యాండ్ ఎక్వయిర్ చేయడం మూడు సంవత్సరాల నుంచి మాని వేశారు - కారణం ఏమిటి? చెప్పండి. ఫిమేల్ నర్సింగ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్స్ అని కొత్తగా వెలిసాయి. అలాంటివి ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో మష్‌రూమ్స్ లాగా ఉన్నాయి - వారు అధికారుల మద్దతు సంపాదించి, డిప్యూటీ డైరెక్టర్, సోషల్ వెల్‌ఫేర్ ద్వారా స్కాలర్‌షిప్స్ సంపాదించడం జరుగుతున్నది. అందులో ఎన్నో కుంభకోణాలు జరుగుతున్నాయి. శ్రీరాంసాగర్, నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజక్టుల క్రింద హరిజనులకు ఇచ్చిన భూముల విషయంలో ఇంతవరకు కంపెన్‌సేషన్ చెల్లించలేదు. వారు ఎంత ఖర్చుపెట్టి ఆ భూములు డెవలప్ చేశారో ఆలోచించండి. పాస్ చేసిన జి. ఓ. ఉపసంహరించుకుంటూ వెంటనే కంపెన్‌సేషన్ చెల్లించండి. క్యాస్ట్ సర్టిఫికేట్స్ అధికారులను ఇవ్వమన్నారు - అనధికారులు ఎమ్మెల్యేలు కూడా ఇవ్వవచ్చని అన్నారు. అధికారులు పొరపాటు చేస్తే చర్య ఉంటుంది - అనధికారులు చేస్తే ఏమి ఉంటుంది - ముఖ్యమంత్రికి పరిశీలించాలి కనుక అనధికారుల నుంచి తీసివేయండి. తప్పుడు క్యాస్ట్ సర్టిఫికేట్స్ వల్ల ఎగ్రికల్చరల్ సీట్స్, ఇంజనీరింగ్ సీట్స్, టెక్నికల్ సీట్స్, మెడికల్ సీట్స్ నాన్ ఎస్.సి.లకు, నాన్ ఎస్.టి.లకు పోతున్నాయి. అది ఆ వర్గాల వారికి మేలు చేసినట్లు కాదు. వ్యవసాయం విషయంలో 15 రూపాయలు పర్ టన్ ఇచ్చామన్నారు — ఆ జి. ఓ. ఇచ్చినట్లు లేదు - ఎవ్వరికి యివ్వడం లేదు. రైతులకు పాస్‌బుక్స్ విషయంలో చట్టం చేసుకొన్నాము. కానీ యింతవరకు ఎలాంటి సర్వే గానీ పాస్‌బుక్స్ యిచ్చే పద్ధతి గానీ మొదలుపెట్టలేదు. వెంటనే యివ్వాలి. పటేల్ పట్వారీ వ్యవస్థ రద్దుచేసి దాని స్థానంలో ప్రత్యామ్నాయ వ్యవస్థ ఏమీ చేయలేదు. రికార్డ్స్ అప్ టు డేటుగా లేనందున రికార్డ్స్‌లో అనేక లోపాలు జరుగుతున్నాయి. వాటిని వెంటనే సరిచేయవలసిన అవసరం వుంది. పాస్ బుక్స్ అందరికీ అందేలా చూడాలి. బీడీ కార్మికులు ఈ దేశంలో సుమారు లక్ష మంది ఉన్నారు. చిన్నపిల్లలు, ముసలివారు కూడా పని చేస్తున్నారు. ప్రతి సంవత్సరం 10 శాతం సెస్ వసూలు చేస్తున్నారు, ఇది రాష్ట్ర ఖజానాకు జమ కావడం లేదు - కేంద్రానికి పోతున్నది. సుమారు 10 కోట్ల రూపాయలు ఎక్యుమ్‌లేట్ అయినది. ఈ పదికోట్ల 1-00 మ రూపాయలు వారిదగ్గర నుంచి తీసుకుని బీడీ కార్మికుల గురించి హాస్పిటల్స్, వారి సౌకర్యములు కల్పించడానికి ప్రయత్నం చేస్తే బాగుంటుంది. బీడీ కార్మికులకు

హాస్పిటల్ సౌకర్యము చేస్తే బాగుటుంది ఈ సొమ్ముతో. వారిదగ్గర నుంచి 10 కోట్ల రూపాయలు వెనుకకు తీసుకోవడానికి ఈ రాష్ట్రప్రభుత్వము ఎందుకు యిబ్బంది పడుతున్నది. బీడీ కార్మికుల పిల్లలకు కూడా హాస్పిటల్ సౌకర్యాలు ఏర్పాటు చేయండి. బీడీ కార్మికుల పిల్లలు అయిదు సంవత్సరముల నుంచి 10 సంవత్సరముల పిల్లలు కూడా బీడీ కార్మికులుగా పనిచేస్తారు కాబట్టి వారికి టి.బి. స్కిన్ డిసీజ్, లంగ్ డిసీజ్ వచ్చే అవకాశాలు ఉన్నాయి. కాబట్టి బీడీ కార్మికులతో పాటుగా వారి పిల్లలకు కూడా అంటే 100 నుంచి 200 మంది వరకు ఉన్నటువంటి బీడీ కార్మికులకు డిస్పెన్సరీ ఏర్పాటు చేయాలి. వారికి మొబైల్ డిస్పెన్సరీస్ ఏర్పాటు చేయండి. 10 కోట్ల రూపాయలు సెంట్రల్ గవర్నమెంటు నుంచి ఏ విధంగా తీసుకుని ఖర్చు చేస్తారో మీరు తీసుకునే యాక్షను మీద ఆధార పడి ఉంటుంది. బీడీ కార్మికులు గురించి లేబరు వెల్ఫేర్ ఫండు ఏర్పాటు చేయండి. బీడీ కార్మికుల పిల్లల కోసము చైల్డు లేబరు యాక్టు అప్లయిఅయేటట్లు చూడండి. ఎంప్లాయిమెంటు గ్యారంటీ స్కీముకు సంబంధించి మా పార్టీ తరపున నుంచి ఈ హౌసులో బిల్లు ఇంట్రడ్యూస్ చేశాము. మహారాష్ట్రలో ఉన్నటువంటి పద్ధతిలో ఈ రాష్ట్రప్రభుత్వము ఎంప్లాయిమెంటు గ్యారంటీ స్కీమును ఏర్పాటు చేయాలని మనవి చేస్తున్నాను. క్రాంతి పథకములో ఈ పద్ధతి ఉండేది. ఆ పథకంలో అన్యాయాలు, దుర్వినియోగాలు జరిగినందువలన ఆ పథకము అభాసు పాలైనది. కాబట్టి మహారాష్ట్రలో ఉన్నటువంటి పద్ధతిలో మన రాష్ట్రములో కూడా ఎంప్లాయిమెంటు గ్యారంటీ స్కీమును తీసుకోవాలని మనవి చేస్తున్నాను. ఒకసారి టాక్సేషన్ విషయానికి వస్తే 1982-83 సంవత్సరములో స్టేట్ టాక్సు 808 కోట్ల రూపాయలు. అందులో స్టేట్ ఎక్సైజ్ ఆదాయం 235 కోట్ల 47 లక్షల రూపాయలు. 1989-90 సంవత్సరానికి ఎక్సైజు 639 కోట్ల 20 లక్షల రూపాయలు. ఆదాయం పెరిగినది. యిది ఎట్లాగు ఉందంటే 'Rob the Robin and pay the Peter.' Now. 'Pay the Peter and rob the Robin.' అన్నట్లుగా రెండు కిలోల బియ్యము వారికి సప్లయి చేసి ఆ చేతితో వారిని దోచుకుంటున్నారు. 230 కోట్ల రూపాయల నుంచి 630 కోట్ల రూపాయలకు ఎక్సైజు ఆదాయం పెరిగిందంటే యిది ఎవరివలన పెరిగిందో మీరు ఆలోచించాలి. పబ్లిక్ డెట్ 1983-84 సంవత్సరములో 2356 కోట్ల రూపాయలు ఉంటే 1989-90 సంవత్సరానికి ఆ పబ్లిక్ డెట్ 5100 కోట్ల రూపాయలకు చేరింది. యిది తిరోగమనం బడ్జెట్. యిది రాష్ట్రాన్ని ముందుకు తీసుకుని వెళ్లే బడ్జెటేనా అని ఆలోచించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను. యిది పని చేసే ప్రభుత్వం లాగ లేదని మనవి చేస్తున్నాను. యిది నాసి రకం ప్రభుత్వం. ఫ్రంట్ చైర్మను అయినారు మన ముఖ్యమంత్రి గారు. ఆల్ ఇండియా లెవలులో వారు ఫ్రంట్‌కు చైర్మను అయినారనే విషయాన్ని ముఖ్యమంత్రి గారు గ్రహించాలి. ఈ అవకాశం యిచ్చినందులకు ధన్యవాదాలర్పిస్తూ శలవు తీసుకుంటున్నాను.

శ్రీ డి. వీరభద్రరావు (కడియం) :— అధ్యక్షా, సమయం తక్కువగా ఉంది. అయినప్పటికి ప్రారంభించమన్నారు కాబట్టి నేను ప్రారంభిస్తున్నాను. It is the power of the party that gives the Legislature its supremacy. బలరాం జక్కర్ గారు అన్నట్లు శాసన సభ కున్నటువంటి ప్రధానమైన అధికారాలలో ఏ సంవత్సరానికి ఆ సంవత్సరము రాష్ట్రానికి కావలసినటువంటి జమా ఖర్చులను గురించి నిర్ణయం చేసి ఆదేశించే అధికారం ఉంది. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ అధికారములోనికి వచ్చిన తరువాత గత ఆరు సంవత్సరాలుగా జరిగిన ప్రగతి గురించి పరిశీలించినట్లయితే గతములో ఉన్నటువంటి ప్రభుత్వాలకు ఈ ప్రభుత్వానికి అభివృద్ధిలోను, ప్రగతిలోను ఉన్నటువంటి వ్యత్యాసము ఎంతో ఉన్నట్లుగా స్పష్టముగా కనపడుతున్నది. ప్లానింగు కమీషను వారు తెలియపరచినట్టుగా రాష్ట్ర ప్రగతిలో ఏ మాత్రం సంబంధం లేదని తెలియపర్చుతున్నాను. పర్ కాపిటా ఇన్‌కం దృష్టిలో తీసుకుంటే ఆల్ స్టేట్స్ ఏవరేజ్ తీసుకుంటే 1982-83 సంవత్సరంలో 1708 రూపాయలు ఉంటే, 1982-85 సంవత్సరములలో మూడు సంవత్సరాల ఏవరేజ్ తీసుకుంటే 2063 రూపాయలు ఉంది. 1976-79 మూడు సంవత్సరాల ఏవరేజ్ తీసుకుంటే, అధికంగా తీసుకుంటే 1189 రూపాయలు ఉంది. వీటిలో 1982-83 సంవత్సరములో ఆల్ స్టేట్స్ ఏవరేజ్ 2063 రూపాయలు ఉన్నప్పుడు ఆంధ్రప్రదేశ్ తలసరి ఆదాయం 2062 రూపాయలు ఉంది. అంటే ఒక రూపాయి తక్కువలో ఉంది. యింతకు ముందు తీసుకున్నట్లయితే 1976-79 మూడు సంవత్సరాలు పరిశీలించినట్లయితే 1189 రూపాయలు ఆల్ స్టేట్స్ ఏవరేజ్ ఉంటే మన రాష్ట్ర తలసరి ఆదాయం 1006 రూపాయలు. అంటే ఆల్ స్టేట్స్ ఏవరేజ్ కన్నా 183 రూపాయలు తక్కువలో ఉన్నామన్నమాట. 1982-85 సంవత్సరాలు మూడు సంవత్సరాలలో ఒక రూపాయి తక్కువలో ఉండడం జరిగింది. ఆ తరువాత 180 రూపాయలు చాలా స్పష్టముగా పెరగడం జరిగింది. పర్ కేపిటా ఇన్‌కం ప్రతి రూపాయి లెక్కలోకి వచ్చి కోట్ల రూపాయలు కారణభూతమైనది. గత ఆరు సంవత్సరాలుగా తెలుగు దేశం ప్రభుత్వం సాధించిన ప్రగతి అని మనకు అవగతం అవుతున్నది. ఆల్ స్టేట్స్ ఏవరేజ్ విషయములో ఇతర రాష్ట్రాలను దృష్టిలో పెట్టుకుంటే - పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ రాష్ట్రాలలో ఎంత పెరిగినది. కాంగ్రెసు పార్టీ అధికారములో ఉన్న యితర రాష్ట్రాలలో ఎంత పెరిగినది పరిశీలించినట్లయితే పెద్ద రాష్ట్రమైన ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాన్ని తీసుకుంటే ఆ రాష్ట్రములో తలసరి ఆదాయం 1598-00 రూపాయలు మాత్రమే. మైనస్ 554 రూపాయలు ఏవరేజ్‌కు తక్కువలో ఉంది. బీహారు రాష్ట్రములో చూసుకున్నట్లయితే 1880 రూపాయలు మాత్రమే. అంటే మైనస్ 781 రూపాయలు. యింకా 781 రూపాయలు పెరిగితే గాని మన స్టేట్ ఏవరేజ్‌తో సరిపోదు. ఇతర సదరన్ స్టేట్స్‌లో తమిళనాడును దృష్టిలోకి తీసుకుంటే, రూ. 1946 1-10 మ.
మాత్రమే తలసరి ఆదాయం. ఇక్కడ మైనస్ 116 అన్నమాట. ఇది ప్లస్ అయితేతప్ప, స్టేట్ యావరేజికి సరిపోదు. ఈ విధంగా చూస్తే ఆంధ్ర

రాష్ట్రీయ తాలూకు ప్రగతి చాలా స్పష్టంగా కనిపిస్తున్నది. అంతేకాకుండా, ఉత్పాదన రాష్ట్రానికి సంబంధించి, నికర ఉత్పాదన రాష్ట్ర ప్రగతి స్పష్టంగా కనిపిస్తున్నది. 1980–81లో రాష్ట్ర ఉత్పాదన, స్థిరీకరింపబడిన ధరల ప్రకారం 8,635 కోట్ల రూపాయలు. అది పెరిగి 9,054 కోట్లకు చేరుకొంది. అంటే 4.9 శాతం ఎక్కువ. అలాగే ప్రస్తుత ధరల ప్రకారం, చూస్తే పెరుగుదల 14,110 కోట్ల నుండి 16,063 కోట్ల రూపాయలకు చేరుకొంది. అంటే 13.8 శాతం అభివృద్ధి పెరిగినట్లు చాలా స్పష్టంగా నికర ఉత్పాదన కనిపిస్తున్నది.

పారిశ్రామికంగా ఉత్పత్తి పెరిగిందా లేదా చూస్తే, కొందరు సభ్యులు చెప్పారు–పారిశ్రామికంగా ఉత్పత్తి తగ్గిందని అన్నారు. సెంట్రల్ గవర్నమెంటు ప్రచురించిన ప్లానింగ్ కమిషన్ రిపోర్టు ప్రకారం చూస్తే, పారిశ్రామికంగా ఈ రాష్ట్రంలో ఉత్పత్తి పెరిగిందని చెప్పడం జరిగింది. 1984–85 సంవత్సరములో 11.3 శాతం వుంటే అది 1985–86లో 17.1 శాతమునకు పెరిగింది. 1986–88లో అదే పర్సంటేజి స్టెయిన్ అవుతూ వచ్చిందని తెలియజేస్తున్నాను. స్టేట్ యావరేజి ప్రైయిస్ ఇండెక్స్ ఫర్ ఇండస్ట్రియల్ వర్కర్స్ దృష్టిలో తీసుకుంటే, ఆల్ ఇండియా ఇండెక్స్ 7 శాతం, మన రాష్ట్ర ఇండెక్స్ 1988–89లో మొదటి ఆరు నెలల తాలూకు ప్రగతి చూస్తే 7.9 శాతం ఈ విధంగా అన్ని కోణాల నుండి ఇటు ఫలసరి ఆదాయం, రాష్ట్ర నికర ఉత్పత్తి, పారిశ్రామిక ఉత్పత్తి స్టేట్ యావరేజ్ ప్రయిస్ ఇండెక్స్ ఇవన్నీ చూస్తే రాష్ట్ర ప్రగతి పెరిగిందని చెప్పాలి. మన రాష్ట్ర బడ్జెటు 1989–90 ని దృష్టిలో తీసుకుంటే 1982–83లో ఎంత వుండేది ? ఈనాడు ఎంతకు చేరుకొంది ? ప్లాన్ ఔట్ లే రు. 1400 కోట్లకు చేరుకొంది. 1982–83లో కేవలం ప్లాన్ ఔట్ లే రు. 550 కోట్లు మాత్రమే. ఆరు సంవత్సరాలలో పెరిగిన ప్లాన్ ఔట్ లే దృష్టిలో తీసుకుంటే మనము ఎంత అధికంగా ప్లాన్ ఔట్ లే పెంచామో స్పష్టంగా కనిపిస్తున్నది. మొత్తం బడ్జెటును 1989–90లో ప్లాన్, నాన్ ప్లాన్ క్రింద ఎంత ఖర్చు చేస్తున్నామో దృష్టిలో తీసుకుంటే 5,332 కోట్ల రూపాయలు. 7వ ప్రణాళికా అంతానికి ప్లాన్ అప్రూవల్ కు పంపగా, కేవలం రు. 5,200 కోట్లకు ప్లాన్ అప్రూవల్ లభించినప్పటికీ, ఆరు కోట్ల రూపాయలు రాష్ట్రప్రభుత్వం ఖర్చు పెట్టడానికి సంకల్పించింది. దానిపై కొందరు సభ్యులు ఆందోళన పడడం, లేదా అనుమానపడినట్లుగా కాకుండా, టార్గెట్ ను పూర్తి చేయడం జరుగుతుందని ఆశిస్తున్నాను. ప్లాన్ ఔట్ లే ప్రయారిటీస్ చూస్తే అత్యధిక ప్రాధాన్యత సాంఘిక సంక్షేమానికి ఇవ్వడం జరిగింది. రెండవ ప్రాధాన్యత నీటిపారుదలకు, మూడవ ప్రాధాన్యత విద్యుచ్ఛక్తికి ఇవ్వడం జరిగింది. నాలుగవ ప్రాధాన్యత వ్యవసాయానికి, ఐదవది రవాణాకు ఈ విధంగా రాష్ట్ర ప్రాధాన్యతలు నిర్ణయింపబడ్డాయి. మనం ఎంత అభివృద్ధి సాధించినప్పటికీ, సాధారణ మానవుడు తనకు ఈ ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఏమి ఇస్తున్నది అని ఆలోచన చేసే సమయం ఇది. ఎపుడో ఒక ప్రాజెక్టు నిర్మించదలచుకొన్నాము, అంటే అంతవరకు మానవుడు వెయిట్ చేసి, చచ్చిపోయే పరిస్థితిలో దాని ఫలితం అనుభవించాలంటే మానవుడు

ఈనాడు వ్యవసాయానికి విలువలేదు. ఈనాడు మానవుడు, నాకు ఏమి ఇస్తున్నారని నిలబడి ప్రశ్నించే రోజులు వచ్చాయి. అంతేకాకుండా, ప్రతి మనిషికి ప్రధానంగా కావలసింది, తిండి, బట్ట, ఇల్లు. రెండుపూట్ల భోజనం చేసిననాడే, ప్రాజెక్టులను నిర్మించడానికి మానవునికి శక్తి వస్తుంది. అదే శక్తి లేనినాడు ప్రాజెక్టులు నిర్మించడం కష్టమవుతుంది. అందువల్ల దేశంలో ఈ రాష్ట్రంలోనే సాంఘిక సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడం అది కూడా ఎన్. టి. రామారావుగారి ప్రభుత్వములోనే ఇవ్వడం జరిగింది. నీటిపారుదలకు 350 కోట్లు, విద్యుచ్ఛక్తికి 235 కోట్లు, వ్యవసాయానికి 174 కోట్లు, రవాణాకు 65 కోట్లు, ఇతర ఖర్చులకు 94 కోట్లు రూపాయలు—ప్లాన్ ఔట్ లే మొత్తం 1400 కోట్ల రూపాయలు. ఈ విధంగా కేటాయింపులు విభజించడం జరిగింది.

పర్సెంటేజిలో చూస్తే, సాంఘిక సంక్షేమానికి 34 శాతం కేటాయించడం జరిగింది. అలాగే, నీటిపారుదలకు 25 శాతం, విద్యుచ్ఛక్తికి 17 శాతం, వ్యవసాయానికి 12 శాతం, రవాణాకు 5 శాతం, ఇతర ఖర్చులకు 7 శాతం కేటాయించడం జరిగింది. వీటన్నింటికి ఇంత ఖర్చు పెరిగిందంటే రాబడి పెంచడం ఎంతయినా అవసరం. రాబడి పెంచకపోతే ఫలితాలు శూన్యంగా వుంటాయి. అందువల్ల స్టేట్ రెవిన్యూ పెంచడానికి ప్రభుత్వము ఆరు సంవత్సరాలలో ఎంతో కృషి చేయడం జరిగింది. ఆ కృషి ఫలించగానే, టాక్సెస్ ఎండ్ డ్యూస్‌ని ప్రధానంగా దృష్టిలోకి తీసుకోవడం జరిగింది, 1982-83 టాక్సెస్ ఎండ్ డ్యూస్ రూ. 1169 కోట్లకు వచ్చాయి. అది పెరిగి 1987-88 నాటికి వచ్చినప్పుడు రూ. 2,550 కోట్లకు చేరకుంది. 1989-90 నాటికి ఎక్స్‌పెక్టెడ్ రెవిన్యూ రూ. 3,240.34 కోట్లు అంటే 1982-83 కు పోల్చి చూస్తే, 71.34 శాతం 1987-88 లో చూస్తే 74.84 శాతం, 1989-90 చూస్తే 71.82 శాతం ఆఫ్ టోటల్ రెవిన్యూ. ఈ విధంగా టాక్సెస్ ఎండ్ డ్యూస్ ద్వారా అత్యధిక ఎమౌంటును వసూలు చేసి, ఈ రెవిన్యూని ప్రభుత్వానికి తీసుకొని వచ్చి, వాటిని ప్రాజెక్టుల మీద, సాంఘిక సంక్షేమానికి ఖర్చు చేయడం జరుగుతున్నది.

అలాగే స్టేట్ టాక్సెస్ ఎండ్ డ్యూస్ షేర్, సెంట్రల్ టాక్సెస్ వీటన్నింటి 1-20 మ.
ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి రాబడులు రావడం జరుగుచున్నది. అలాగే రెవెన్యూ ఎక్స్‌పెండిచరుని దృష్టిలోకి తీసుకుంటే డెవలప్‌మెంటు ఎక్స్‌పెండిచరు నాన్ డెవలప్‌మెంటు ఎక్స్‌పెండిచరు రెండూ ప్రధానమైనవి. డెవలప్‌మెంటు ఎక్స్‌పెండిచరు ఏ రాష్ట్రము అయితే ఎక్కువ పెడుతుందో ఆ రాష్ట్రం ప్రగతి చాల స్పష్టంగా కనిపిస్తుంది. ఇతర రాష్ట్రాలు డెవలప్‌మెంటుకు ఖర్చుపెడుతున్న దానితో పోల్చి చూస్తే మన రాష్ట్రము డెవలప్‌మెంటుకు ఎంత ప్రాధాన్యత ఇస్తుందో తెలుస్తుంది. గత మూడు సంవత్సరాలలోని భారత దేశపు మొత్తం మీద లెక్కలు తీసుకుంటే డెవలప్‌మెంటల్ ఎక్స్‌పెండిచరులో ఆంధ్ర ప్రదేశ్ మూడవ స్థానం లో ఉంది. ఎక్కువ డెవలప్‌మెంటు ఎక్స్‌పెండిచరు ఉన్న రాష్ట్రాలలో మొదటి స్థానం మహారాష్ట్రకు, రెండవ స్థానం ఉత్తర ప్రదేశ్‌కు మూడవ స్థానం ఆంధ్ర ప్రదేశ్‌కు ఉన్నది. 1984-85 సంవత్సరములో మహా

రాష్ట్రంలో 2,521.99 కోట్ల రూపాయలు డెవలప్‌మెంటు ఎక్స్‌పెండిచరుకు కేటాయింపబడ్డాయి. రెండవ స్థానంలో ఉన్న ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వము వారు 2,255.20 కోట్ల రూపాయలు కేటాయించడం జరిగింది. ఖర్చు పెట్టడం జరిగింది. మూడవ స్థానంగా ఉన్నటువంటి ఆంధ్ర ప్రదేశ్ 1860.54 కోట్ల రూపాయిలని ఖర్చు పెట్టడం జరిగింది. ఇది స్టేటు యొక్క ఏక్చువల్ ఎక్స్‌పెండిచరు. 1985-86 డెవలప్‌మెంటల్ ఎక్స్‌పెండిచరు తీసుకుంటే మొదటి స్థానం మహారాష్ట్రలో 2,869 కోట్ల రూపాయలు ఖర్చు, ఉత్తర ప్రదేశ్ 2,688 కోట్ల రూపాయలు ఖర్చు, ఆంధ్ర ప్రదేశ్ 2,369 కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి ఆంధ్ర ప్రదేశ్ మూడవ స్థానం చేరుకుంది. మనం ఈ విధంగా నాన్ డెవలప్‌మెంటు ఎక్స్‌పెండిచరుకి తక్కువ ప్రాధాన్యత ఇస్తూ డెవలప్‌మెంటల్ ఎక్స్‌పెండిచరుకి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది. రెవిన్యూ ఎక్స్‌పెండిచరు ఈ సంవత్సరంని దృష్టిలోనికి తీసుకన్నట్లయితే డెవలప్‌మెంటల్ ఎక్స్‌పెండిచరుకి 3,386 కోట్ల రూపాయలు కేటాయించడం జరిగింది. అంటే ఇది 73 శాతం ఉంటుంది. మొత్తం ఖర్చులో 73 శాతం వరకు కూడా డెవలప్‌మెంటల్ ఎక్స్‌పెండిచరు నిమిత్తం కేటాయించడం జరిగింది. నాన్ డెవలప్‌మెంటల్‌కి కేటాయించిన డబ్బు కేవలము 27 శాతముమాత్రమే. 27 శాతములో కూడ డెట్ సర్వీసెస్ కలిపితే, డెట్ సర్వీసెస్ పది శాతము, ఎడ్మినిస్ట్రేషను 7 శాతము టాక్సు కలెక్షను ఖర్చు 2 శాతము, అదర్ ఎక్స్‌పెండిచరు 8 శాతము. ఈ విధంగా మొత్తము 4,658.6 కోట్ల రూపాయలనుకూడ విభజించడం జరిగింది. మనం ఈ రెవెన్యూ ఎక్స్‌పెండిచరులో డెవలప్‌మెంటల్ ఎక్స్‌పెండిచరు పైడు అత్యధికమైనటువంటి ప్రాధాన్యతను ఇవ్వడం జరిగింది. దీనిలో ఇర్రిగేషను శాశ్వత ప్రాతిపదిక మీద అభివృద్ధిని సాధించే ఐటము. సేద్యపు నీరు సమపాయదలకు ఈ సంవత్సరం 850 కోట్ల రూపాయలు. డీంట్లో మేజరు ఇర్రిగేషనుకి, మీడియమ్ ఇర్రిగేషనుకి 290.25 కోట్ల రూపాయలు మైనరు ఇర్రిగేషనుకి 41.25 లక్షల రూపాయలు డెవలప్‌మెంటుకి కేటాయించడం జరిగింది. అంతేకాకుండా అదనపు సేద్యపు సదుపాయము అనేటటువంటి హెడ్ క్రింద కూడా మనం దృష్టిలోనికి తీసుకున్నట్లయితే దీని వలన ఎన్ని ఎకరాలు సాగులోనికి వస్తుంది అన్నది కూడ పరిశీలన చేయవలసిన అవసరం ఉంది. ఎంత ఖర్చు పెడుతున్నాము అనేది కాకుండా ఎంత భూమి దీనిక్రింద కల్టివేషన్ లోనికి వస్తుంది రావడానికి అవకాశం ఉంది అన్నది లెక్కలోనికి తీసుకున్నట్లయితే మేజర్ అండ్ మీడియమ్ ఇర్రిగేషన్ నుండి 84 వేల ఎకరాలు ఈ సంవత్సరం అదనంగా సాగులోనికి వస్తుందని ఎక్స్‌పెక్టు చేయడం జరిగింది. అంతేకాకుండా మైనర్ ఇర్రిగేషన్ నుంచి 37,500 ఎకరాలు సాగులోనికి వస్తుంది. నిజానికి వ్యవసాయం క్రింద నీటి పారుదల మీద ఈ సదుపాయాల మీద ఆధారపడినటువంటి రైతుకుటుంబాలకు రైతు కార్మికుల కుటుంబాలకు ఈ రాష్ట్రములో 81 శాతము ఉన్నాయి. వ్యవసాయం బాగుంటే, పంటలు బాగుంటే వాటిమీద బ్రతికే రైతులు సుఖముగా బ్రతికే అవకాశం ఉంది. అందుకని ఇర్రిగేషన్ సెక్టారుకి అత్యధికమైన ప్రాధాన్యత

ఇవ్వడం జరుగుతూ ఉంది. ఫలితాలను పెట్టుబడులను దృష్టిలోనికి తీసుకున్నట్లయితే పెట్టుబడి ఎక్కువ ఫలితాలు తక్కువ ఉండేటువంటి పరిస్థితి బడ్జెట్‌లో ఉండడానికి వీలు లేదు. పెట్టుబడి ఎంతైతే పెడుతున్నామో దానికి తగినట్లు ఫలితాలు అభివృద్ధికరంగా రాబట్టుకోవలసిన అవసరం రాష్ట్రాలకు ఉంది. ఇదివరకు ప్రభుత్వాలను దృష్టిలోనికి తీసుకున్నట్లయితే రీజినల్ ఇంబేలెన్సెస్ ఎక్కువగా ఉన్నాయి. నీటి పారుదల నిమిత్తం ఎంత ఖర్చు పెట్టాము అనేది తప్ప ఏ ప్రాంతానికి ఎంత ఖర్చు పెట్టాము అన్నది లెక్కలోనికి తీసుకోలేదు. ఆరకంగా చూస్తే కొన్ని ఏరియాలు పూర్తిగా నెగ్లెక్టు చేయబడ్డాయి. దాని ఫలితంగానే ఈనాడు ఆందోళనలు జరుగుతున్నాయి. మా ప్రాంతానికి అన్యాయం జరిగింది, మా ప్రాంతానికి అన్యాయం జరిగింది మా ప్రాంతంలో మాకు నీటి సౌకర్యాలు ఏ ప్రభుత్వము కూడా ఏర్పాటు చేయలేదు కాబట్టి ఈ సారి మీరు చేయండి అని చెప్పాల్సిన పరిస్థితులు వస్తున్నాయి. అంతేకాకుండా ఏరియా బ్యాక్‌వర్డునెస్ దృష్టిలోనికి తీసుకోవడం జరగలేదు. వ్యవసాయకరంగా వెనుకబడినటువంటి ప్రాంతం ఏమిటి? సాంఘికంగా వెనుకబడిన ప్రాంతం ఏమిటి అన్నది కూడా ఆలోచనలోనికి తీసుకోవలసిన అవసరం ఉంది. ఇవి అన్నీ కాకుండా ట్రయిబలు ఏరియాలో ట్రయిబల్సును గురించి, కల్టివేషన్ గురించి ఆలోచించిన సమయమే లేదు. అప్‌లాండు ఏరియాకి నీటి పారుదల సౌకర్యాలు ఎట్లా కల్పించాలనే విషయం గతములో ఆలోచన జరగలేదు. మైనర్ ఇర్రిగేషన్ కొన్ని చోట్ల మీడియమ్ ఇర్రిగేషన్ ప్రాధాన్యత సంతరించుకుంటుంది. మేజర్ ఇర్రిగేషను లేనిచోట మైనరు ఇర్రిగేషనుకి సౌకర్యం కల్పించడానికి ఏర్పాట్లు చేయాలి. అట్లాంటి ఏర్పాట్లు చేసినప్పుడు మాత్రమే అక్కడ ఉన్నటువంటి వ్యవసాయము బాగు పడడానికి అవకాశం ఉంటుంది. వీటిని అన్నిటిని దృష్టిలోనికి తీసుకుని చేసిన ప్రభుత్వము ఒక తెలుగుదేశం ప్రభుత్వమే. ఈ ప్రభుత్వంలో ఇంబేలెన్సులన్నిటిని బ్యాలెన్సు చేయడానికి తగిన చర్యలు తీసుకోవడం జరిగింది. అందుకనే న్యూ ప్రాజెక్టులను తీసుకోవడం జరిగింది. రాయలసీమ ప్రాంతంలో అయితేనేమి, తెలంగాణా ప్రాంతంలో అయితేనేమి ఆంధ్ర ప్రాంతంలో అయితేనేమి కొన్ని ప్రాజెక్టులు టేకప్ చేయడం జరిగింది. 7వ ప్రణాళికలో స్టేట్ అవుట్‌లే 1635 కోట్లు రూపాయలు. ఉంటే దీనికి ప్లానింగు కమీషను ఎప్రూవల్ ఇచ్చింది కేవలం 1182.30 కోట్ల రూపాయలకు మాత్రమే. కాని ఏక్చువల్ ఎక్స్‌పెండిచరు 1810 కోట్ల రూపాయలు ఖర్చు పెట్టడం జరిగింది. ఎక్కడైతే మైనరు ఇర్రిగేషను ఫెసిలిటీస్ కల్పించడానికి అవకాశం ఉందో అక్కడ, ఎక్కడైతే అభివృద్ధి చేయడానికి అవసరముందో అక్కడ, రైతులు చేసుకోలేరు వారికి టెక్నికల్ నాలెడ్జి ఉండదు కాబట్టి చేయాల్సిన అవసరం ప్రభుత్వంమీద ఉంది. అందుకనే రిసెర్చి అండ్ ట్రెయినింగు వింగుని ఏర్పాటు చేయడం జరిగింది. వారికి వాటి ద్వారా మైనర్ ఇర్రిగేషన్ ద్వారా అభివృద్ధి చేయడం కొరకు పరిశీలించడం జరిగింది. తరువాత రీజినల్ ఇంబాలెన్సు కూడా మనం దృష్టిలోనికి తీసుకుంటే ఆన్ గోయింగు ప్రాజెక్ట్సుకి

ఆంధ్రప్రాంతంలో 54 శాతము, తెలంగాణాలో 40 శాతము, రాయలసీమ ప్రాంతానికి 6 శాతము మాత్రమే ఆ నాడు ఖర్చు పెట్టడం జరిగింది. ఈ విధంగా ఉన్న రీజినల్ ఇంబాలెన్సుని ఇప్పటివరకు చూసినట్లయితే ఆంధ్రప్రాంతానికి 47 శాతం నుంచి అప్టు 1982–83 తెలంగాణా ప్రాంతానికి 42 శాతము రాయలసీమ ప్రాంతానికి $10\frac{1}{2}$ శాతము ఖర్చు పెట్టడం జరిగింది అని మనకు కనిపిస్తూ ఉంది. ఎంతో ఇంబాలెన్సు వుండి ఆనాడు ప్రాజెక్టులను యీ విధంగా శాంక్షన్ చేయడం జరిగింది అనేది దృష్టిలోనికి తీసుకోవాలి. ఇంకా చెప్పాల్సినది చాల ఉంది టైము అయిపోయింది కాబట్టి నాకు రేపు కూడా అవకాశం ఇవ్వాలని కోరుతూ శలవు తీసుకుంటున్నాను.

Chairman :— You can continue tomorrow. Now the House stands adjourned to meet again at 8–30 A.M. on 2nd March 1989.

(The House then adjourned at 1–30 p.m. to meet again at 8–30 A.M. on Thursday, 2nd March, 1989.)

—:(ooo):—